ఆంధ్రభూమి

www.andhrabhoomi.net

సంపుటి 60 | సంచిక 93 | హైదరాబాద్ సిటీ | హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, రాజమహేంద్రవరం, అనంతపురం, కరీంనగర్, నెల్లూరు

గురువారం, 2 జనవరి 2020 | 20 పేజీలు | ధర: రూ.3.00

శుభోదయం: కలియుగం-5121 • శాలివాహన శకం-1941 • శ్రీ చాంద్రమాన వికారి నామ సంవత్సరం • దక్షిణాయనం • హేమంతఋతువు • పుష్య మాసం • శుక్లపక్షం • తిథి: శుద్ధ సప్తమి సా.6.38 • నక్షత్రం: ఉత్తరాభాద్ర రా.తె.5.38 • వర్జ్యం: మ.1.37 నుండి 3.23 వరకు • దుర్ముహూర్తం: ఉ.10.00 నుండి 10.48 వరకు తిరిగి మ.248 నుండి 3.36 వరకు • రాహుకాలం: మ.1.30 నుండి 3.00 వరకు



బెంగళూరులోని ఇస్రో కార్యాలయంలో బుధవారం విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ శివన్

చంద్రయాన్ 3కి రెడీ

• గతేడాది విజయాలతో ఈ ఏడాది మరిన్ని అద్భుతాలు

• ఇస్రో చైర్మన్ డాక్టర్ శివన్ వెల్లడి

సూళ్లూరుపేట, జనవరి 1: కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది చంద్రయాన్-3కి అనుమతి ఇచ్చిందని, ఈ ప్రాజెక్టు కోసం తమ శాస్త్రవేత్తలు ఇప్పటికే పనులు ప్రారంభించారని ఇస్రో చైర్మన్ డాక్టర్ కె.శివన్ వెల్లడించారు. ఈ మిషన్‌కు దాదాపు రూ.250 కోట్లు ఖర్చవుతుందన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా బుధవారం బెంగుళూరులోని ఇస్రో ప్రధాన కార్యాలయంలో ఆయన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఒక్క సంవత్సరంలోనే ఇస్రో సాధించిన విజయాలు, ప్రస్తుత సంవత్సరంలో సాధించవలసిన ప్రణాళికలను వివరించారు. 2019లో 6 ప్రయోగ వాహనాలు, 7 ఉపగ్రహ మిషన్లు ఇస్రో గుర్తించిందన్నారు. ఈ ఏడాది పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్ (పిఎస్ఎల్‌వి) 50వ ప్రయోగాన్ని నిర్వహించామన్నారు. పిఎస్ఎల్‌వికి చెందిన 2 కొత్త వేరియంటెల్‌ను ప్రవేశ పెట్టినట్లు ఆయన పేర్కొన్నారు. మొదటిసారి పిఎస్ఎల్‌వి గడిపిన నాలుగవ దశ విజయవంతంగా ప్రయోగాత్మక వేదికగా ప్రదర్శించబడిందన్నారు. కెపాసిటి బిల్డింగ్ ఫ్రంట్‌లో స్మాల్ శాటిలైట్ లాంచ్ వెహికల్ (ఎస్ఎస్ఎల్‌వి) కోసం ప్రత్యేకంగా 2వ ప్రయోగ పోర్టును తమిళనాడులోని తూత్తుకుడి జిల్లాలో ఏర్పాటు చేయాలని యోచిస్తున్నట్లు ఆయన తెలిపారు. భూసేరకణ కార్యకలాపాలు ప్రస్తుతం పురోగతిలో వున్నాయన్నారు. ఎస్‌డిఎస్సీ షార్ శ్రీహరికోటలోని 2వ వాహన అసెంబ్లీ భవనం ప్రయోగ పౌనఃపున్యాన్ని పెంచడానికి సంవత్సరంలో దేశానికి అంకితం చేయబడిందన్నారు. మెరుగైన యాక్టివిటీస్ ట్రీచ్ కార్యాచరణలో భాగంగా శ్రీహరికోటలో లాంచ్ వ్యూయింగ్ గాలరీని ప్రజలు ప్రత్యక్షంగా చూడడానికి వీలు కల్పించినట్లు తెలిపారు. ఇస్రో క్షితిజ సమాంతర విస్తరణ దిశగా స్పేస్ టెక్నాలజి సెల్స్, స్పేస్ టెక్నాలజి ఇంక్యుబేషన్ సెంటర్లు, స్పేస్ కోసం ప్రాంతీయ అకడమిక్ సెంటర్లు సంవత్సరంలో స్థాపించామన్నారు. భవిష్యత్తులో ఇలాంటి అనేక కార్యక్రమాలు చేయడానికి ప్రణాళికలు రచిస్తున్నామన్నారు. అంతరిక్ష సాంకేతిక పరిజ్ఞానం, అంతరిక్ష విజ్ఞాన శాస్త్రం, అంతరిక్ష అనువర్తనాలపై ప్రాథమిక జ్ఞానాన్ని అందించే లక్ష్యంతో

- మిగతా 6లో

రాజకీయాలకు దూరం..

ప్రభుత్వ ఆదేశాల మేరకే పనిచేస్తా

• బిపిన్ రావత్ స్పష్టీకరణ • తొలి సీడీఎస్‌గా బాధ్యతలు స్వీకరణ



ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 1: రాజకీయాలకు దూరంగా ఉంటానని, అదే సమయంలో ప్రభుత్వ ఆదేశాల మేరకే పని చేస్తానని భారత తొలి చీఫ్ ఆఫ్ డిఫెన్స్ సర్వీసెస్ (సీడీఎస్)గా బుధవారం పదవీ స్వీకారం చేసిన బిపిన్ రావత్ స్పష్టం చేశారు. సైనిక దళాలు ఎప్పుడు కూడా రాజకీయాలకు దూరంగా ఉంటాయని, అయితే, అధికారంలో ఉన్న వారి ఆదేశాల మేరకు పని చేస్తాయని త్రిదళాల అధిపతిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం విలేఖరులతో మాట్లాడుతూ రావత్ అన్నారు. ప్రభుత్వం ప్రతిపాదించిన విధంగా, మూడు సంవత్సరాల్లో త్రివిధ దళాల మధ్య సమన్వయం సాధించి తీరుతానని రావత్ హామీ ఇచ్చారు. పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)పై జరుగుతున్న విద్యార్థుల ఉద్యమంపై రావత్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయంశమైన విషయం తెలిసిందే. ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ, రాజకీయ పార్టీలు మీ వ్యాఖ్యలను విమర్శిస్తూ సైనిక దళాలు రాజకీయాలకు దూరంగా ఉండాలని సూచించాయని ఒక విలేఖరి పేర్కొగా, 'మేం రాజకీయాలకు దూరంగా ఉంటున్నాం. అదే సమయంలో అధికారంలో ఉన్న వారి ఆదేశాల మేరకు పని చేస్తున్నాం' అని రావత్ స్పష్టం చేశారు. త్రిదళాల అధిపతిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో సమావేశమై సైనిక దళాల భవిష్యత్ కార్యాచరణ గురించి ఆయన చర్చలు జరిపారు. అంతకు ముందు, బాధ్యతలు చేపట్టిన అనంతరం రావత్ త్రివిధ దళాల గౌరవ వందనం స్వీకరించారు. కాగా, ఈ హోదాలో తాను సైనిక, వైమానిక, నావికా దళాల మధ్య సమన్వయం సాధించటంతోపాటు, త్రివిధ దళాల పనిని అనుసంధానం చేస్తానని

- మిగతా 6లో



మాల్యాకు చుక్కెదురు

• రుణాల వసూలుకు చరాస్తులు అమ్మకం

• బ్యాంకులకు ప్రత్యేక కోర్టు అనుమతి

ముంబయి, జనవరి 1: వివిధ బ్యాంకులను మోసగించి విదేశాలకు పారిపోయిన మాజీ లిక్కర్ కింగ్ విజయ్ మాల్యాకు ప్రత్యేక కోర్టులో చుక్కెదురైంది. చెల్లించాల్సిన అప్పులను తీర్చుకోవడానికి ఆయనకు సంబంధించిన చరాస్థులను ఉపయోగించుకోవచ్చని ప్రత్యేక న్యాయస్థానం ఎస్‌బీఐ నేతృత్వంలోని 15 బ్యాంకుల కన్సార్టియంకు అనుమతినిచ్చింది. 2016లో ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ చట్టం (పీ ఎంఎల్ఏ) ప్రత్యేక న్యాయస్థానం మాల్యాకు చెందిన ఆస్తులను బ్యాంకులకు అటాచ్ చేసింది. మాల్యకు బ్రివెరీస్ హోల్డింగ్స్ లి మిటెడ్ (యుబీహెచ్ఎల్)లో షేర్లు ఉన్నాయి. బ్యాంకులకు తిరిగి చెల్లించాల్సిన అప్పులను చెల్లించని ఎగవేతదారునిగా కూడా పీఎంఎల్ఏ కోర్టు ప్రకటించింది. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ ప్రకారం అప్పులు చెల్లించని వారిని అపరాధిగా ప్రకటిస్తుంది. ఆర్థిక నేరస్తునిగా ప్రకటించడమే కాకుండా వారెంట్ జారీ అయినందున మాల్యా చెల్లించాల్సిన అప్పులను తిరిగి రాబట్టుకునేందుకు ఆయనకు సంబంధించిన చరాస్తులను వినియోగించుకోవడానికి ప్రత్యేక కోర్టు మంగళవారం అనుమతించింది. పీఎంఎల్ఏ కోర్టు లోగడ మాల్యాకు చెందిన ఆస్తులను అటాచ్ చేయగా, ఇప్పుడు ఆ అటాచ్‌మెంట్ ఆంక్షలను కోర్టు ఎత్తివేసిందని కన్సార్టియమ్ తరఫున వాదన వినిపిస్తున్న సీనియర్ న్యాయవాది రాజీవ్ పాటిల్ తెలిపారు. అయితే ఈ అటాచ్‌మెంట్ సంగతి తమకు తెలియదని, మాల్యా తరఫు సీనియర్ న్యాయవాది అమిత్ దేశాయ్ తెలిపారు.

ఈ దశాబ్దం టీఆర్ఎస్‌దే!

మరో పదేళ్లపాటు కేసీఆరే సీఎం



• 2020లోనూ టీఆర్ఎస్‌కు శుభారంభమే • మున్సిపల్ ఎన్నికల్లోనూ మాదే విజయం

• కాంగ్రెస్సే మా ప్రధాన ప్రత్యర్థి • ఏళ్లుగా చూస్తున్నా.. బీజేపీలో మార్పు లేదు

• ఎంఐఎంతో స్నేహపూర్వక మైత్రి, కలిసి పోటీ చేయం • మున్సిపల్ చట్టాన్ని కఠినంగా అమలు చేస్తాం

• మీడియాతో ఇష్టాగోష్టిలో టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 1: 'ఈ దశాబ్దం టీఆర్ఎస్‌దే. మరో పదేళ్లపాటు సీఎంగా కేసీఆరే. ఈ 2020 కూడా టీఆర్ఎస్ నామ సంవత్సరం కాబోతోంది. 2019లో జరిగిన ఎన్నికల్లో అన్ని విజయాలను సొంతం చేసుకున్నట్టే ఈ ఏడాది ఆరంభంలో జరిగే మున్సిపల్ ఎన్నికల్లోనూ విజయం సాధించి శుభారంభాన్ని మొదలు పెట్టబోతున్నాం' అని తెలంగాణ రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్, ఐటీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు అన్నారు. అసెంబ్లీ సాక్షిగా మరో పదేళ్లు తానే సీఎంగా ఉంటానని కేసీఆరే చెప్పాక ఇక దానిపై చర్చ అనవసరమని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ భవన్‌లో బుధవారం మీడియాతో ఇష్టాగోష్టిగా కేటీఆర్ ముచ్చటించారు. 'మున్సిపల్ ఎన్నికల్లో సింహ భాగం మేమే గెలుస్తాం. రాజకీయాల్లో ఎత్తుపల్లాలు సహజమే. ఎంపీ ఎన్నికల్లో అనుకున్న ఫలితాలు సాధించకపోయినా, ఆ తర్వాత జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్నింట్లోనూ మేమే విజయం సాధించాం' అని గుర్తు చేశారు. తమకు కాంగ్రెస్ పార్టీయే ప్రధాన ప్రత్యర్థి, కాంగ్రెస్‌ను అంత ఈజీగా తీసుకోవడం లేదని, మున్సిపల్ ఎన్నికల్లో కూడా ఆ పార్టీతోనే తమకు పోటీ ఉంటుందని వివరించారు. బీజేపీ తన చిన్నప్పుడు ఎలా ఉందో

- మిగతా 6లో

నేటి నుంచి 'పల్లె ప్రగతి-2'

పరిశీలనకు అధికార యంత్రాంగం

• 11 రోజుల కార్యక్రమం

• బాగుంటే కితాబు • లేకుంటే చర్యలు

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 1: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'పల్లె ప్రగతి' కార్యక్రమం రెండో దశ గురువారం నుండి ప్రారంభమవుతోంది. దీనిని పల్లె ప్రగతి-2 గా పిలుస్తున్నారు. తొలి దశ పల్లె ప్రగతి కార్యక్రమాన్ని 2019 సెప్టెంబర్ 6 నుండి నెల రోజుల పాటు నిర్వహించారు. మూడు నెలల తర్వాత రెండోదశ కార్యక్రమం చేపడుతున్నారు. గురువారం ప్రారంభమయ్యే రెండోదశ పల్లె ప్రగతి 11 రోజుల పాటు కొనసాగుతుంది. గ్రామాలను హరితహారం ద్వారా పచ్చదనంతో నింపాలని. పరిశుభ్రంగా ఉంచాలన్న ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నారు. మౌలిక సదుపాయాలను కల్పించాలన్న ఉద్దేశంతో తొలిదశలో చేపట్టిన ఈ కార్యక్రమానికి సానుకూల స్పందన వచ్చింది. ఒక వైపు కేంద్ర ప్రభుత్వం, మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులతో పాటు గ్రామ పంచాయతీలు పన్నులు తదితర మార్గాల ద్వారా సమకూర్చుకునే నిధులతో వివిధ పథకాలు చేపట్టాలన్నది ప్రభుత్వం ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. కేంద్రం, రాష్ట్రం కలిసి నెలకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గ్రామ పంచాయతీలకు 339 కోట్ల రూపాయలను విడుదల చేస్తున్నాయి. 300 జనాభా ఉన్న ప్రతి పంచాయతీకీ ప్రభుత్వం 8 లక్షల రూపాయలు సమకూరుస్తోంది. పల్లెప్రగతి-2లో తొలిరోజైన గురువారం గ్రామసభ ఏర్పాటు చేసి, తొలి దశ పల్లె ప్రగతిలో చేపట్టిన పనులను సమీక్షించాలని ఆదేశించారు. 2020-21 సంవత్సరానికి వార్షిక ప్రణాళికను రూపొందించి గ్రామసభ ఆమోదం తీసుకోవాల్సి ఉంటుంది. పంచాయతీలో చేసిన ఖర్చును ప్రజలకు వివరించాల్సి ఉంటుంది. ప్రజలు గ్రామసభలో లేవనెత్తే వివిధ అంశాలను రికార్డు చేసి, వాటిని పరిష్కరించేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. మిషన్ భగీరథ ద్వారా తాగునీటిని ప్రభుత్వమే ఉచితంగా ఇస్తోంది. వీధిలైట్ల ఖర్చును కూడా ప్రభుత్వమే భరిస్తోంది. నర్సరీల ఏర్పాటు, చెత్తవేసే ప్రాంతాల నిర్వహణ (డంపింగ్ యార్డుల) ఏర్పాటు, వైకుంఠధామాలు (శ్మశాన వాటికల) నిర్మాణానికి కూడా ప్రభుత్వం నిధులు ఇస్తోంది. ఇలాఉండగా విద్యకు సంబంధించి పాఠశాల భవనాల నిర్మాణం, అదనపు గదుల నిర్మాణం, దవాఖాన భవనాలు, అంగన్‌వాడీ భవనాల నిర్మాణం తదితరాలకు ప్రభుత్వమే సంబంధిత శాఖల ద్వారా నిధులను ఇస్తోంది. హరితహారంపై ప్రభుత్వం ప్రధానంగా దృష్టి కేంద్రీకరించింది. ప్రతి గ్రామ పంచాయతీలో నర్సరీని ఏర్పాటు చేసి, ఆ గ్రామంలో నాటేందుకు అవసరమైన మొక్కల పెంపకాన్ని చేపడతారు. పల్లె ప్రగతిలో

- మిగతా 6లో

నిరక్షరాస్యుల జాబితా సిద్ధం చేయండి

సీఎస్ సోమేష్ కుమార్ ఆదేశాలు

పల్లె ప్రగతిపై టెలికాన్ఫరెన్స్




జిల్లాల కలెక్టర్లతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేష్ కుమార్

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 1: రాష్ట్ర వ్యాప్తంగా గురువారం నుండి ప్రారంభమవుతున్న పల్లె ప్రగతి-2 కార్యక్రమం సందర్భంగా 18 సంవత్సరాలు పైబడి వయసు ఉండి చదవడం, రాయడం రాని నిరక్షరాస్యుల జాబితాను

- మిగతా 6లో

ఘనగామా





ఆంగ్ల సంవత్సరం ప్రారంభం సందర్భంగా బుధవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌ను కలసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు చెబుతున్న ముఖ్యమంత్రి కేసీఆర్



హైదరాబాద్‌లో అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శనను (నుమాయిష్-2020) బుధవారం ప్రారంభిస్తున్న వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్. చిత్రంలో హోం మంత్రి మహమూద్ అలీ, సినిమాటోగ్రఫీ మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్, నగర మేయర్ బొంతు రామ్మోహన్ తదితరులు -వార్త 6వ పేజీలో

మున్సిపల్ ఎన్నికలపై రిట్

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 1: మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలైంది. నిర్మల్ జిల్లాకు చెందిన కాంగ్రెస్ నేత గణేష్ చక్రవర్తి ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. దీనిపై హైకోర్టులో బుధవారం వాదనలు జరిగాయి. వార్డుల వారీ రిజర్వేషన్లు కేటాయించలేదని, అయినా ఎన్నికల నోటిఫికేషన్‌ను జారీ చేశారని, దీనివల్ల వివిధ పార్టీల నాయకులకు ఇబ్బందిగా మారిందని ఆయన తన పిటిషన్‌లో పేర్కొన్నారు. రిజర్వేషన్ల ప్రకటన, నామినేషన్ల స్వీకరణ మధ్య గడువు తక్కువగా ఉందని, కనీసం వారం రోజులు గడువు ఉండాలని ఆయన పేర్కొన్నారు. గడువు తక్కువగా ఉండటం వల్ల అభ్యర్థులను ఎంపిక చేసుకునేందుకు పార్టీలకు సమయం సరిపోదని ఆయన వాదించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొందని పిటిషనర్ పేర్కొన్నారు. కాగా, హైకోర్టు ఈ పిటిషన్‌ను గురువారానికి వాయిదా వేసింది. హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగా షెడ్యూలులో అవసరమైతే మార్పులు చేసేందుకు వీలుగా అధికారులు కసరత్తు ప్రారంభించారు.



నూతన సంవత్సరం సందర్భంగా సీఎం కేసీఆర్‌ను కలిసిన ఎంపీ సంతోష్‌కుమార్, పల్లా తదితరులు



మంత్రి కేటీఆర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఎంపీ దయాకర్, మంత్రి ఎర్రబెల్లి తదితరులు

సర్వత్రా న్యూ ఇయర్ జోష్

గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్, ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్‌కు శుభాకాంక్షల వెల్లువ

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 1: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని గవర్నర్ రంగరాజన్, ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ను ప్రజా ప్రతినిధులు అధికారులు బుధవారం కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రగతి భవన్‌లో ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావును పలువురు మంత్రులు, ఉన్నతాధికారులు, వివిధ కమిషన్ల, కార్పొరేషన్ల చైర్మన్లతో పాటు పార్టీ సీనియర్ నేతలు కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, పలువురు మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్, డీజీపీ మహేందర్‌రెడ్డితో పాటు పలువురు సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఇంకా ట్రాన్స్‌కో సీఎండి దేవులపల్లి ప్రభాకర్‌రావు, తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ ఘంటా చక్రపాణి, పార్టీ పార్లమెంటరీ నాయకుడు కె కేశవరావు, లోక్‌సభలో పార్టీ పక్షం నాయకుడు నామా నాగేశ్వర్‌రావు తదితరులతో పాటు రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోష్‌కుమార్, రైతు సమన్వయ సమితి చైర్మన్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు శేరి సుభాశ్‌రెడ్డి, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.

రాజ్‌భవన్‌లో కోలాహలం

హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో నూతన సంవత్సరం ప్రారంభం రోజైన బుధవారం కోలాహలం కనిపించింది. అనేక మంది ప్రముఖులు రాజ్‌భవన్ వచ్చి ఈ వేడుకల్లో పాల్గొన్నారు. రాజ్‌భవన్‌లోని దర్బార్ హాలులో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ కొత్త సంవత్సరం సందర్భంగా అందరికీ అందుబాటులో ఉన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కే. చంద్రశేఖరరావు, మంత్రులు సత్యవతి రాథోడ్, వేముల ప్రశాంతరెడ్డి తదితరులు గవర్నర్‌ను కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. రాజ్‌భవన్ చేరుకున్న కేసీఆర్‌కు అధికారులు స్వాగతం పలికారు. కేసీఆర్‌తో గవర్నర్ దంపతులు సిట్టింగ్ రూంలో కొద్దిసేపు మాట్లాడారు. స్నాక్స్, టీ అందించారు. కేసీఆర్‌కు వారు శాలువా కప్పి సన్మానించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా మంగళవారం బాధ్యతలు స్వీకరించిన సోమేష్ కుమార్, మరి కొంత మంది ఐఏఎస్ అధికారులు కూడా గవర్నర్‌ను కలిశారు. డీజీపీ మహేందర్ రెడ్డి, ఇతర పోలీస్ అధికారులు కూడా ఆమెను కలిశారు. యాదగిరిగుట్ట నుండి వచ్చిన పూజారులు గవర్నర్ దంపతులను ఆశీర్వదించి, శ్రీ లక్ష్మీనర్సింహస్వామి ప్రసాదాన్ని, క్యాలండర్‌ను అందించారు. బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయానికి సంబంధించిన బ్రహ్మకుమారీలు గవర్నర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇతర అధికారులు, సామాన్య ప్రజలు గవర్నర్‌ను కలిసి కొత్త సంవత్సరం వేడుకల్లో పాల్గొన్నారు.



కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకొని రాజ్‌భవన్‌లో బుధవారం కేక్ కట్ చేస్తున్న గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్





ముఖ్యమంత్రి కేసీఆర్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న మంత్రులు సత్యవతి రాథోడ్, శ్రీనివాస్ గౌడ్, పువ్వాడ అజయ్





మంత్రి కేటీఆర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలియజేస్తున్న మాజీ స్పీకర్ సిరికొండ, మంత్రులు మల్లారెడ్డి, కొప్పుల ఈశ్వర్

అమల్లోకి వచ్చిన పెరిగిన రైల్వే చార్జీలు

★ విశాఖపట్నం, తిరుపతి, నర్సాపూర్ రైళ్లల్లో ఏసీపై 30, స్లీపర్ 15

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 1: డీజిల్, ఇతర ముడిసరుకుల ధరలు పెరగడంతో రైల్వే చార్జీలు స్వల్పంగా పెంచాల్సి వచ్చిందని దక్షిణ మధ్య రైల్వే పేర్కొంది. దక్షిణ మధ్య రైల్వే జోన్ సికింద్రాబాద్ (హైదరాబాద్) నుంచి వివిధ ప్రాంతలకు నడుస్తున్న ఎక్స్‌ప్రెస్ రైళ్లల్లో పెరిగిన చార్జీల వివరాలను అధికారులు వెల్లడించారు. ప్యాసింజర్ రైళ్లల్లో పాత చార్జీలనే వసూలు చేస్తున్నారు. హైదరాబాద్- న్యూఢిల్లీ వెళ్లే రైళ్లల్లో మొదటి తరగతి ఏసీ రూ.75/ రెండవ, మూడవ తరగతి ఏసీకి రూ. 70 రూపాయలు పెంచారు.. అలాగే, స్లీపర్‌కు రూ.30/ జనరల్ బోగీలకు రూ.25 రూపాయలు పెంచారు. హైదరాబాద్- త్రివేండ్రం మధ్య నడిచే రైళ్లల్లో మొదటి తరగతి ఏసీలో మార్పులేదు. రెండు, మూడు తరగతిలో ఏసీలో రూ. 65 రూపాయలు పెరిగింది. స్లీపర్, జనరల్ బోగీల్లో 30/25 పెరిగింది. హైదరాబాద్- హౌరా (కోల్‌కత్తా) మధ్య నడిచే రైళ్లల్లో అన్ని రకాల ఏసీలో రూ. 65 రూపాయలు పెంచారు. స్లీపర్/ జనరల్ బోగీల్లో 35/30 రూపాయలు పెంచారు. హైదరాబాద్ - ముంబయి మధ్య నడిచే రైళ్లలో మొదటి తరగతి ఏసీలో ఎలాంటి మార్పు లేదు. రెండు, మూడు తరగతి ఏసీల్లో రూ.35 రూపాయలు పెంచారు. స్లీపర్ /జనరల్ బోగీల్లో 20/15 రూపాయలు పెంచారు. హైదరాబాద్ - షిర్డీ మధ్య నడిచే రైళ్లల్లో అన్ని తరగతుల ఏసీలపై రూ.35 పెంచారు. స్లీపర్/ జనరల్ బోగీల్లో 20 నుంచి 15 రూపాయలు పెరిగింది. కాచిగూడ- మైసూర్ మధ్య నడిచే రైళ్లలో అన్ని రైళ్లల్లో ఏసీకి 35 రూపాయలు, స్లీపర్/జనరల్ బోగీల్లో 20/15 రూపాయలు పెంచారు. హైదరాబాద్ -విశాఖపట్నం మధ్య నడిచే రైల్లల్లో అన్ని ఏసీ తరగతుల్లో రూ.30/ స్లీపర్/ జనరల్ బోగీల్లో రూ. 15/15 పెరిగింది. సికింద్రాబాద్ - తిరుపతి మధ్య నడిచే రైళ్లల్లో మొదటి, రెండవ తరగతి ఏసీకి రూ.30, మూడవ తరగతి ఏసీకి 25, స్లీపర్/ జనరల్ బోగీల్లో రూ. 15/15 రూపాయలు పెరిగింది. సికింద్రాబాద్ - షిర్డీ (మన్మాడ్) మధ్య నడిచే రైళ్లల్లో మొదటి ఏసీ 30/ రెండవ, మూడవ ఏసీలో రూ.25/ స్లీపర్/ జనరల్ బోగీల్లో రూ.15 పెంచారు. హైదరాబాద్- నర్సాపూర్ మధ్య నడిచే రైళ్లల్లో అన్ని ఏసీ కోచ్‌ల్లో రూ. 20. స్లీపర్/జనరల్ బోగీల్లో రూ.10/10 పెంచామని దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో రాకేశ్ తెలిపారు.

మున్సి 'పోల్'పై తెరాస కసరత్తు

పార్టీ నేతలతో త్వరలో సీఎం సమావేశం ★ రాష్ట్ర కమిటీతో కేటీఆర్ భేటీ

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 1: రానున్న మున్సిపల్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై రాష్ట్ర కమిటీ, సీనియర్ పార్టీ నేతలతో టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు బుధవారం సాయంత్రం తెలంగాణ భవన్‌లో సమావేశమయ్యారు. గత వారంలో జరిగిన సమావేశంలో చర్చించిన పలు అంశాలకు సంబంధించిన వివరాలను కేటీఆర్ అడిగి తెలుసుకున్నారు. పార్టీ ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు నియోజకవర్గాల వారీగా క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులపై సమాచారాన్ని సేకరించి పార్టీకి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. మున్సిపల్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం, కార్యాచరణపై కేటీఆర్ పలు సూచనలు చేశారు. త్వరలోనే ముఖ్యమంత్రి, పార్టీ అధినేత కేసీఆర్ ఎమ్మెల్యేలు, పార్టీ నేతలతో ఉమ్మడిగా సమావేశాన్ని నిర్వహిస్తారని చెప్పారు. ఆ సమావేశంలో మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ అనుసరించే వ్యూహంపై మార్గదర్శకం చేస్తారని చెప్పారు. ఈ సందర్భంగా పార్టీ నేతలకు కేటీఆర్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేయగా, గత ఏడాది పార్టీ సాధించిన గొప్ప విజయాలను కూడా ఈ ఏడాది కూడా కేటీఆర్ నాయకత్వంలో సాధిస్తామని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.



తెరాస రాష్ట్ర కమిటీతో సమావేశమై పురపాలక సంఘాల ఎన్నికలపై సమీక్షిస్తున్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు

-- రాష్ట్రవ్యాప్తంగా డ్రంకన్ డ్రైవ్ --

ఒక్క రోజు 3,148 మందిపై కేసులు

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 1: న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ఎలాంటి గొడవలు జరుగకుండా తెలంగాణ రాష్ట్ర పోలీసులు కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తును ఏర్పాటు చేసింది. నూతన సంవత్సరం వేడుకల్లో చిన్నపాటి సంఘటనకు తావివ్వకుండా పోలీసులు శాంతి భద్రతలను పర్యవేక్షించారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించిన పోలీసులు ప్రత్యేక పికెట్‌లను ఏర్పాటు చేశారు. కొత్త సంవత్సరం సందర్భంగా డిసెంబర్ 31న అర్ధరాత్రి పోలీసులు ప్రతిచోట పెద్ద ఎత్తున డ్రంకన్ డ్రైవ్‌లు నిర్వహించారు. ఈ తనిఖీలో రాష్ట్ర వ్యాప్తంగా మద్యం సేవించి వాహనాలు నడిపిన 3,148 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధిలో అత్యధికంగా 1,824 కేసులు నమోదయ్యాయి. అయితే మొత్తం మీద డ్రంకన్ డ్రైవ్‌లో పోలీసులు ఒక మహిళపై కేసు నమోదు చేశారు. ఈ కేసు సైబరాబాద్ పరిధిలో నమోదైంది. ఇక అఖరి స్థానంలో నారాయణపేట జిల్లా నిలిచింది. ఇక్కడ కేవలం ఒకే డ్రంకన్ డ్రైవ్ కేసు నమోదు కావడం విశేషం. తాగి ఎవరైనా వాహనం నడిపితే, వారిపై కేసులు నమోదు చేయడంతో పాటు భారీ జరిమానాలు విధించి జైలు పంపుతామని పోలీసులు ముమ్మరంగా ప్రచారం చేసినప్పటికీ మూడు వేల మందిపై కేసులు నమోదు కావడం సోచనీయం. నూతన సంవత్సరం వేడుకల సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ఏలాంటి ఘటనలు చోటు చేసుకోలేదు. నూతన సంవత్సర వేడుకలను ప్రజలు ప్రశాంతంగా జరుపుకున్నారు. నూతన సంవత్సరం వేడుకల్లో మద్యం ఏరులై పారింది. ఉత్సవాల్లో జోష్ నింపడానికి ప్రజలు భారీగా మద్యం కొనుగోలు చేశారు. అదే విధంగా తాగి వాహనాలు నడిపిన వారి సంఖ్య కూడా ఈసారి పెరిగింది. హైదరాబాద్‌లోని మూడు కమిషనరేట్ పరిధుల్లో మంగళవారం రాత్రి నుంచి బుధవారం తెల్లవారుఝాము వరకు పెద్ద సంఖ్యలో డ్రంకన్ డ్రైవ్ కేసులు నమోదయ్యాయి. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో 951, రాచకొండ కమిషనరేట్ పరిధిలో 281, సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో 873 డ్రంకన్ డ్రైవ్ కేసులు నమోదయ్యాయి. అదే విధంగా రాష్ట్ర వ్యాప్తంగా పరిశీలిస్తే నల్గొండ జిల్లాలో 152, కరీంనగర్‌లో 148, వరంగల్‌లో 116, సిద్దిపేట్‌లో 99, జగిత్యాలలో 71, నిజామాబాద్‌లో 65, రాజన్న సీరిసిల్లాలో 48, భద్రాద్రి కొత్తగూడంలో 47, రామగుండంలో 47, ఉంగారెడ్డిలో 36, మహబుబ్‌నగర్‌లో 30, నిర్మల్‌లో 28, మహబుబాబాద్‌లో 23 కేసులు నమోదయ్యాయి.


అటామిక్ మినరల్స్ డైరెక్టర్‌గా డాక్టర్ సిన్హా

హైదరాబాద్, జనవరి 1: అటామిక్ మినరల్స్ డైరెక్టరేట్ ఫర్ ఎక్స్‌ప్లొరేషన్ అండ్ రీసెర్చ్ (ఏఎమ్‌డీ) డైరెక్టర్‌గా డాక్టర్ డీకే సిన్హా బుధవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. సిన్హా ఈ పదవి చేట్టకముందు ఇదే డైరెక్టరేట్‌లో అదనపు డైరెక్టర్‌గా పనిచేశారు. దేశంలో తూర్పు, పశ్చిమ, మధ్య భాగాల్లో భిన్నమైన భౌగోళిక డొమైన్‌లలో విస్తరించిన ఖనిజాల అన్వేషణ్‌లో సిన్హాకు 35 సంవత్సరాల అనుభవం ఉంది. సిన్హా ఆధ్వర్యంలో జరిగిన అన్వేషణ ప్యూహంలో భాగంగా మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, చత్తీస్‌గఢ్, రాజస్థాన్ జార్ఖండ్ రాష్ట్రాల్లో పెద్దఎత్తున అణు ఖనిజాలు బయటపడ్డాయి. దేశంలో యురేనియం అన్వేషణ ప్రోగ్రామ్‌లో అనేక కొత్త అంశాలను వెలికితీశారు. జాతీయ/అంతర్జాతీయ జర్నల్స్‌లో అనేక పరిశోధనలను సిన్హా ప్రచురించారు. దీంతో 100కు పైగా అణులేఖనాలు ఉన్నాయి. వివిధ జాతీయ / ఆంతర్జాతీయ సంఘాల్లో జీవిత కాల సభ్యుడుగా ఉన్నారు. భౌగోళిక అన్వేషణలో అనుభవం సంపాదించడానికి డాక్టర్ సిన్హా దేశంలో విస్తృత పరిశోధలు చేశారు.

కేంద్రం పాలనపై ఉద్యమిస్తాం

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 1: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక పాలనపై ఉద్యమాలు అనివార్యమవుతున్నాయని సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. బుధవారం నాడు ఆయన రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం 2020 నూతన సంవత్సర డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అత్యంత కీలకమైన వృత్తి ఉపాధ్యాయ వృత్తి అని చెప్పారు. నేటి ప్రభుత్వాల అనాలోచిత విధానాల వల్ల ఉపాధ్యాయులకు వృత్తిపరమైన గౌరవం, సరైన జీతభత్యాలు, సౌకర్యాలు లభించకుండా వారి వృత్తి చాలా కష్టతరమైన వృత్తిగా సాగుతోందని అన్నారు. ఉపాధ్యాయులు అందించే విలువలతో కూడిన విద్య సమాజాభివృద్ధికి బాటలు వేస్తుందని ప్రభుత్వాలు గుర్తించాలని అన్నారు. పాపాల పుట్ట ప్రపంచీకరణ ఆర్థిక దోపిడీలో భాగంగా విద్యారంగం కూడా ప్రైవేటీకరణ పాలైందని దీంతో పేదలు విద్యకు దూరం అవుతున్నారని అన్నారు. ప్రజాశ్రేయస్సు పట్టని ప్రభుత్వాలు విద్యారంగం మొత్తం కార్పొరేట్ సంస్థలకు స్వాధీనం చేశారని ఆయన విమర్శించారు. మోదీ ప్రభుత్వంలో పురాణాలను చరిత్రగానూ, చరిత్రను పురాణాలుగా చిత్రీకరిస్తూ, చరిత్రను వక్రీకరిస్తూ ఆర్ఎస్ఎస్ ఆదేశాలతో తప్పుడు పాఠ్యాంశాలను, తప్పుడు పద్ధతుల్లో బోధించడానికి ఉపాధ్యాయులపై ఒత్తిడి తీసుకువస్తున్నారని ఆయన దుయ్యబట్టారు. విద్యార్థులను తీర్చిదిద్దడంలో సృజనాత్మక విద్యతో పాటు వారికి శాస్త్రీయ దృక్పథాన్ని, సక్రమ భావజాలాన్ని అలవర్చడంలో ఉపాధ్యాయులు నిర్మాణాత్మక పాత్ర పోషించాలని అన్నారు. సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సరైన నిధులను కేటాయించక, ప్రోత్సాహం ఇవ్వక విద్యారంగాన్ని వివక్షకు గురిచేస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి జీ సదానందం గౌడ్, కార్యదర్శి వై కరుణాకర్‌రెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ డీ సుధాకర్‌లు పాల్గొన్నారు.



డైరీ ఆవిష్కరిస్తున్న సీపీఐ సురవరం సుధాకర్ రెడ్డి తదితరులు

మళ్లీ సొంత గూటికి రండి!

కాంగ్రెస్ మాజీలకు ఉత్తమ్ పిలుపు ★ 11 మందితో మున్సిపల్ ఎన్నికల మేనిఫెస్టో కమిటీ

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 1: గతంలో కాంగ్రెస్‌లో ఉండి వేరే పార్టీలోకి వెళ్లిన నేతలు తిరిగి సొంత గూటికి చేరుకోవాలని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. గాంధీభవన్‌లో బుధవారం పలువురు పార్టీ మాజీ నాయకులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి సమక్షంలో తిరిగి పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బడుగు, బలహీన వర్గాలు, మైనార్టీలకు ప్రాధాన్యత ఇచ్చే పార్టీ కాంగ్రెస్సేనన్నారు. టీఆర్ఎస్ కుటుంబ పార్టీ అని విమర్శించారు. రాజకీయాలను సీఎం కేసీఆర్ భ్రష్టు పట్టించారని దుయ్యబట్టారు. టీఆర్ఎస్‌వి దిగజారుడు రాజకీయాలని ధ్వజమెత్తారు. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా సీఎం కేసీఆర్‌ను సూటీగా ప్రశ్నిస్తున్నా, నిరుద్యోగ భృతి, రుణ మాఫీ ఏమైందన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో ఎన్నికల హామీలపై ప్రభుత్వాన్ని ఎండగడుతామన్నారు. మున్సిపల్ ఎన్నికలకు కాంగ్రెస్ భయపడుతుందంటూ టీఆర్ఎస్ నాయకులు చౌవకబారు విమర్శలు చేస్తున్నారని విమర్శించారు. ఆరు సార్లు గెలిచిన తాను మున్సిపల్ ఎన్నికలకు భయపడుతానా? అని ప్రశ్నించారు. మున్సిపల్ ఎన్నికల మేనిఫెస్టో కమిటీని పార్టీ రాష్ట్ర ఇంచార్జీ ఆర్‌సి కుంతియా నియమించారు. మాజీ ఎమ్మెల్సీ మాగం రంగారెడ్డి చైర్మన్‌గా 10 మంది సభ్యులతో కమిటీని నియమించినట్టు కుంతియా తెలిపారు.



గాంధీభవన్‌లో బుధవారం మాట్లాడుతున్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

మద్యం మత్తులో యువకుల హల్‌చల్

లాఠీలతో పోలీసుల దేహశుద్ధి ★ నిందితులపై కేసు



సిరిసిల్ల, జనవరి 1: నూతన సంవత్సర వేడుకల్లో కొందరు యువకులు మద్యం సేవించి, రోడ్లపై సీసాలు ధ్వంసం చేసి, దాడులకు పాల్పడ్డారు. దీంతో పోలీసులు వారిని లాఠీలతో చితకబాదారు. మంగళవారం అర్ధరాత్రి దాటాక 12.30 గంటల సమయంలో సిరిసిల్ల పట్టణ శివారులోని చంద్రంపేట రోడ్డుపై జరిగి ఈ సంఘటనలో పోలీసులు కేసు నమోదు చేశారు. ఒక వ్యక్తిపై ఇనుప రాడ్లతో దాడులకు పాల్పడడంతో బాధితుల ఫిర్యాదు మేరకు అక్కడికి వెళ్ళిన పెట్రోలింగ్ పోలీసులు వీరిని చెదరగొట్టి, వారి నుండి ఒక బైక్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు తెలిపారు. అయితే నూతన సంవత్సర వేడుకల్లో యువకులను పోలీసులు లాఠీలతో చితకబాదారని పేర్కొంటూ మీడియాలో కథనాలు రావడం, అలాగే దీనికి సంబంధించిన వీడియో దృశ్యాలు బుధవారం సోషల్ మీడియాలో హల్‌చల్ కావడంతో పోలీసులు ఈ సంఘటనపై కేసు నమోదు చేశారు.


ఈ సందర్భంగా సంఘటనకు సంబంధించి పోలీసుల కథనం ఇలా ఉంది. మంగళవారం రాత్రి 12.30 గంటల సమయంలో సిరిసిల్ల హెచ్‌పీ పెట్రోలు పంపులో ప్రణయ్ అనే వ్యక్తి పెట్రోలు పోసుకుని బంకులోని వ్యక్తికి నూతన సంవత్సర శుభాకాంక్షలు చెబుతుండగా రాజీవ్‌నగర్‌కు చెందిన సోను మరికొందరు ప్రణయ్‌పై దాడి చేసి చితికబాదారు. వీరు ఇనుప రాడ్‌లు పట్టుకుని ఉన్నారని తనకు అపాయం ఉందని, ప్రణయ్ తన మిత్రులకు ఫోన్ చేసి తెలుపగా అతని మిత్రులు దుమాల సతీష్, కోరెం శ్రీనివాస్, ఇతరులు పోయి విచారిస్తుండగా మళ్ళీ వారు ఇనుప రాడ్లు, బీరు సీసాలు పట్టుకుని వీరిపైన దాడి చేసి, కొట్టి గాయపరిచారు. వారి ధాటికి తట్టుకోలేక బాధితులు గస్తీ తిరుగుతున్న పోలీసులకు తెలపడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకుని ఇరు గ్రూపులను వారించే ప్రయత్నం చేసినా వినకపోవడంతో వారిని లాఠీలతో చెదరగొట్టారు.

నిందితుల్లో ఒకరిని రాజీవ్‌నగర్‌కు చెందిన సోనుగా గుర్తించినట్టు తెలిపారు. బాధితుల ఫిర్యాదుపై కేసు నెం.01/2020, సెక్షన్లు 148, 323, 324, 506, 186 రెడ్ విత్ 149 ఐపీసీ ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్టు పోలీసులు ప్రకటన విడుదల చేశారు.

కొట్లాడడమే తెలుసు

దొంగదెబ్బ తీయడం రాదు ★ కోట్లు పెడితే ఓట్లు పడవు ★ నిజాయితీకే పట్టం కడతారు★ ప్రేమాభిమానాలతోనే గెలుపు
నమ్మినవారే ముంచడం బాధే ★ ద్రోహం చేసేవారు బాగుపడరు ★ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్

ఆంధ్రభూమి బ్యూరో



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఈటల రాజేందర్

కరీంనగర్, జనవరి 1: 'నాకు కొట్లాడటమే తెలుసు. కానీ, దొంగదెబ్బ తీయడం, ఓట్లకోసం కోట్లు కుమ్మరించడం తెలియదు. సొంత డబ్బునే ఉపయోగించా, ఎవరి వద్దా చేయి చాచలేదు. కోట్లు ఖర్చు పెడితే ఓట్లు పడవు. నిజాయితీకే ప్రజలు పట్టం కడతారు. నమ్మిన వారే మోసం చేయడం బాధే. ద్రోహం చేసిన వారేం బాగుపడరు' అని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్ మళ్లీ సంచలన వ్యాఖ్యలు చేశారు. బుధవారం కరీంనగర్ జిల్లా జమ్మికుంట దినేష్ ఫంక్షన్ హాలులో హుజూరాబాద్, జమ్మికుంట మున్సిపాలిటీల ముఖ్య కార్యకర్తల మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశం మాజీ మంత్రి, తెరాస పార్టీ ఇన్‌చార్జి బస్వరాజు సారయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న మంత్రి ఈటల రాజేందర్ మాట్లాడుతూ ప్రజలు ధర్మం తప్పరని, అలా చేస్తే తాను గెలిచేవాడినే కాదని అన్నారు. డబ్బు, మద్యానికి ఓట్లు పడతాయనుకోవడం పొరపాటేనని, నిజాయితీకే జనం ఓట్లేస్తారన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి సైతం గతంలో నిధులు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టారని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి హుజూరాబాద్‌లో స్థానమే లేదన్నారు. క్యాంప్ రాజకీయాలు తన వల్ల కాదని, నాయకులను గెలిపించేందుకు కార్యకర్తలు ఎంత కష్టపడతారో తనకు తెలుసని, తమ లీడర్‌ను గెలిపించుకోవడానికి అన్ని ప్రయత్నాలు చేస్తారని ఈటల అన్నారు. అమ్ముడు పోనిది ఆత్మగౌరవం మాత్రమేనని, ప్రజలు ధర్మం తప్పరని, అలా తప్పితే ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచేవాడినే కాదని ఆయన పేర్కొన్నారు. కొంతమంది నాయకులు గెలవక ముందు ఓ విధంగా, గెలిచాక మరోవిధంగా ఉంటారని, అలాంటి వారిని గుర్తుపట్టి టికెట్లు ఇచ్చుకుందామన్నారు. ఎన్నికల్లో పోటీ ఎక్కువ ఉందని, గెలుపు గుర్రాలకే సీట్లిద్దాం, 18 ఏళ్ల రాజకీయ జీవితంలో తాను కొట్లాడినన్ని ఎన్నికలు మరెవరూ కొట్లాడలేదన్నారు. మున్సిపల్ ఎన్నికల రిజర్వేషన్లలో తన ప్రమేయం ఉండదని, రిజర్వేషన్ల కేటాయింపు ఉంటుందని ఎన్నికలనగానే పైసలే, డబ్బుంటేనే టికెట్లు ఇస్తారు, ఓట్లు వస్తాయను కుంటారని, కాని ప్రజాభిమానంతోనే అన్నీ సాధ్యమని ఆయన అన్నారు. తిన్నింటి వాసాలు లెక్కపెట్టే వారివల్ల మనసు గాయపడింది. తాత్కాలికంగా అలాంటి వారికి మేలు జరుగవచ్చు, దీర్ఘకాలికంగా న్యాయమే గెలుస్తుందని ఆయన వ్యాఖ్యానించారు. 'ఈసారి 'బీ' ఫాం నేనే ఇస్తా, హుజూరాబాద్, జమ్మికుంట ప్రజల ఓట్లు అడగడానికి పూర్తి హక్కు ఉన్నవాడిని నేనే, నాదెప్పుడు పేదల పక్షమే' అని అన్నారు. పొరపాటున కూడా తాను ఒకరి దగ్గర చేయి చాచలేదని, కోట్లు ఖర్చు పెట్టినా కానీ సంపాదించుకోలేదని, దివంగత సీఎం వైఎస్సార్ జమ్మికుంట, హుజూరాబాద్ తాగునీళ్ల కోసం డబ్బు అడిగితే ఇవ్వలేదని, ఆ కసితోనే మంత్రి కాగానే రెండు పట్టణాలకు ఒక్కోదానికి రూ.40 కోట్ల జీఓ ఇచ్చా ప్రతి రోడ్డు, నీటి బొట్టు తానిచ్చిందేనన్నారు. నియోజకవర్గంపై తనకు ఎంత ప్రేమ, తపన, ఆరాటముందో అర్థం చేసుకోవాలన్నారు. పనిచేస్తే గెలవమని, సమస్యలుండాలని, వాటితో ప్రజలు మన చుట్టూ తిరగాలి అనేది అప్పటి పార్టీల ఫిలాసఫీ అని, కానీ తాను ఒళ్లు వంచి పనిచేసి అభివృద్ధి చేసి చూపించానని, ఇక్కడ కాంగ్రెస్ అడ్రస్సే లేదని ఆయన అన్నారు. మీలో మీరు కొట్టుకోకుంటే గెలుపు మనదేనన్నారు. ఎమ్మెల్యే, ఎంపీ కంటే కౌన్సిలర్‌గా గెలవడం కష్టం. కష్టపడి నిజాయితీగాఉంటే, గుణగణాలు చూసి జనం ఓట్లేస్తారు. క్యాంప్ రాజకీయాల వల్ల కాదు, ధర్మంగా కొట్లాడడమే తెలుసు, దొంగ దెబ్బ తీయడం చేతకాదు. గెలిచిన వారు విశ్వాసంగా ఉండాలి, మున్సిపల్ ఎన్నికల్లో విజయం మనదేనంటూ రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్ వెల్లడించారు.

ఏపీ, తెలంగాణ ఎన్‌సీసీ డీడీజీగా బాధ్యతలు చేపట్టిన కృష్ణన్

ఆంధ్రభూమి బ్యూరో



టీఎస్ఎస్ కృష్ణన్

హైదరాబాద్, జనవరి 1: ఎయిర్ కమాండర్ టీఎస్ఎస్ కృష్ణన్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎన్‌సీసీ డైరెక్టరేట్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ (డీడీజీ) బాధ్యతలు స్వీకరించారు. 1991లో భారత వైమానిక దళం ఫ్లయింగ్ బ్రాంచ్‌లో నియమించబడిన కృష్ణన్ అర్హత కలిగిన నావిగేషన్ బోధకుడు. 4800 గంటలు ఎగిరే అనుభవం, పెచోర క్షిపణి వ్యవస్థలో అర్హత కలిగిన ఆపరేషన్ ఆఫీసర్ కమాండ్ ఢిల్లీ డైరెక్టరేట్ పరిధిలోని కమాండ్ నావిగేషన్ ఆఫీసర్, కమాండ్ ఇంటెలిజెన్స్ ఆఫీసరర్‌తో పాటు వివిధ కమాండ్ హెడ్ క్వార్టర్స్‌లో సీనియర్ ఫ్లయింగ్ ట్రైనింగ్ ఆఫీసర్, మ్యాప్ డిజిటైజేషన్ సెంటర్‌లో ఇన్‌చార్జి ఆఫీసర్‌గా పనిచేశారు. వివిధ విభాగాలో అనుభవం కలిగిన కృష్ణన్ బుధవారం సికింద్రాబాద్‌లోని ఎన్‌సీసీ డైరెక్టరేట్‌లో డీడీజీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం అధికారులతో సమావేశమయ్యారు.


లౌకికవాద పార్టీలతో కేసీఆర్ కలసి రావాలి

బీజేపీ వ్యతిరేక పార్టీలతో పొత్తుకు సిద్ధం ★ సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

యాదగిరిగుట్ట రూరల్, జనవరి 1: పౌరసత్వ బిల్లుకు వ్యతిరేకంగా పార్లమెంటులో ఓటు వేసిన టీఆర్ఎస్ ప్రభుత్వం దేశంలో పౌరసత్వ చట్టానికి వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ముందుండాలని, దేశంలో బీజేపీ వ్యతిరేక శక్తులపై పోరాటం చేసేందుకు లౌకిక పార్టీలతో కలసి పోరాటానికి ఆయన ముందుకు రావాలని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ కోరారు. బుధవారం యాదగిరిగుట్టలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ మజ్లిస్ పార్టీతో కుమ్మక్కై ఎన్ఆర్‌సీపై ఓటు వేశారని, అయితే దేశంలో ఎన్ఆర్‌సీకి వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటంలో కేసీఆర్ ఎందుకు ముందుకు రావడం లేదని అడుగుతున్నామని అన్నారు.

ముస్లింల ఓట్లు రాబట్టు కోవడం కోసం కేసీఆర్ ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తున్నారని అన్నారు. దేశంలో బీజేపీకి వ్యతిరేకంగా రాష్ట్రంలో టీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా పనిచేసే పార్టీలతో, ప్రజా సంఘాలను కూడగట్టుకుని పోరాటం చేస్తామని అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరించారని, పోరాటం చేసే ఉద్యమ పార్టీలను, ప్రజా సంఘాలను, పౌర సంఘం నేతలు, తెలంగాణ ఉద్యమ కారులపై కేసులు బనాయిస్తున్నారని, తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తరువాత కేసీఆర్ రెండవసారి ముఖ్యమంత్రి అయ్యాక, ఇంటర్ మీడియట్ ఫలితాల్లో జరిగిన అవకతవకల వల్ల అనేక మంది ఇంటర్ విద్యార్థులు ఉసురు తీసుకున్నారని, ఆర్‌టీసీ కార్మికులు తమ న్యాయమైన హక్కుల సాధన కోసం సమ్మె చేసి 30 మంది చనిపోయారని, ఈ చావులకు కేసీఆరే బాధ్యుడని అన్నారు. దేశంలో బీజేపీ వ్యతిరేక శక్తులతో తమ పార్టీ పొత్తు ఉంటుందని అన్నారు. యాదాద్రి పుణ్యక్షేత్రం అభివృద్ధికి తాము అనుకూలం అని, అయితే యాదాద్రి శిల్పాలపై కేసీఆర్ బొమ్మలు చెక్కు కోవడం ఆయన రాజరిక పాలనకు నిదర్శనమని అన్నారు.

ప్రజా ఆగ్రహం ముందు ఎంతటి వారైనా అంతం కాక తప్పదని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు, జిల్లా మహిళా నాయకురాలు బండి జంగమ్మ, జిల్లా బీసీ సెల్ నాయకుడు కల్లెం కృష్ణ, మండల పార్టీ అధ్యక్షుడు బబ్బూరి శ్రీధర్‌గౌడ్, కోకల రవీందర్ పాల్గొన్నారు.



విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

గవర్నర్ తమిళిసై , ముఖ్యమంత్రి కేసీఆర్‌కు యాదాద్రి అర్చక బృందం ఆశీర్వచనాలు







రాజ్‌భవన్‌లో గవర్నర్ దంపతులకు ఆశీర్వచనాలు అందిస్తున్న యాదాద్రి ఆలయ అర్చక బృందం, యాదాద్రి 2020 క్యాలెండర్‌ను, స్వామివారి లడ్డూ ప్రసాదాలను సీఎం కేసీఆర్‌కు అందచేస్తున్న ఈవో గీత, వైటీడీఏ వైస్ చైర్మన్ కిషన్‌రావు

యాదగిరిగుట్ట, జనవరి 1: గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్ దంపతులకు యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం అర్చక బృందం బుధవారం నూతన సంవత్సరం సందర్భంగా ప్రత్యేక ఆశీర్వచనాలు పలికారు. ఈ మేరకు రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు వెళ్లి ఆశీర్వచనాలు పలికి స్వామివారి లడ్డూ ప్రసాదాలు, ఆలయ క్యాలెండర్‌ను అందించారు.

రాజ్‌భవన్‌కు వెళ్లిన ఆలయ స్థానాచార్యులు రాఘవచార్యులు, ఉప ప్రధానార్చకులు రంగాచార్యుల అర్చక బృందం గవర్నర్ దంపతులను కలిసి ఆశీర్వనాలు అందించారు.

క్యాలెండర్ ఆవిష్కరించిన సీఎం

సీఎం కేసీఆర్‌ను నూతన సంవత్సరం పురస్కరించుకుని యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఈవో గీత, వైటీడీఏ వైస్ చైర్మన్ జి.కిషన్‌రావు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఈవో గీత స్వామివారి లడ్డూ ప్రసాదాలను, దేవస్థానం నూతన సంవత్సరం క్యాలెండర్‌ను సీఎం కేసీఆర్‌కు అందచేశారు. కేసీఆర్ 2020 యాదాద్రి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అర్చక బృందం ఆశీర్వచనాలు పలికింది.



గవర్నర్‌కు వినతి పత్రం అందజేస్తున్న బీసీ సంక్షేమ సంఘం నేతలు

50 శాతం రిజర్వేషన్ల పరిమితి ఎత్తివేయాలి

గవర్నర్‌కు బీసీ సంఘాల వినతి

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 1: దేశంలో ఎక్కడలేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో సుప్రీంకోర్టు తీర్పును సాకుగా చూపించి ఎస్సీ, ఎస్టీ బీసీ రిజర్వేషన్లను యాభై శాతం పరిమితి దాటొద్దని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం రాజ్యాంగ విరుద్ధమని, వెంటనే యాభై శాతం పరిమితి ఎత్తివేసి బీసీలకు జనాభా దామాషా ప్రకారం యాభై శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ డిమాండ్ చేసింది. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ గవర్నర్ తమిళసై దృష్టికి తీసుకెళ్లారు. రాజ్‌భవన్‌లో బుధవారం వివిధ బీసీ సంఘాల ప్రతినిధులతో కలిసి వినతిపత్రం అందజేశారు. యాభై శాతం పరిమితి వల్ల ప్రస్తుత మున్సిపల్ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు తగ్గింస్తున్నారని, గతంలో జరిగిన పంచాయితీ రాజ్, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు బారిగా కోత విధించి బీసీలకు అన్యాయం చేశారని ఆయన గుర్తు చేశారు. గవర్నర్‌ను కలిసిన బీసీ ప్రతినిధుల బృందంలో డాక్టర్ విజయ్ భాస్కర్, కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, ఈడిగ శ్రీనివాస్ గౌడ్, తాడికొండ విక్రమ్ గౌడ్, భైరు శేఖర్, డాక్టర్ నీలంకంటేశ్వరావు, కనగాల శ్యాం కుర్మ తదితరులు పాల్గొన్నారు.

రిజిస్టర్డ్ పార్టీలకు 'ఒకే' సింబల్

ఎంపికకు ఐదు రోజుల సమయం ★ ఎస్ఈసీ ఆదేశాలు

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 1: రిజిస్టర్డ్ రాజకీయ పార్టీ తరపున స్థానిక సంస్థల్లో పోటీ చేసే అభ్యర్థులందరికీ ఒకే కామన్ సింబల్ ఇవ్వాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ నిర్ణయించింది. ఈ మేరకు నోటిఫికేషన్ జారీ చేశారు. పార్టీ గుర్తులు కలిగి ఉన్న ప్రాంతీయ, జాతీయ రాజకీయ పార్టీలకు వారి వారి పార్టీ గుర్తులే ఉంటాయి. వీటితో పాటు మరికొన్ని రాజకీయ పార్టీలు రాష్ట్ర ఎన్నికల కమిషన్ వద్ద తమ పార్టీ పేర్లను రిజిస్టర్ చేసుకున్నాయి. ఈ విధంగా రిజిస్టర్ అయిన పార్టీల తరపున పోటీ చేసే అభ్యర్థులకు గతంలో వేర్వేరు గుర్తులు లభించేవి. దాంతో రిజిస్టర్డ్ రాజకీయ పార్టీకి క్షేత్రస్థాయిలో ఇబ్బందులు వచ్చేవి. దాంతో గుర్తులు లేకుండా రిజిస్టర్ అయిన రాజకీయ పార్టీల తరపున పోటీ చేసే అభ్యర్థులందరికీ కామన్‌గా ఒకే గుర్తు లభించేందుకు వీలవుతుంది. స్థానిక సంస్థలైన మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లు, గ్రామ పంచాయితీలు, ఎంపీటీసీలు, జడ్‌పీటీసీల ఎన్నికల్లో ఒకే గుర్తు ఇస్తామని ఎన్నికల కమిషన్ స్పష్టం చేసింది. ఈ మేరకు కమిషన్ కార్యదర్శి పేరుతో నోటిఫికేషన్ జారీ అయింది. ఈ నోటిఫికేషన్ ప్రకారం 2020 జనవరి 4 లోగా రిజిస్టర్డ్ రాజకీయ పార్టీలు తమకు ఇష్టమైన గుర్తులతో కూడిన లేఖను కమిషన్‌కు సమర్పించాల్సి ఉంటుంది. స్థానిక సంస్థల్లో పోటీ చేసే అభ్యర్థులకు ఇప్పటికే కొన్ని గుర్తులను కమిషన్ ఎంపిక చేసి ఒక జాబితాను ప్రకటించింది. ఈ జాబితా నుండి పది గుర్తులను రిజిస్టర్డ్ రాజకీయ పార్టీలు ఎంపిక చేసి కమిషన్‌కు సమర్పించాలని కమిషన్ కార్యదర్శి అశోక్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజకీయ పార్టీలు తమ ప్రాధాన్యతకు అనుగుణంగా ఎంపిక చేసే 10 గుర్తుల్లో మొదటి నుండి ఏదో ఒక గుర్తును కేటాయిస్తామని తెలిపారు. ఇందుకు కొన్ని షరతులను విధించారు.

ఐదేళ్ల చిన్నారిపై అత్యాచారం

ఒంటిపై గాయాలతో బయటపడ్డ నిజం ★ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన తల్లిదండ్రులు
స్థానికుల ఆగ్రహం ★ జాగిలాలతో నిందితుడి కోసం పోలీసుల గాలింపు





జాగిలాలతో నిందితుడి కోసం గాలిస్తున్న పోలీసులు
నిందితుడు కొమురయ్య (ఫైల్‌ఫొటో)

మహాముత్తారం, జనవరి 1: అభం శుభం తెలియని ఐదేళ్ల చిన్నారిని నమ్మించి అర్ధరాత్రి దాటిన తరువాత పత్తి చేనులోకి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డ సంఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలంలోని కోనంపేట గ్రామంలో సంఘటన చోటు చేసుకుంది. పూర్తివివరాల్లోకి వెళితే కోనంపేట గ్రామానికి చెందిన ఐదేళ్ల చిన్నారిని నాగారం గ్రామానికి చెందిన రాచ కొమురయ్య (35) నమ్మించి వారి ఇంటి నుండి మంగళవారం అర్ధరాత్రి దాటిన తరువాత 2 గంటల సమయంలో పత్తిచేనులోకి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డారు. గతంలో కొమురయ్యా బాలిక తల్లి ఇంటికి వస్తూ ఉండేవాడు. ఈ క్రమంలో చిన్నారితో కొంత చనువు ఏర్పడడంతో బిస్కెట్లు, చాక్లెట్లు కొనిస్తుండటంతో ఆ చిన్నారి కూడా కొమురయ్య మాటలు నమ్మి వెళ్లింది. అభం శుభం ఎరుగని చిన్నారిని కొమురయ్య తెల్లవార్లూ తనవద్దే ఉంచుకొని బుధవారం 7 గంటల సమయంలో పంపించడంతో ఆ చిన్నారి నేరుగా తల్లి వద్దకు వచ్చి జరిగిన విషయం తెలపడంతో పాటు ఒంటిపై ఉన్న గాయాలను గుర్తించడంతో అసలు విషయం బయటపడింది. వెంటనే చిన్నారి తల్లి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా డీఎస్పీ బోనాల కిషన్ ఆధ్వర్యంలో సీఐ హతిరాం, ఎస్సై చల్లా రాజుల ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టారు. నిందితుడి కోసం నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి జాగిలాలతో సంఘటనా స్థలాన్ని పరిశీలించి కొమురయ్య కోసం తీవ్రంగా గాలిస్తున్నారు. ఈ సంఘటన మహాముత్తారం మండలంలో సంచలనం రేపగా స్థానికుల్లో కొమురయ్యపై తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి.

సీఎం కేసీఆర్ పిలుపుతో కదిలిన పెన్షనర్ల దండు

★ ఈచ్‌వన్ టీచ్‌వన్‌లో పాల్గొంటామని హామీ
★ ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్‌తో భేటీ

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 1: ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు ఈచ్‌వన్ టీచ్‌వన్ కార్యక్రమంలో పాల్గొంటామని , స్వచ్ఛందంగా సేవలు అందిస్తామని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం నాడు రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్‌కుమార్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ పెన్షనర్ల సంఘం నాయకులు తమ సంసిద్ధతను వ్యక్తం చేశారు. తెలంగాణ పెన్షనర్ల సెంట్రల్ అసోసియేషన్ అధ్యక్షుడు గాజుల నరసయ్య నేతృత్వంలో ప్రధాన కార్యదరిశ ఇనగంటి నవనీతరావు, ఉపాధ్యక్షుడు మహ్మద్ రఫీ ఉద్దీన్, కోశాధికారి ఈ శ్రావణ్‌కుమార్‌లతో కూడిన బృందం వినోద్‌కుమార్‌తో భేటీ అయ్యింది. స్వచ్ఛందంగా ప్రభుత్వానికి వాలంటీర్లుగా పనిచేస్తామని వారు ప్రకటించారు.

రాష్ట్ర వ్యాప్తంగా గ్రామాలు, వార్డులు, పట్టణాలు, బస్తీల్లో పనిచేస్తున్న తాము వాలంటీర్‌గా పనిచేసి కేసీఆర్‌కు అండగా ఉంటామని వారు చెప్పారు. రెవిన్యూ ,పంచాయతీరాజ్, రోడ్లు భవనాలు, హెల్త్, రూరల్ డెవలప్‌మెంట్, అటవీశాఖ వంటి అనేక శాఖల్లో ప్రభుత్వ రంగ సంస్థల్లో సుదీర్ఘకాలంగా ఉద్యోగులుగా విధులు నిర్వహించి రిటైరైన తర్వాత పెన్షన్ తీసుకుంటున్న వారు రాష్ట్ర వ్యాప్తంగా 3.64 లక్షల మంది ఉన్నారని, విద్య, ఆరోగ్యం, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, పరిశుభ్రత వంటి రంగాలతో పాటు సామాజిక రుగ్మతలపై సైనికులుగా పనిచేస్తామని వారు తెలిపారు.

గత రెండేళ్లలో మన దేశంలో 'ఆకుపచ్చదనం' పరిమాణం ఐదువేల నూట ఎనభయి ఎనిమిది చదరపు కిలోమీటర్ల మేర పెరగడం శుభ పరిణామం... స్వచ్ఛ భారత పునర్ నిర్మాణ కార్యక్రమం వేగవంతం కావడానికి దోహదం చేస్తున్న పరిణామం ఇది! వాణిజ్య 'ప్రపంచీకరణ'-'గ్లోబలైజేషన్'- అడవుల పాలిట 'గొడ్డలి'గా మారడం గత ఇరవై ఆరేళ్ల చరిత్ర! రెండు దశాబ్దాలకు పైగా అడవుల విస్తీర్ణం క్రమంగా తగ్గిపోవడానికి కారణం 'ప్రపంచీకరణ'! అడవులను, ఆకుపచ్చని పొలాలను, అరటి తోటలను, తమలపాకు తోటలను, చివరికి కొండలను సైతం విధ్వంసం చేసిన ఆయా స్థలాలలో 'బహుళ జాతీయ వాణిజ్య సంస్థలు', 'సిమెంటు' కట్టడాల ప్రాంగణాలను ఏర్పాటు చేయడం ప్రపంచీకరణ! ఈ 'సిమెంటు' కట్టడాల ప్రాంగణాలు విహార వినోదయాత్రా కేంద్రాలు- టూరిస్ట్ రిసార్ట్‌లు-, 'ప్రత్యేక ఆర్థిక మండలాలు'- స్పెషల్ ఎకనామిక్ జోన్స్- సెజ్‌లు-! ప్రగతి పేరుతో పారిశ్రామిక కేంద్రీకరణ జరిగింది! 'అభివృద్ధి'-'డెవలప్‌మెంట్'- పేరుతో 'హరిత శోభ'ను హననం చేశారు! భూమిని అభివృద్ధి చేయడమన్నది తరతరాల 'భారతీయ జీవన విధానం! అటవీ హరిత శోభలు కొలువుతీరడం యుగయుగాల జాతీయ ప్రస్థానం! అడవుల మధ్యలో మానవ జీవన సంస్కారాలు అంకురించడం చరిత్ర! ఋషి వాటికలు, గురుకులాలు, అధ్యయన ప్రాంగణాలు, సంస్కార పరిమళాలు, వన జనుల నివాసాలు- హరిత శోభల మధ్య అలరారడం భారతీయ సనాతన సంప్రదాయం! గిరిజనులు స్వచ్ఛ మానవీయ మూర్తులుగా, సంస్కారాలకు ప్రతీకలుగా సహస్రాబ్దుల తరబడి యుగాల తరబడి సహజ జీవనప్రస్థానం సాగించడం చరిత్ర, కృత్రిమ నాగరిక కుతంత్రాలు అంటని అడవుల ప్రాంగణాలలో విద్యాబోధన జరగడం చరిత్ర! "భూమి అభివృద్ధి"అంటే నిజానికి ఇదంతా! అడవులలో జంతుజాలం, వృక్షజాలం మనుగడ పరస్పరం పెనవేసుకుని పరిఢవిల్లడం ఈ చరిత్ర! అసంఖ్యాక ఓషధుల నిలయమైన అడవులు మానవుల ఆరోగ్యాన్ని పరిరక్షించాయి, పెంపొందించాయి! అడవుల నుండి స్రవించిన జలాలు ఈ వైవిధ్య ఓషధుల- మందు మొక్కల- స్పర్శతో అమృత వాహినులుగా ప్రవహించడం చరిత్ర! అక్రమ వాణిజ్య భావం అంకురించని వనజనులు, వనవాసులు స్వభావ స్వచ్ఛతా రూపాలుగా భారతావని నలుచెరగులా నడయాడడం చరిత్ర! అడవి ఇలా జాతీయ సంస్కారానికి నందన భూమిక కావడం భారతీయుల అభివృద్ధి... భూమి అభివృద్ధి! 'అభివృద్ధి'అన్న పదానికి అర్థం మారిపోవడం బ్రిటన్ దురాక్రమణకారులు నేర్పిన పాఠం... ప్రపంచీకరణ ఈ పాఠానికి మరింత వక్రీకరణ జోడించింది! చెట్లు, పాడి పశువులు, పంట పొలాలు, పచ్చికలు, ఉడుతలు నిండిన పల్లెలను చూసి నోరు విరిచి, "ఈ పల్లె అభివృద్ధి చెందలేదు, ఈ భూమి అభివృద్ధి-డెవలప్‌మెంట్- కాలేదు..." వ్యాఖ్యానించడం ఆధునిక కృత్రిమ నాగరిక జీవన విన్యాసం! భూమి 'అభివృద్ధి'- డెవలప్‌మెంట్- అని అంటే చెట్లను కొట్టివేయడం, పంటలను పాడుపెట్టడం, పాడి పశువులను

ఆంధ్రభూమి

జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ

గురువారం, 2 జనవరి 2020

అమ్మివేయడం- హత్యచేయడం! పచ్చికలు, ఉడుతలు కనబడని 'సిమెంటు'కట్టడాల ప్రాంగణంగా భూమిని మార్చడం... ఇదీ 'డెవలప్‌మెంట్'!! దశాబ్దుల తరబడి అడవుల హననానికి ఈ కృత్రిమ 'డెవలప్‌మెంట్' ప్రాతిపదిక! పారిశ్రామిక ప్రగతి, పచ్చదనం పరిరక్షణ పరస్పర 'పరిపూరకం'గాను 'పరిపోషకం'గాను సహస్రాబ్దులపాటు మన దేశంలో వికేంద్రీకృత వ్యవస్థ విలసిల్లింది. అందువల్ల పచ్చదనం పాడుపడని రీతిలో పారిశ్రామిక ప్రగతి వికసించింది. మన మాతృభూమి పట్ల మమకారం లేని బ్రిటన్‌వారి బీభత్స పాలన సాగిన

'హరిత' విస్తరణ..

సమయంలో ఈ 'వికేంద్రీకృత' ప్రగతి వ్యవస్థ ధ్వంసమైపోయింది. బ్రిటన్ ప్రభుత్వం మన అడవులను ధ్వంసం చేసి, కలపను తరలించుకొనిపోయింది! ఈ అటవీ విధ్వంసానికి రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో పరాకాష్ఠ ఏర్పడింది. గాంధీ మహాత్ముని స్వదేశీయ ఉద్యమ కార్యకర్తలు ఈ "చెట్లను నరికివేసే కార్యక్రమాన్ని" ప్రతిఘటించడం చరిత్ర! బ్రిటన్ ప్రేరిత వ్యాపారులు అడవులలో చెట్లను నరికి వేయిస్తున్న సమయంలో "కార్యకర్తలు" ప్రతిఘటించడం, సత్యాగ్రహం చేయడం చరిత్ర... ఈ చరిత్ర బ్రిటన్ విముక్త భారత్‌లో కూడ కొనసాగింది! చెట్ల నరికివేతను వ్యతిరేకిస్తూ 'చిప్కో'ఉద్యమం దశాబ్దుల తరబడి కొనసాగడం చరిత్ర! సుందర్‌లాల్ బహుగుణ వంటి 'హరిత పరిరక్షణ' ఉద్యమ నేతల ఆధ్వర్యంలో కార్యకర్తలు చెట్లను కౌగిలించుకొని "గొడ్డళ్ల"ను నిరోధించడం చరిత్ర... కానీ అన్నిటికంటే అతి పెద్ద "గొడ్డలి" ఏర్పడింది. ఈ 'ప్రపంచీకరణ' గొడ్డలికి లక్షల చెట్లు బలి అవుతుండడం నడుస్తున్న చరిత్ర... రహదారులను వెడల్పుచేసే పేరుతో దారులకు ఇరుప్రక్కల ఉన్న మహావృక్షాలను నిర్మూలించడం, నిర్మూలిస్తుండడం!!! 2013వ సంవత్సరంలో వెలువడిన అధికార సమాచారం ప్రకారం ప్రతిరోజు 'మూడువందల ముప్పయి ఎనిమిది ఎకరాల' అడవులు ధ్వంసమయ్యాయి.

గత ఐదేళ్లుగా అటవీ ప్రాంత విస్తీర్ణం- తగ్గిపోవడం మాని- స్థిర పడడం, పెరగడం అందువల్ల సంతోషం కలిగించగల పరిణామం! కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుజరుపుతున్న హరిత పరిరక్షణ కార్యక్రమాలు ఇందుకు కారణం కావచ్చు! తెలంగాణ ప్రభుత్వం పచ్చదనం పెంచడంకోసం 'హరిత హారం'కార్యక్రమాన్ని అమలుచేస్తోంది. ఈ కార్యక్రమంలో భాగంగా రెండువందల కోట్లకు పైగా కొత్త మొక్కలను నాటడం లక్ష్యం... అయితే గత నాలుగేళ్లలో నాటిన కొత్త మొక్కలలో ఎన్ని మారాకులు వేసి, మానులుగా ఎదిగాయన్న వివరాలు లేవు. గత రెండేళ్లలో దేశంలోవలెనే తెలంగాణలో కూడ అడవుల పరిమాణం పెరిగిందన్నది అధికారిక నిర్ధారణ. రెండేళ్ల క్రితంతో పోల్చినప్పుడు రాష్ట్రంలోనూ అరవైమూడు చదరపు కిలోమీటర్ల మేర అటవీ విస్తీర్ణం పెరిగిందట! 'హరిత వైశాల్యాన్ని' రెండు విభాగాలుగా వర్గీకరించినట్టు అధికార గణాంకాలవల్ల వెల్లడైంది. మొదటిది అటవీ విస్తీర్ణం! రెండవది వృక్ష సముదాయ- ట్రీకవర్- విస్తీర్ణం. దేశంలో గత రెండేళ్లలో మూడువేల తొమ్మిది వందల డెబ్బయ్యారు చదరపు కిలోమీటర్ల మేర అడవుల విస్తీర్ణం పెరిగిందట. వృక్ష సముదాయ విస్తీర్ణం పన్నెండు వందల పన్నెండు చదరపు కిలోమీటర్ల మేర పెరిగిందట! అటవీ పరిమాణం, వృక్ష సమూహ విస్తీర్ణ పరిమాణం కలిసి 'ఆకుపచ్చదనం పరిమాణం'-గ్రీన్‌కవర్-గా నిర్ధారిస్తున్నారు. రహదారుల పక్కన, నగరాలలోను పట్టణాలలోను పల్లెలలోను పెరిగిన చెట్లను 'వృక్ష సమూహం'గా గుర్తిస్తున్నారు! తెలంగాణలో నూట అరవై మూడు చదరపు కిలోమీటర్ల మేర అడవుల విస్తీర్ణం పెరిగినప్పటికీ, నూట యాభయి ఐదు చదరపు కిలోమీటర్ల 'వృక్ష సమూహం' ఈ రెండేళ్లలో ధ్వంసమైపోయింది! రహదారుల వెడల్పు పేరుతో విచ్చలవిడిగా చెట్లను నరికివేయడం ఇందుకు కారణం కావచ్చు! ఈ చెట్ల నరికివేతకు వ్యతిరేకంగా తెలంగాణ రాజధాని ప్రాంతంలోను, వివిధ పట్టణాలలోను నిరసనలు చెలరేగుతున్నాయి. ప్రభుత్వం ప్రారంభించిన 'హరిత హారం' ఫలితాలు ఇంకా ప్రస్ఫుటించడం లేదన్నది స్పష్టం. ఆంధ్రప్రదేశ్‌లో గత రెండేళ్లలో తొమ్మిది వందల తొంబయి చదరపు కిలోమీటర్లమేర అటవీ విస్తీర్ణం పెరగడం ముదావహం.

దేశంలోని మొత్తం భూమిలో కనీసం మూడవ వంతు అంటే 'ముప్పయి నాలుగు శాతం' అడవులు పెరగాలన్నది ఆదర్శం! కానీ ఈ లక్ష్యం ఎప్పటికి నెరవేరుతుందన్నది సమాధానం లేని ప్రశ్న. దేశంలో ప్రస్తుతం దాదాపు ఇరవై రెండు శాతం భూభాగం మాత్రమే 'అడవి'గా ఏర్పడి ఉంది... తెలంగాణలో అటవీ విస్తీర్ణం దాదాపు పద్దెనిమిదిన్నర శాతమని, ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు పద్దెనిమిది శాతమని కేంద్ర ప్రభుత్వం ఆవిష్కరించిన అధికార నివేదికలో నిర్ధారించారు. 2029 నాటికి రాష్ట్రం విస్తీర్ణంలో యాభయి శాతం అటవీ భూమి కాగలదని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గతంలో నిర్ధారించింది. ఈ లక్ష్యం నెరవేరుతుందా??

చైనా 'వీగర్ల' స్థితిపై వామపక్షాల మౌనం!

భారతదేశ ముస్లింలు వివక్షకు, అణచివేతకు గురవుతున్నారని చాలాకాలంగా కమ్యూనిస్టులు, నక్సలైట్లు, మావోయిస్టులు, కొందరు లిబరల్స్ ఆరోపిస్తున్నారు. ఆందోళనలు లేవనెత్తారు. పౌరసత్వ సవరణ చట్టం సందర్భంలోనైతే వీధుల్లోకి వచ్చి వీరంగం వేశారు. విధ్వంసాలకు పాల్పడ్డారు. హింసాత్మక సంఘటనలకు తెగబడ్డారు.

ముస్లింల పట్ల ఇంత ప్రేమ ప్రకటించినవారు పొరుగున వున్న చైనాలో అక్కడి కమ్యూనిస్టులు పది లక్షల మంది ముస్లిం 'వీగర్స్'ను నిర్బంధించి, వారి హక్కులను కాలరాచి, వారి స్వేచ్ఛ స్వాతంత్ర్యాలను హననం చేసి, హింసకు-చిత్రహింసలకు గురిచేస్తున్నారని లోకమంతా కోడై కూస్తున్నా ఇక్కడి కమ్యూనిస్టులు, నక్సలైట్లు, మావోలు లిబరల్స్‌లు చీమకుట్టినట్లైనా అనిపించక పోవడాన్ని ఎవరైనా ఎలా అర్థం చేసుకుంటారు?... ఇది పూర్తిగా ద్వంద్వ ప్రమాణంగాక ఏమవుతుంది?... నిజాన్ని... సత్యాన్ని సదా తలపై పెట్టుకుని ప్రపంచానికి చాటాల్సినవారు ఇలా పక్షపాత వైఖరితో వ్యవహరించడం ఏమి యోగ్యమవుతుంది? టర్కీ మూలాలున్న వీగర్ ముస్లిం సముదాయం ఎక్కువగా నివసిస్తున్న షింగ్జాంగ్ ప్రావిన్స్ (ప్రాంతం)లో పెద్దఎత్తున ప్రత్యేక క్యాంపులు ఏర్పాటుచేసి వారిని, "రీ ఎడ్యుకేషన్"పేర వారి మత స్వేచ్ఛను, ఇతర హక్కులను హరిస్తున్నారని ఐక్యరాజ్యసమితితో సహ ఎన్నో సంస్థలు, దేశాలు గగ్గోలుపెడుతున్నా ఇక్కడి వామపక్షాలు, మావోలు పల్లెత్తి మాట కూడ మాట్లాడలేదు. ఖండించలేదు...కరపత్రాలు ముద్రించలేదు.

అంతర్జాతీయ ఇస్లామిక్ ఉగ్రవాదం నేపథ్యంలో షింగ్జాంగ్‌లోని వీగర్ ముస్లింలపై పాలకులు పెద్దఎత్తున నిఘాపెట్టారు. ముందు జాగ్రత్త చర్యల సంస్కరించే నెపంతో, వారికి వివిధ వృత్తుల్లో శిక్షణ ఇచ్చే పేర వారి కదలికలపై-కార్యక్రమాలపై గట్టి నిఘాపెట్టి వారి యువతీయువకులను నిర్బంధించి "బ్రెయిన్‌వాష్"చేస్తున్నారని హక్కుల సంఘాలు ఆరోపిస్తున్నాయి. అమెరికా ఈ విషయమై చైనాను మందలించింది... ఆంక్షలు విధిస్తామని హెచ్చరించింది. అంతర్జాతీయంగా తగుచర్యలు తీసుకుంటామన్నది. ఇంత జరుగుతున్నా, సంవత్సరాల తరబడి ఈ విషయం ఉద్రిక్తతలకు దారితీస్తున్నా వామపక్షాలు-మావోలు మాట మాత్రంగానైనా ఖండించక పోవడాన్ని పరిశీలిస్తే వారికి ముస్లింలపై ప్రేమ, వారి హక్కుల పట్ల చింత, సానుభూతిగాక ఆ ముసుగులో తమ ప్రాబల్యం పెంచుకోవాలనే యావ, దురాలోచన స్పష్టంగా కనిపిస్తోంది.

భారతీయ ముస్లింలు ఎక్కడా లేనంత స్వేచ్ఛ-స్వాతంత్ర్యాలతో జీవిస్తున్నారని అనేక ముస్లిం దేశాలలో ముస్లిం మహిళలకు ఓటు హక్కులేకపోయినా భారతదేశంలో వారికి సమాన హక్కులు, ఓటుహక్కు ఉందని, ముస్లింలకు భారతదేశం స్వర్గధామంగా ఉందని కెనడాలో ఉంటున్న పాకిస్తాన్ ముస్లిం రచయిత, వక్త, మేధావి, ముస్లిం మతంపై సాధికారికంగా మాట్లాడే కమ్యూనిస్టు తారెఖ్‌ఫతే అంటున్నారు. బంగ్లాదేశ్‌కు చెందిన రచయిత్రి తస్లిమా నస్రిన్ సైతం భారతీయతను శ్లాఘిస్తున్నారు. ఇలా ఎందరో ముస్లిం మేధావులు, రచయితలు భారత్‌లో ముస్లింల పరిస్థితి ఎంతో గొప్పగా ఉందని, ఎలాంటి వివక్షకు, అణచివేతకు గురికావడంలేదని జాతీయ-అంతర్జాతీయ వేదికలపై ప్రకటిస్తున్నారు. అనేక రచనలు చేస్తున్నారు. చర్చల్లో పాల్గొని తమతమ అభిప్రాయాలను వ్యక్తంచేస్తున్నారు. అలాగే వివిధ దేశాల్లో ముఖ్యంగా చైనాలో ముస్లింల పరిస్థితిని, అక్కడి మైనార్టీల స్థితిని లోకం దృష్టికి తీసుకొస్తున్నారు. భారతదేశ వామపక్ష-మావోయిస్టు మేధావులు మాత్రం ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. భారతదేశంలో అల్పసంఖ్యాక వర్గాల అణచివేత జరుగుతోందని, బ్రాహ్మణీయ-హిందూ ఫాసిజం విజృంభిస్తోందని అదేపనిగా ఆడిపోసుకుంటూ హింసను, విద్వేషాన్ని ప్రోత్సహిస్తున్నారు. అల్లకల్లోలం సృష్టిస్తున్నారు. నిజాయితీ... నిష్పాక్షికత... వాస్తవికత ఆధారంగా 'సత్యం' సర్వత్రా వర్ధిల్లాలని కోరుకోవలసినవారు ఇలా అసత్యాలతో, అర్ధసత్యాలతో, అతిశయోక్తులతో పౌరులను రెచ్చగొట్టి తమ 'రాజకీయ పబ్బం' గడుపుకోవాలని చూడ్డం విడ్డూరం గాక ఏమవుతుంది?

భారతదేశంలో అంతర్భాగమైన కశ్మీర్‌నుంచి అక్కడి లక్షలాది పండిట్లను ముస్లిం ఉగ్రవాదులు, మత ఛాందసవాదులు రెచ్చిపోయి తరిమేస్తే, విస్థాపనకు గురిచేస్తే, ఆస్తిపాస్తులను కొల్లగొడితే కిమ్మనని వామపక్షాలు... మావోయిస్టు మేధావులు పౌరసత్వ చట్టసవరణ వల్ల వీసమెత్తు నష్టం వారికి జరగదని తెలిసినా, అసలు భారత ముస్లింల సంగతి ఆ చట్టంలో ఓ అక్షరంముక్క లేకపోయినా వామపక్షాలు, లిబరల్స్ వారి మద్దతుదారులు దేశంమొత్తం అల్లకల్లోలం చేయడం వారి మానసిక స్థితిని తేటతెల్లం చేస్తుంది. ఏమి జరగకముందే కల్లోలం సృష్టించిన వారు కశ్మీర్‌లో పండిట్లకు ఎదురైన పరిస్థితి ముస్లింలకు ఎదురైతే దేశం మొత్తం తగులబెట్టే వారేమో?... 21వ శతాబ్దంలో విచక్షణా జ్ఞానం, విజ్ఞత ఇలాగేనే ఉండాల్సింది?... ఇది మానవీయత, నాగరికత అనిపించుకుంటుందా?... నూతన మానవుని ఆదర్శభావన ఇదేనా?..

మానవ హక్కులు, ప్రజాస్వామ్యం, గౌరవం-హుందాతనంగా సమాజాలు విలసిల్లాలని సాధికారత పరిఢవిల్లాలని కోరుకోవలసినవారు ఇంత పక్షపాత వైఖరితో, రాజకీయ లబ్ధిపొందేందుకు వాతావరణాన్ని 'కలుషితం'చేయడం ఏ రకంగా చూసినా అన్యాయమే... అధర్మమే!

ముస్లిం మతస్తులను చైనాలో పూర్తి అనుమానాస్పదంగా, అవాంఛనీయ వ్యక్తులుగా చూస్తున్నారు. ఆ మతాన్ని "ఓ మానసిక రుగ్మత"గా బహిరంగంగా పేర్కొంటున్నారు. విశ్వమానవ కల్యాణం గూర్చిన ఆలోచనలతో పనిచేసే కమ్యూనిస్టు పాలకులే ఇంత బరితెగించి బందిఖానాలు తెరిచి, కాన్సెన్ట్రేషన్ క్యాంపులకు, ఒకప్పటి రష్యాలోని 'గులగ్'లను తలపిస్తూ 'బ్రెయిన్ వాష్'ను భారీస్థాయిలో చేస్తుండగా కిమ్మనివారు భారతదేశంలో ఇలా వీరంగంవేసి- విధ్వంసాలకు పాల్పడటం దుర్మార్గంగాక ఏమవుతుంది?

చైనాలో 1966-76 దశకంలో సాంస్కృతిక విప్లవం సమయంలో జరిగిన అకృత్యాలను, తియన్మన్ స్క్వేర్ దమనకాండను ఇప్పుడు ముస్లింపై జరుపుతున్నారన్న వీగర్ ఆరోపణలు గుప్పుమంటుంటే వాటిగూర్చి ఆలోచన చేయాలి కదా?... కనీసం ఖండించాలి గదా?...

కమ్యూనిస్టు నియంతృత్వం గొప్పదిగా, ఆ సిద్ధాంతాన్ని అంగీకరించేలా, ఆమోదించేలా, ఆచరించేలా వీగర్స్‌పై పెద్దఎత్తున ఒత్తిడిచేస్తున్న చైనా పాలకులు (కమ్యూనిస్టులు) ఇక్కడి కమ్యూనిస్టులకు-మావోయిస్టుకు ముద్దొస్తున్నారు. ప్రజాస్వామ్యం పరిఢవిల్లగా పౌరులందరికీ సమాన హక్కులు కల్పిస్తున్న భారతదేశ ప్రజాస్వామ్యం మాత్రం వారికి అయిష్టంగా కనిపిస్తోంది... అణచివేతకు నిలయంగా దర్శనమిస్తోంది... ఇదెంతటి విడ్డూరమో ప్రతిఒక్కరు ఆలోచించాల్సిన సందర్భమిది.

విలువలను, విజ్ఞానాన్ని, విజ్ఞతను విస్తృతంగా ప్రచారంలోపెట్టి మానవీయతను మహోన్నతంగా నిలపాల్సినవారు ఇలా సంకుచితత్వంతో, పక్షపాతంతో, రాజకీయ లబ్ధికోసం... తమ పలుకుబడికోసం ప్రజల్లో 'విషం'నింపడం దారుణంగాక ఏమవుతుంది?

ఆధునిక టెక్నాలజీని, ఫేస్ రికగ్నిషన్ సాఫ్ట్‌వేర్ సాయంతో వీగర్ ముస్లింల ట్రాకింగ్ చేస్తూ ఈడ్చుకెళ్ళి క్యాంపుల్లోపెట్టి, సంవత్సరాల తరబడి ఓ పద్ధతి ప్రకారం వారిని వదిలించుకోవడానికి చేస్తున్న "చర్యలు" ఇక్కడి కమ్యూనిస్టులకు-మావోయిస్టు మేధావులకు ఆమోదయోగ్యంగా కనిపించడం ఎంతటి విషాదం!

ఒకప్పుడు టిబెట్‌లో అనుసరించిన పాలసీని ఇప్పుడు షింగ్జాంగ్‌లో ప్రవేశపెడుతున్నారు. ఆ ప్రాంతంలో (రాష్ట్రంలో) మెయిన్‌ల్యాండ్స్ చైనీయులను పెద్దఎత్తున దింపుతున్నారు. అలాంటివారికి ఎన్నో రాయితీలుఇస్తూ మెజార్టీ వీగర్లను మైనార్టీలుగామార్చే ప్రయత్నం పెద్దఎత్తున జరుగుతోంది.

అక్కడ భద్రత-నిఘాకోసం బడ్జెట్‌ను రెండింతలు పెంచారు. ఒక పద్ధతి ప్రకారం వారిని లొంగదీసుకునే చర్యలు నిష్కర్షగా కొనసాగుతున్నాయి. రీ-ఎడ్యుకేషన్ పేర సరికొత్తగా 'బ్రెయిన్‌వాష్'కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. కాన్సెన్ట్రేషన్ క్యాంపుల వెలుపల ఉన్న వీగర్ ముస్లింలు మానసికంగా కుంగికృశించిపోతున్నారు. మానసిక వేదనకు గురవుతున్నారు. ఎప్పుడేమి జరుగుతుందో తెలియని అభద్రతాభావంతో కాలం గడుపుతున్నారు. ఎక్కడ చూసినా నిఘా... సివిల్ దుస్తుల్లో పోలీసులు... ఇంతటి దుస్థితిని భారత ముస్లింలు ఏ మూలనైనా ఎదుర్కొంటున్నారా?... రీ-ఎడ్యుకేషన్ పేర నిర్బంధ క్యాంపులు కనిపిస్తున్నాయా?... అనుమానమొస్తే వీధుల్లో బరబరా ఈడ్చుకెళ్ళే దృశ్యాలు అగుపిస్తున్నాయా?... నిర్మానుష్య ప్రాంతంలో బందీఖానాలు కనిపిస్తున్నాయా?... మతంపై, ప్రార్థనలపై, మత క్రతువులపై ఆంక్షలున్నాయా?... ముస్లింలు భారత్‌లో సంపూర్ణ స్వేచ్ఛా-స్వాతంత్ర్యాలతో నివసిస్తున్నట్టుగా ప్రపంచంలో మరెక్కడా జీవించడం లేదని తారెఖ్‌ఫతే లాంటివాళ్ళు అనేక సంవత్సరాలుగా బహిరంగంగా పదే పదే చెబుతున్నా, ఆ స్వరాన్ని పట్టించుకోకుండా తమ రాజకీయ పబ్బంగడుపుకోవడానికి ఇలా 'దేశం'లో చిచ్చుపెట్టడం, అభూత కల్పనలకు పూనుకోవడం ఏ రకంగా న్యాయసమ్మతం?...

- వుప్పల నరసింహం, 9985781799

ఉమ్మడి సివిల్ కోడ్ వచ్చేస్తోందా?

తామ అధికారంలోకి వస్తే ఉమ్మడి పౌర శిక్షాస్మృతి (కామన్ సివిల్ కోడ్)ను అమలు చేస్తామని బీజేపీ ప్రభుత్వం ఎన్నికల ప్రణాళికలో పేర్కొని 303 సీట్లు తెచ్చుకుంది. 2019 ఎన్నికల్లో ఊహించని విధంగా మెజారిటీ సీట్లతో అధికారంలోకి వచ్చిన బీజేపీ ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీని నిలబెట్టుకునేందుకు కసరత్తు చేయాలి. 2014 నుంచి అధికారంలో ఉన్నా, ఇంతవరకు ఈ దిశగా బీజేపీ ఎటువంటి ప్రయత్నం చేసినట్లు కనపడడం లేదు. ఎన్నికల ప్రణాళిక అనేది ప్రతి రాజకీయ పార్టీకి భగవద్గీత లాంటిది. ఇందులో పేర్కొన్న అంశాలను తూచా తప్పకుండా అమలు చేయాలి. కొంత మందికి కోపం వస్తుందనో, లేదా ఓటు బ్యాంకుకు చిల్లు పడుతుందనే అనుమానంతో ప్రాధాన్యత కలిగిన చట్టాలను అటకెక్కిస్తే ప్రజలు క్షమించరు. రాజ్యాంగంలో 370వ అధికరణ, పౌరసత్వ సవరణ చట్టం, ట్రిపుల్ తలాక్ బిల్లులు చట్టరూపం దాల్చాయి. ఇందులో కొన్ని చట్టాలు కొంత మందికి ఆగ్రహం తెప్పించి ఉండవచ్చు. కుహనా లౌకికవాదులు ఈ చట్టాలను తమకు అనుకూలంగా వాడుకునేందుకు చేసిన ప్రయత్నాలను ప్రజలు అంగీకరించరు. బీజేపీ ఎన్నికల ప్రణాళికలో 2019లో చేసిన చట్టాలన్నీ ఉన్నాయి. పౌరసత్వసవరణ చట్టం తెస్తామని బీజేపీ దశాబ్దాలుగా చెబుతూ వస్తోంది. ఆ పార్టీకి 303 సీట్లు ఇచ్చి గెలిపించారు. ఈ రోజు కాంగ్రెస్, వామపక్షపార్టీలు, కొన్ని ప్రాంతీయ పార్టీలకు పౌరసత్వసవరణ చట్టాన్ని వ్యతిరేకించే హక్కు ఉంది. కాని అభం శుభం తెలియని సాధారణ ప్రజలకు అభూతకల్పనలు చెప్పి రెచ్చగొట్టి వారిని వీధుల్లోకి తెచ్చి శాంతి భద్రతల అంశంగా చేశారు.

బీజేపీ మ్యానిఫెస్టోలో పౌరసత్వసవరణ బిల్లులో పాకిస్తాన్, ఆఫ్గనిస్తాన్, బంగ్లాదేశ్‌లో మైనారిటీ వర్గాలకు నిర్ణీత నిబంధనలకు లోబడి పౌరసత్వం కల్పిస్తామని విస్పష్టంగా పేర్కొంది. బీజేపీ కూడా ఇటువంటి చట్టాలను చేసే సమయంలో ప్రజలకు ముందుగా అవగాహన కల్పించి, విస్తృతంగా ప్రచారం చేయాలి. మన దేశంలో నిజాలు తెలిసేసరికి, పుకార్లు షికార్లు చేసి విధ్వంసం సృష్టిస్తాయి. మనం ఎంత అభివృద్ధి చెందినా, ఇంకా మధ్యయుగం నాటి మైండ్ సెట్ నుంచి ప్రజలు బయటపడలేదు. ఈ మనస్తత్వం అన్ని వర్గాల ప్రజల్లో ఉంది.

చట్టాలపై పార్లమెంటులోవివరించే సమయంలో కూడా సంయమనంతో వ్యవహరించాలి. దూకుడు ఎటువంటి పరిస్థితుల్లో పనికిరాదు. ప్రధానంగా సున్నితమైన అంశాలపై చట్టాలను రూపొందించేటప్పుడు కచ్చితంగా ప్రజల్లో అపోహలు కలుగుతాయని భావించాలి. ఈ విషయంలో బీజేపీ విఫలమైంది. పార్లమెంటులో ప్రసంగించే నేతల బాడీలాంగ్వేజీ దురుసుగా, అహంకారపూరితంగా ఉండరాదు. వినమ్రతతో మాట్లాడాలి. పౌరసత్వసవరణ చట్టం విషయంలో పార్లమెంటులో అన్ని పార్టీల నేతలు ఇష్టం వచ్చినట్లు మాట్లాడారు. పౌరసత్వసవరణ చట్టం వల్ల భారతీయ పౌరులకు వచ్చే లాభం, నష్టం ఏమీ లేదు. 1947 దేశ విభజన సమయంలో జరిగిన కొన్ని లోపాలను కొంత మేరకు పూడ్చేందుకు ఉపయోగపడే చట్టమిది. కాని దీనిపై ప్రజల్లో సామాజిక మాధ్యమాల ద్వారా అపోహలను సృష్టించడంలో కుహనా లౌకికవాదులు ప్రయత్నించి రక్తపాతం సృష్టించారు. ప్రజల భావోద్వేగాలతో ఆడుకునేందుకు రాజకీయ పార్టీలు చేసిన దుష్టపన్నాగాలను తిప్పిగొట్టేందుకు వీలుగా ముందుగా సన్నద్ధం కావాల్సి ఉంటుంది. పౌరసత్వ సవరణ చట్టం 1947 దేశ విభజనతో ముడిపడి ఉందనే విషయం ఎంత మందికి తెలుసు. పార్లమెంటు సభ్యుల్లోనే చాలా మందికి తెలియని ఈ అంశం గురించి సాధారణ ప్రజలకు అవగాహన ఉంటుందా ? భవిష్యత్తులో ఈ తరహా చట్టాలు తెచ్చే సమయంలో పాలకులు అప్రమత్తంతో వ్యవహరించాలి.

కామన్ సివిల్ కోడ్‌పై 2020లో బీజేపీ ముందడుగు వేయాలి. ఈ బిల్లుపై ఇప్పటి నుంచి చైతన్యం కల్పించాలి. ఈ కోడ్‌ను కుల,మతాలకు అతీతంగా ప్రతి పౌరుడు ఆహ్వానిస్తారు. భారత్‌లో ఒక్క గోవా రాష్ట్రంలోనే అన్ని మతాల ప్రజలకు కలిపి ఒకటే ఉమ్మడి సివిల్ కోడ్ అమలులో ఉంది. అక్కడ హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు, ఇతర మతాల వారికి ఒకటే పౌర శిక్షాస్మృతి అమలు చేస్తున్నారు. మనకు ప్రస్తుతం హిందూ వివాహ చట్టం 1955, ముస్లిం మహిళల హక్కుల పరిరక్షణ విడాకుల చట్టం, పార్శీ వివాహ, విడాకుల చట్టం అమలులో ఉన్నాయి. హిందువులకు దత్తత, మెయింటెనెన్స్ చట్టాలు ఉన్నాయి. ముస్లింలు, క్రైస్తవులు, పార్శీలకు దత్తత చట్టాలు లేవు. భారత్‌లో క్రిమినల్ ప్రొసిజర్ కోడ్ 1973, ప్రత్యేక వివాహ చట్టం 1954, యూనిఫార్మ్ సివిల్ కోడ్ గోవా , మాత్రమే సెక్యులర్ చట్టాలుగా పిలుస్తారు. 42వ రాజ్యాంగ సవరణ ప్రకారం భారత్ లౌకిక దేశం. ఈ దేశంలో ప్రభుత్వానికి మతం ఉండదు. నిజమైన సెక్యులర్ దేశంగా భారత్ అవతరించాలంటే ఉమ్మడి పౌర శిక్షాస్మృతి చట్టాన్ని తప్పనిసరిగా తీసుకురావాలి. ఆదేశిక సూత్రాల్లో 44వ అధికరణలో కూడా పార్లమెంటు ద్వారా ఉమ్మడి పౌర శిక్షాస్మృతి చట్టం చేసి అమలు చేయాలని పేర్కొన్నారు.

సుప్రీంకోర్టు అనేక సందర్భాల్లో ఉమ్మడి పౌర శిక్షాస్మృతిని పార్లమెంటు రూపొందించాలని ఆదేశించింది. సరళ ముద్గల్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీంకోర్టు సంచలమైన వ్యాఖ్యలు చేసింది. హిందువైన వ్యక్తి మతం మారినంత మాత్రాన రెండో పెళ్లి చేసుకునేందుకు వీలులేదని, మొదటి పెళ్లి మాత్రమే నిలుస్తుందని పేర్కొంది. అందుకే 2017లో ముస్లింల వివాహంలో ఉన్న తలాక్ చెల్లదని కోర్టు తీర్పు ఇచ్చింది. పర్సనల్ లాతో సంబంధం లేకుండా పిల్లలు లేని వారు దత్తత తీసుకోవచ్చని కోర్టు చాలా సార్లు పేర్కొంది. జువెనైల్ జస్టిస్ కేర్ అండ్ ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ చట్టం 2000పై సుప్రీంకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. భార్య సంపాదిస్తుందనే కారణంతో పిల్లలను చూసే బాధ్యత తనకు లేదని ఒక భర్త భావించడం తగదని ఢిల్లీ హైకోర్టు ఒక కేసులో పేర్కొంది.

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని రూపొందించే సమయంలోజరిగిన చర్చల్లో భాగంగా భారత్‌లో ఉమ్మడి పౌర శిక్షాస్మృతి అవసరమని పేర్కొన్నారు. కాని ఆ రోజుల్లో హిందువులు, ముస్లిం రాజకీయ నాయకులు అంబేద్కర్ ప్రతిపాదనను అంగీకరించలేదు. అందుకే అంబేద్కర్ ఆశయాలు నెరవేరాలంటే, తప్పనిసరిగా ఉమ్మడి సివిల్ కోడ్‌ను రూపొందించాల్సిన బాధ్యత కేంద్రంపై ఉంది. భారతదేశ రాజకీయాల్లో ఏ రంగంలో సంస్కరణలు తేవాలన్నా మొదట తీవ్రమైన విమర్శలు ఎదురవుతాయి. ఈ విమర్శలు, నిరసనలు రాజ్యాంగ బద్ధంగా, ప్రజాస్వామ్యయుతంగా ఉండవు. 1956లో మన పార్లమెంటు హిందూ కోడ్ బిల్లును ఆమోదించింది. ఈ కోడ్‌ను చాలా మంది వ్యతిరేకించారు. ఆ నాటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ కూడా ఉమ్మడి సివిల్ కోడ్ అవసరమని నొక్కి వక్కాణించారు. చివరకు మౌనంగా ఉండిపోయారు. బ్రిటీష్ ప్రభుత్వ కాలంలో ఆ నాటి గవర్నర్ జనరల్ ఆఫ్ ఇండియా లార్డ్ విలియం బెంటింక్ సతి సహగమనాన్ని 1829లో నిషేధించారు. దీనిని సతి రెగ్యులేషన్ చట్టమంటారు. అప్పట్లో ఈ చట్టాన్ని ప్రజలు వ్యతిరేకించారు. ఆ తర్వాత దేశమంతా ఈ చట్టాన్ని అమలు చేశారు. ఈ రోజుల్లో బెంగాల్‌లో సంస్కరణ వాదులు ఈశ్వర చంద్ర విద్యాసాగర్, రాజారామ్మోహన్‌రాయ్ లాంటి మహనుభావులు సతి సహగమనాన్ని నిషేధించాలని, వితంతు పునర్వివాహాన్ని ప్రోత్సహించాలని విశేషంగా ప్రచారం చేశారు. హిందూ వితంతువుపునర్వివాహ చట్టం 1856, మహిళా ఆస్తి చట్టం 1923, హిందూ వారసత్వ చట్టం 1928 తదితరమైన విప్లవాత్మక చట్టాలు బ్రిటీష్ వారి కాలంలో వచ్చాయి. మనకు ప్రస్తుతం అమలులో ఉన్న ప్రత్యేక వివాహ చట్టం 1954కు పునాది 1872లో బ్రిటీష్ ప్రభుత్వం అంకురార్పణ చేసింది. మతాన్ని వదులుకుని వివాహం చేసుకోవాలనే నిబంధన ఉండడం, హిందువులకు మాత్రమే పరిమితం కావడంతో, ఈ చట్టం కాగితాలకే పరిమితమైంది. 1923లో ఇదే చట్టాన్ని సవరించి హిందువులు, బౌద్ధులు, జైనులు, సిక్కులకు వర్తింప చేశారు. ఈ చట్టం ప్రకారం మతాన్ని వదులుకోవాల్సిన అవసరం లేదు. ఈ చట్టం కింద వివాహం చేసుకున్న వారికి వారసత్వంగా హక్కులు కూడా కల్పించారు.

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత విశ్లేషిస్తే హిందూ లా కమిటీ పార్లమెంటులో 1948 నుంచి 1951 వరకు, 1951 నుంచి 1954 వరకు హిందూ కోడ్ బిల్లుపై చర్చించింది. తొలి ప్రధాని నెహ్రూ, రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌లు ఉమ్మడి సివిల్ కోడ్ కోసం పోరాడారు. కాని సనాతన వాదులు తిరస్కరించారు. ఉమ్మడి సివిల్ కోడ్ ఉండాలని, హిందూ చట్టాలు అగ్రకులాల వారికి మాత్రమే ప్రయోజనకరమని, సెక్యులర్ దేశమంటే మతాలకు అతీతంగా ఉమ్మడి సివిల్ కోడ్ ఉండాలని అంబేద్కర్ వాదించారు. తొలి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్రప్రసాద్, సర్దార్ వల్లభాయ్ పటేల్‌తో పాటు అనేక హిందూ జాతీయ వాద పార్టీలు, నేతలు ఉమ్మడిసివిల్ కోడ్ ఇప్పుడే అవసరం లేదనే అభిప్రాయం వ్యక్తం చేశారు. దీంతో హిందూ వివాహ చట్టం, వారసత్వ చట్టం, మైనారిటీ, గార్డియన్ షిప్ చట్టం, దత్తత, మెయింటెనెన్స్ చట్టాలను ఆ నాటి పార్లమెంటు ఆమోదం చింది. 1985లో షాబానో కేసుపై సుప్రీంకోర్టు సంచలనమైన తీర్పు ఇచ్చింది. సెక్యులర్ దేశమంటూ పర్సనల్ లా వచ్చేసరికి ప్రతి మతానికి వేరుగా చట్టాలు ఉండడం తగదని కోర్టు పేర్కొంది. ఈ కేసులో షాబానోకు భరణం చెల్లించాలని కోర్టు తీర్పు ఇచ్చింది. సుప్రీంకోర్టు తీర్పు రాజకీయంగా చర్చనీయాంశమైంది. రాజీవ్ గాంధీ హయాంలోనే ముస్లిం మహిళ ప్రొటెక్షన్ ఆఫ్ రైట్స్ ఆన్ డైవర్స్ 1986 చట్టాన్ని పార్లమెంటు ఆమోదించింది.సుప్రీంకోర్టు ఇచ్చిన అనేక తీర్పుల్లో ట్రిపుల్ తలాక్ పద్ధతి చెల్లదని పార్లమెంటు చట్టం చేయాలని ఆదేశించింది. ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం ఈ ఏడాది ట్రిపుల్ తలాక్ రద్దు చేస్తూ కొత్త చట్టం చేసింది. ఉమ్మడి సివిల్ కోడ్ ఉన్న గోవాను పాలించిన పోర్చుగీస్ వలస ప్రభుత్వం ఉమ్మడిసివిల్ కోడ్‌ను అమలు చేశారు. ఆ పద్ధతి ఇప్పటికీ కొనసాగుతోంది.

భారత్‌లో ఉమ్మడి సివిల్ కోడ్ అమలు అనుకున్నంత సులభం కాదు. 130 కోట్ల జనాభాలో 110 కోట్ల మంది హిందువులు, మిగిలిన జనాభాలో ముస్లింలు, క్రైస్తవులు ఉన్నారు. హిందూ వ్యవస్థలో అనేక కులాలు, జాతులు ఉన్నాయి. మన సంస్కృతిలో వివిధ సంప్రదాయాలు, ఆచారాలు ఉన్నాయి. వీటికి అనుగుణంగా ఆయా ప్రాంతాల ప్రజలు జీవనం సాగిస్తుంటారు. కర్నాటకలో వీర శైవ విధానాన్ని ఆచరించే లింగాయత వర్గం తాము హిందువులు కామని, ప్రత్యేక మతంగా గుర్తించాలని కోరుతోంది. బ్రహ్మ సమాజం పద్ధతులు పాటించే వారు కూడా తాము హిందువులు కామని చెబుతారు. సిక్కులు, పార్శీమతస్థుల్లో కూడా వివాహ సంప్రదాయాలు, పద్ధతులు వేరుగా ఉంటాయి. ముస్లింలు తమ పర్సనల్ లా షరియత్‌ను అనుసరిస్తారు. అన్ని వర్గాలను సంతృప్తిపరిచే విధంగా ఏ చట్టం ఉండదు. కాని వివిధ మతాలు, వర్గాలతో విలసిల్లుతున్న భారత్‌లో ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని కేంద్రం నిర్ణయం తీసుకుని ముందడుగు వేయాలి. పౌరసత్వసవరణ చట్టంపై భారతీయులకు వచ్చే నష్టం ఏమీ లేకపోయినా, కుహనా లౌకిక శక్తులు నానాయాగీ చేశాయి. కాని ఉమ్మడి సివిల్ కోడ్ విషయంలో ముందుగా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కేంద్రం సమాయత్తం కావాలి. కనీసం ఏడాది పాటు ఉమ్మడి సివిల్ కోడ్‌పై ప్రజలకు సదస్సులు, సమావేశాల ద్వారా వివరించాలి. లేడికి లేచిందే పరుగు మాదిరిగా ఉమ్మడి సివిల్ కోడ్‌ను సిద్ధం చేసి రోజుల వ్యవధిలో పార్లమెంటులో ఆమోదించి చేతులు దులుపుకునే ప్రక్రియ మంచిది కాదు. ఉమ్మడి సివిల్ కోడ్‌పై ముందుగా పార్లమెంటు సభ్యులకు, రాష్ట్రప్రభుత్వాలకు, రాజకీయ పార్టీలకు అవగాహన కల్పించాలి. హిందువులు, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్శీలు, ముస్లింలు, క్రైస్తవులకు చెందిన మత పెద్దలతో చర్చించాలి. వారిని గౌరవించి సూచనలు, సలహాలు వినాలి. హిందువులకు సంబంధించి తుది నిర్ణయం తీసుకునే పేటెంట్ హక్కులు తమకు ఉన్నట్లుగా బీజేపీ భావించడం తగదు. ప్రజల అభిప్రాయాలను స్వీకరించి, ప్రజాస్వామ్య బద్ధంగా ఉమ్మడి సివిల్ కోడ్‌ను రూపొందించి అమలు చేస్తే భారతావని లౌకిక సుగంధ పరిమళాలను వెదజల్లుతూ వికసిస్తుంది.

- కె. విజయశైలేంద్ర
98499 98097

పౌరసత్వ సవరణ బిల్లుపై అవగాహన

దేశవ్యాప్త పాదయాత్రలు

హిందుత్వం అంటే..మతం కాదు, భారత జీవన విధానమే హిందూ మతం. ప్రపంచంలో అన్ని మతాలకన్నా అన్ని రకాల సంస్కృతులకన్నా హిందుత్వ విధానం చాలా పురాతనమైనది. ఈ భారత జీవన విధానంలో తరతరాలుగా యుగయుగాలుగా ఔదార్యం, ఉదారత్వం, త్యాగం, దానం, మిళితమైపోయాయి. ఈ త్యాగ, ఔదార్యాలవల్లనే ఎంతోమంది విదేశీయులు క్రీస్తుశతాబ్దానికి ముందే భారతదేశానికి వలసవచ్చారు. చుట్టపుచూపుగా వచ్చారు. ఇక్కడే తిష్టవేశారు. మనవాళ్లు అతి మంచితనాన్ని చేతగానితనంగా భావించి చివరకు ఆంగ్లేయులు మన సార్వభౌమాధికారాన్నే దక్కించుకున్నారు. మొగలాయిలు, నైజాములు, ఢిల్లీ సుల్తానులు, బహమనీ సుల్తానులు తదితర ముస్లిం రాజులు అనేకచోట్ల ఎక్కడికక్కడ పోటీ వ్యవస్థలు నడుపుతూ, సమాంతర రాజ్యాలను ఏర్పాటుచేసుకున్నారు. ఈ వర్గానికి చెందిన కొంతమంది కుట్రల ఫలితమే స్వాతంత్ర్యానంతరం పాకిస్థాన్ ఏర్పాటుకు దారితీసింది. స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ ఈ ఏడు దశాబ్దాల కాలంలో ఏ ఒక్కరోజైనా మనం ప్రశాంతంగా నిద్రపోతున్నామా...? అని ప్రశ్నించుకోవలసి వుంది. అడుగడుగునా ఉగ్రవాదుల దాడులు జరుగుతున్నాయి. ఎప్పుడు బాంబులు పేలుతాయో, మరెప్పుడు మందు పాతరలు లేస్తాయో...తెలియని అయోమయ పరిస్థితి. గత పాలకులు భారతదేశంనందలి పదిపదిహేను శాతం మైనార్టీ ప్రజలను బుజ్జగించడానికి 85 శాతం మెజార్టీ ప్రజల హక్కులను కాలరాస్తూ వచ్చారు. పాకిస్థాన్, నేపాల్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్థాన్, చైనా తదితర దేశాలనందు స్థిరపడిన భారతీయులకు రక్షణ లేదు. అక్కడ జీవిస్తున్న హిందువులను, ఇతర మైనర్టీలను పూర్తిగా ద్వితీయశ్రేణి పౌరులుగా భావిస్తూ అడుగడుగునా అవమానించడం ఆనవాయితీగా మారింది. ఈ నేపథ్యంలో అనేక మంది మన దేశానికి వలసవచ్చి మన సంస్కృతీ సాంప్రదాయాలను గౌరవిస్తూ.. మన పాలనావిధానాలకు కట్టుబడి భారతదేశ సార్వభౌమాధికార నిబంధనలను తూ.చ.పాటిస్తూ దశాబ్దాలుగా జీవిస్తున్నారు. ఇటువంటివారికి నేనున్నాననీ...గౌరవ భారత ప్రధాని మోదీ ఎంతో ఉదారత్వంతో ఈ చట్టాన్ని తీసుకొచ్చారు. ఎటొచ్చీ ఒక ప్రత్యేక వర్గం మన దేశంలోకి కేవలం అలజడులు సృష్టించడానికి వస్తూ..పోతూ వుంటుంది. ఈ వర్గం ద్వారానే భారతదేశంలో అనేకచోట్ల బాంబుల పేలుళ్లు జరుగుతున్నాయి. ముఖ్యంగా వీరికి కాశ్మీర్ ప్రాంతం స్వర్గధామంలా వుండేది. ఈ వర్గ ప్రజలు అనేక మెట్రో నగరాలతో పాటు సాదాసీదా పట్టణాల్లో కూడా తిష్టవేయడం ఆయా ప్రాంతాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించడం సర్వసాధారణమై పోయింది. ఇటువంటివారిని సమర్థిస్తున్న శక్తులే పౌరసత్వ సవరణ బిల్లును వ్యతిరేకిస్తున్నాయి. ఈ చట్టం ద్వారా భారతదేశం మరింత పటిష్ఠంకానున్నది. అందుకే.. "పౌరసత్వ సవరణ చట్టం- భారత పరిరక్షణ చట్టం"అంటూ దేశవ్యాప్తంగా పాదయాత్రల ద్వారా ప్రజలను చైతన్యవంతులను చేయాలని భావించాము. ఈ యాత్రలు జనవరి 1న ప్రారంభమయ్యాయి. జనవరి 1న హైదరాబాద్ నందలి సుందరయ్య పార్క్ నుంచి కొన్ని వందల మందితో హైదర్‌గూడ నందలి కేంద్ర హోంశాఖ సహాయమంత్రి జి.కిషన్‌రెడ్డి క్యాంప్ ఆఫీస్ వరకు 3 కి.మీ.లు ప్రారంభ పాదయాత్ర చేశారు. తరువాత 5వ తేదీన కరీంనగర్‌లో ఇదే విధమైన పాదయాత్ర చేయనున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఈ యాత్రలు సాగనున్నాయి. దేశవ్యాప్తంగా పర్యటించబోతున్న షెడ్యూల్‌ను త్వరలో విడుదల చేయనున్నారు.

- తిప్పినేని రామదాసప్పనాయుడు

ఉత్తరాయణం

వెంకన్నబాబు కొందరివాడా?

ఈ మధ్య బెంగుళూరులో ఉన్న మా అమ్మాయి తన కొడుకుతో కలిసి రు.10వేల టిక్కెట్లు కొని దర్శనమునకు తిరుమల వెడితే, రూపాయి ఖర్చు పెట్టని ఒక నేత మరియు 10 మందిని వీరితో పంపించారు. వీరికి సరిఅయిన దర్శనము లభించలేదు. 10వేల రూపాయలు పోసి కొన్నవారికి అల్పదర్శనం, ఫ్రీగా వచ్చిన వారికి పెద్దపీటా? ఇదెక్కడి న్యాయం. అసలు ఈ ప్రముఖులు అన్నవాళ్ళు తిరుమల వస్తే పేపరువారు, టీ.వీల వారు ఎందుకింత ప్రాముఖ్యం ఇస్తారు. దేశంలోగల కోట్లాది మంది లాగే వీరుకూడా వీరి స్వంత కార్యక్రమముగా తిరుమల వస్తారు. దానికి ఇంత హంగు, ఆర్భాటం, గొల్లచావిడి దగ్గర మైకులో ఉపన్యాసములు అవసరమా?

- శిష్టా లక్ష్మీనరసింహమూర్తి, హైదరాబాద్

'జయహో హంపి'

మాస్కో ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్ బరిలోకి దిగిన తెలుగు అమ్మాయి, భారత చెస్ క్వీన్ హంపి ప్రత్యర్థుల ఎత్తులకు పై ఎత్తులు వేసి ఫైనల్‌కి చేరి, ప్రత్యర్థి లీటెంగ్‌జీ (చైనా)తో తుదివరకు పోరాడి ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్ టైటిల్ నెగ్గిన రెండవ భారతీయురాలిగా, తొలి మహిళా గ్రాండ్ మాస్టర్‌గా హంపి చరిత్ర సృష్టించం ప్రతీ భారతీయునికి గర్వంలా నిలిచింది. చెస్ పేరు వినగానే విశ్వనాథన్ ఆనంద్, కోనేరు హంపి పేర్లు వినబడతాయి. హంపి పాపకు జన్మనిచ్చి కుటుంబ బాధ్యతలు మోస్తూనే మరోవైపు పట్టువదలకుండా చెస్ కదనరంగంలో మెళకువలకు పదునుబెట్టి నెంబర్‌వన్‌గా నిలవడం గొప్ప విషయం. **- కామిడి సతీష్‌రెడ్డి, జయశంకర్ భూపాలపల్లి జిల్లా.**

పర్యావరణ పరిరక్షణలో దూకుడు

ఎన్జీటీ పనితీరుపై ప్రశంసలు ❖ ప్రభుత్వాలు, సంస్థలపై కొరడా

న్యూఢిల్లీ, జనవరి 1: పర్యావరణ వివాదాల పరిష్కారంలో జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటీ) సమర్థవంతంగా పనిచేసింది. 2019లో గంగా, యుమున శుద్ధిపై ఎన్జీటీ ప్రత్యేక శ్రద్ధ చూపింది. జలాల శుద్ధికి తక్షణం కేంద్రం కదిలేలా చొరవ తీసుకుంది. గంగా జలాలు ఒక్క చుక్కకూడా కలుషితం కాకుండా చూడాలని ఎన్జీటీ స్పష్టం చేసింది. దానికి తగ్గట్టే చొరవ తీసుకుంది. పర్యావరణ పరిరక్షణ, కాలుష్యంపై గత ఏడాది ట్రిబ్యునల్ అత్యంత బాధ్యతాయుతంగా పనిచేసి ప్రశంసలు అందుకుంది. ప్రభుత్వ యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తూ తనదైన శైలిలో ఎన్జీటీ కృషి జరిపింది. తనకందే ఫిర్యాదులు, పిటిషన్లను సత్వర పరిష్కారానికి చొరవ చూపింది. ప్రాధాన్యతా క్రమంలో ఫిర్యాదులను పరిష్కరించడంతోపాటు సంబంధిత శాఖలను నోటీసులు జారీ చేసింది. కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించిన సందర్భాలూ అనేకం ఉన్నాయి. తదుపరి విచారణ నాటికి హాజరుకాని శాఖల పట్ల కఠినంగానే వ్యవహరించిన ట్రిబ్యునల్ వివాదాల పరిష్కారంలో దూకుడు ప్రదర్శించింది. ఎన్జీటీ సమర్థవంతమైన పనితీరుకు ఉదాహరణ ఆన్‌లైన్ విధానం. ఫిర్యాదులు, పిటిషన్లు ఆన్‌లైన్‌లో చేసుకునే విధానం సంస్థ ప్రారంభించింది. అలాగే మెయిల్స్, లేఖలను స్వీకరించి పిటిషన్లుగా పరిగణించిడం కీలక మలుపు. గడచిన ఏడాది జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ పర్యావరణం విషయంలో అత్యంత కఠినంగా



వ్యవహరించింది. భారీగా జరిమానాలు విధించడం, నష్టపరిహారం రాబట్టడం జరిగింది. పర్యావణం, వాతావరణ కాలుష్యానికి కారణమైన ఏ సంస్థ, లేదా విభాగాన్నీ ఎన్జీటీ వదిలిపెట్టలేదు. కేసుల పరిష్కారం కోసం కేంద్ర, రాష్ట్ర స్థాయిల్లో కమిటీలను ఏర్పాటు చేసి మరీ తనదైన శైలిలో పనిచేసింది.

నిపుణలు, ఐఐటీలు, పర్యావరణ శాస్త్రవేత్తలను కమిటీల్లో నియమించారు. అవసరాన్ని బట్టి సుప్రీం కోర్టు, హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తులను కమిటీల్లోకి తీసుకున్నారు. ఘన వ్యర్థాలు, ప్లాస్టిక్ వ్యర్థాలతో నదులను కలుషితం చేయకుండా కేంద్ర పాలిత ప్రాంతాలు, రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులకు ఎన్జీటీ సమన్లు జారీ చేసింది. నదీ గర్భాల్లో ఇసుక తవ్వకాలు, నగరాల్లో వాయు కాలుష్యంపై సంస్థ నిఘా పెట్టింది. జీవ నదులు కలుషితం కాకుండా ఉండేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. మురుగు నీటి శుద్ధి ప్లాంట్‌లు ఏర్పాటు చేసి జలాల వినియోగానికి ఎన్జీటీ ఎంతో కృషి చేసింది. భూగర్భ జలాల పరిరక్షణకు సంస్థ చర్యలు చేపట్టింది. విచ్చల విడిగా ఆర్వో ప్లాంట్‌లు ఏర్పాటు చేయకుండా గ్రీన్ ట్రిబ్యునల్ కట్టడి చేసింది. గత ఏడాది 122 నగరాలకు సంబంధించి వాయు కాలుష్యం కేసులను ఎన్జీటీ విచారించింది. సెంట్రల్ పాల్యూషన్ కంట్రోల్ బోర్డు(సీపీసీబీ) కార్యాచరణ రూపొందించి అమలుచేసేలా చర్యలు తీసుకుంది. ప్రమాదకరంగా మారిన వాయు కాలుష్యం తీవ్రతను తగ్గించేందుకు ఓ యంత్రాంగం ఏర్పాటు చేయాల్సిందిగా ఎన్జీటీ ఆదేశించింది. అక్రమంగా నడుస్తున్న పారిశ్రామిక యూనిట్లపై కన్నెర్ర చేసింది. దేశ రాజధాని ఢిల్లీలోనే 52,000 ఇండస్ట్రియల్ యూనిట్లు అక్రమంగా నడస్తున్నట్టు గుర్తించారు. ఇవన్నీ నివాసిత ప్రాంతాల మధ్యే నడుస్తున్నాయి. రైల్వే స్టేషన్లకు సంబంధించి 36 ఎకో-స్మార్ట్ స్టేషన్లు ఏర్పాటు చేసి పరిశుభ్రత పాటించాలని ఎన్జీటీ ఆదేశించింది. ఇలా ఉండగా యమునా నది కాలుష్యంపై గ్రీన్ ట్రిబ్యునల్ అనేక సందర్భాల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఢిల్లీ, హర్యానా, యూపీ ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేయడంతోపాటు గ్యారంటీ కింద ఒక్కో రాష్ట్రం పది కోట్ల రూపాయలకు కేటాయించాలని ట్రిబ్యునల్ ఆదేశించింది. తమిళనాడు ప్రభుత్వానికి వంద కోట్ల రూపాయల జరిమానా విధించింది. చెన్నైలోని అడయార్. కూయిం నదుల తీరంలో ఆక్రమణ తొలగింపు విషయంలో ప్రభుత్వం అలక్ష్యం ప్రదర్శించిందని ఎన్జీటీ ఆగ్రహం వ్యక్తం చేస్తూ భారీ జరిమానా వేసింది. కాలుష్యానికి కారణమవుతున్న వాహనాలపై సంస్థ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. జర్మన్ ఆటో దిగ్గజం ఫోక్స్‌వ్యాగన్ కంపెనీకి ఏకంగా 500 కోట్ల రూపాయలు జరిమానా విధించింది. భారత్‌లో డీజిల్ కార్లు విక్రయించడం ద్వారా కాలుష్యానికి కారణమైందని ఫోక్స్‌వ్యాగన్‌పై ఎన్జీటీ మండిపడింది. అలాగే గంగా నది జలాలు కలుషితం కాకుండా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని ఉత్తరాఖండ్, యూపీ ప్రభుత్వాలను ఆదేశించింది.



అమృత్‌సర్‌లోని 'హర్మందిర్ సాహిబ్' (స్వర్ణ దేవాలయం) వద్ద బుధవారం నిర్వహించిన నగర సంకీర్తనలో భాగంగా 'గత్కా' (మార్షల్ ఆర్ట్స్)ను ప్రదర్శిస్తున్న సిక్కులు

'మంచి మిత్రుడిని భారత్ కోల్పోయింది'

ఢాకా, జనవరి 1: బంగ్లాదేశ్ మాజీ విదేశాంగ శాఖ కార్యదర్శి సయ్యద్ ముయాజం అలీ అంత్యక్రియలు బుధవారం ఢాకాలో జరిగాయి. వివిధ దేశాలకు చెందిన ప్రతినిధులు ఆలీ అంత్యక్రియలకు హాజరయ్యారు. మయూజం ఆలీ భారత్‌కు మంచి మిత్రుడనీ.. ఆయన మరణం భారత్‌కు తీరని లోటని పలువురు వక్తలు అంత్యక్రియల అనంతరం జరిగిన ప్రార్థనల్లో పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జరిగిన సంతాప సభలో బంగ్లా విదేశాంగ శాఖ మంత్రి ఏకే అబ్దుల్ మోమిన్, మాజీ ఆర్థిక మంత్రి ఏఎంఏ ముహిత్, మాజీ విదేశాంగ శాఖ మంత్రి ఏహెచ్ మహ్మద్ ఆలీ, ఢాకాలో భారత హై కమిషనర్ రివా గంగూలీ దాస్, మాజీ దౌత్యవేత్తలు, విదేశీ వ్యవహారాల శాఖ సీనియర్ అధికారులు పాల్గొన్నారు. కాగా, సయ్యద్ మయూజం మృతదేహం వద్ద పూలమాలలు ఉంచి శ్రద్ధాంజలి ఘటించిన వారిలో బంగ్లా అధ్యక్షుడి ప్రతినిధి అబ్దుల్ హమీద్, ప్రధాని షేక్ హసీనా తదితరులున్నారు. విదేశాంగ శాఖ మాజీ కార్యదర్శి మయూజం (75) సోమవారం ఢాకాలోని మిలిటరీ ఆసుపత్రిలో కన్నుమూశారు.



చెన్నైలోని తిరుపతి దేవస్థానం వద్ద ఆంగ్ల సంవత్సరాది సందర్భంగా భగవత్ దర్శనం కోసం వేచివున్న భక్తులు

ఆస్ట్రేలియాలో కార్చిచ్చు

సహాయ చర్యల్లో నిమగ్నమైన ప్రభుత్వం

పెర్త్, జనవరి 1: ఆగ్నేయ ఆస్ట్రేలియాలోని న్యూ సౌత్ వేల్స్, విక్టోరియా రాష్ట్రాలను కార్చిచ్చు దహించివేస్తోంది. సోమవారం ఇక్కడి అడవుల్లో ఏర్పడిన మంటల కారణంగా ఇంతవరకు ఏడుగురు మృత్యువాత పడినట్లు తెలుస్తోంది. సముద్ర తీర ప్రాంతం మీదుగా వీస్తున్న గాలుల తీవ్రతకు వేలాది ఇళ్లు అగ్నికి ఆహుతి అవుతున్నాయి. వేలాది మందిని ప్రభుత్వాలు పునరావాస శిబిరాలకు తరలిస్తున్నారు. తీర ప్రాంత పట్టణమైన మల్లకూట నుంచి దాదాపు నాలుగు వేల మంది మంటల నుంచి తప్పించుకొనేందుకు సుదూర ప్రాంతాలకు వెళ్లిపోయారు. తీర ప్రాంతాలతో పాటు ఇతర మైదాన ప్రాంతాలకు విస్తరించిన దావాగ్నితో ఎక్కడి వస్తువులను అక్కడే వదిలివేసి పునరావాస శిబిరాలకు వేలాది మంది వెళ్లిపోయారు. ప్రజలను ఆదుకొనేందుకు ఆస్ట్రేలియా ప్రభుత్వం పెద్దఎత్తున మిలిటరీ ఓడలతో పాటు విమానాలను సైతం మోహరించింది. వీటి ద్వారా నీరు, ఆహార పదార్థాలతో పాటు, ఇంధనాన్ని సరఫరా చేస్తున్నారు. కార్చిచ్చు కారణంగా చాలా ప్రాంతాల్లో ఇళ్ల దగ్ధమై పోగా పలు చోట్ల రోడ్లు కూడా తెగిపోయాయి. దీంతో ఎక్కడికక్కడ రాకపోకలు నిలిచిపోయాయి. మంటలతో పాటు గాలులు తీవ్రంగా వీస్తుండడంతో ఆకాశమంతా దట్టమైన పొగ కమ్ముకుపోవడంతో చాలా ప్రాంతాల్లో దారులు కనిపించడం లేదు. రోడ్డు మార్గం లేని ప్రాంతాలకు ఆస్ట్రేలియా రక్షణ దళాల ద్వారా హెలికాప్టర్లు, విమానాల్లో వారం రోజులకు సరిపడినంతగా ఆహార పదార్థాలను చేరవేస్తున్నట్లు విక్టోరియా ఎమర్జెన్సీ కమిషనర్ ఆండ్రూ క్రిస్ప్ బుధవారం ఇక్కడ విలేఖరులకు తెలిపారు. మంటలను అదుపుచేసేందుకు అగ్నిమాపక సిబ్బంది అహర్నిశలు శ్రమిస్తున్నట్లు ఆయన వివరించారు. బుధవారం కొంతమేర విక్టోరియాలో వాతావరణం చల్లబడినప్పటికీ రాష్ట్ర వ్యాప్తంగా ప్రమాదకర వాతావరణమే నెలకొని ఉందని క్రిస్ప్ పేర్కొన్నారు. న్యూ సౌత్‌వేల్స్‌లోని కంజోలా పార్కులో మంగళవారం నాటి దావాగ్నికి దాదాపు 50కిపైగా ఆస్తులు దగ్ధమైనట్లు ప్రాథమిక సమాచారం. కార్చిచ్చు తీవ్రతకు అనేక కార్లయితే మంటల్లో కరిగిపోయాయి. ఇక్కడ దాదాపు వంద చోట్ల మంటలు కొనసాగుతున్నాయి. పరిస్థితి ప్రమాదకర స్థాయిలో ఉందనీ.. ఒక అగ్నిమాపక సిబ్బందితో పాటు ఏడుగురు ఇప్పటికి మరణించారని అధికార వర్గాలు వెల్లడించాయి. కారులో ఉన్న ఓ వ్యక్తి అక్కడికక్కడే మాడి మసైపోయాడనీ.. తండ్రీ కొడుకులిద్దరు వారి ఇంట్లోనే సజీవదహనం అయ్యారని సమాచారం. సౌత్‌వేల్స్‌లో ఇద్దరి ఆచూకీ కనపడడం లేదు.

వాతావరణంలో అకస్మాత్తుగా వచ్చిన మార్పును ఎప్పటికప్పుడు ప్రధాని స్కాట్ మోరిసన్ సమీక్షిస్తూ చర్యలు తీసుకొంటున్నారు. ప్రపంచంలోనే బొగ్గుతో పాటు ఎల్‌పీజీని ఎగుమతి చేసే దేశాల్లో మొదటి స్థానంలో ఉన్న సంగతి తెలిసిందే. కాగా, ఇటీవలి కాలంలో ఆస్ట్రేలియా వ్యాప్తంగా దాదాపు ఐదు మిలియన్ హెక్టార్లలోని పంట అగ్నికి ఆహుతి కాగా, పదుల సంఖ్యలో జనం చనిపోయారనీ.. దాదాపు వెయ్యిళ్లు దగ్ధమయ్యాయని అధికార వర్గాల సమాచారం.

బంధువు అంత్యక్రియలకు
ఎన్‌సీ నేత సాగర్‌కు అనుమతి

శ్రీనగర్, జనవరి 1: రాజ్యాంగంలోని 370వ అధికరణ రద్దు అనంతరం నిర్బంధంలో ఉన్న నేషనల్ కాన్ఫరెన్స్ ప్రధాన కార్యదర్శి అలీ మహ్మద్ సాగర్‌ను ఆయన బంధువు అంత్యక్రియలకు హాజరయ్యేందుకు సంబంధిత అధికారులు బుధవారం అనుమతినిచ్చారు. సాగర్‌తో పాటు ఆయన కుమారుడు సల్మాన్ సాగర్ ప్రస్తుతం ఎమ్మెల్యే హాస్టల్ సబ్ జైలులో ఆగస్టు ఐదో తేదీ నుంచి పోలీసుల నిర్బంధంలో ఉన్నారు. ఈ నేపథ్యంలో సాగర్ మామ అయిన గులాం మహ్మద్ కవా జమాలత్ నవకదల్‌లో అస్వస్థతతో చనిపోయారు. దీంతో కవా అంత్యక్రియలు, ప్రార్థనల నిమిత్తం హాజరయ్యేందుకు సాగర్‌ను కుమారుడు సల్మాన్ సాగర్‌లకు అధికార యంత్రాంగం అనుమతి ఇచ్చింది. స్వల్ప అస్వస్థతతో సాగర్ మామ జమాలత్‌లోని ఆయన స్వగృహంలో చనిపోయారని.. ఆయన అంత్యక్రియలు, ప్రార్థనల నిమిత్తం సాగర్‌కు అనుమతి ఇచ్చామని ఎమ్మెల్యే హాస్టల్ పోలీసు అధికారులు స్పష్టం చేశారు. సాగర్, అతని కుమారుడు విజ్ఞప్తి మేరకు కవా అంత్యక్రియలు, ప్రార్థనలకు అనుమతి ఇచ్చినట్లు వీరు పేర్కొన్నారు.

పాటలు, పద్యాలతో
సీఏఏ వ్యతిరేక ప్రదర్శన

న్యూఢిల్లీ, జనవరి 1: పలువురు సామాజిక కార్యకర్తలు, కళాకారులు బుధవారం ఢిల్లీలో పాటలు, పద్యాలు పాడుతూ పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) వ్యతిరేక ప్రదర్శన నిర్వహించారు. సఫ్దార్ హష్మి స్మారక ట్రస్ట్ (ఎస్ఏహెచ్ఎంఏటీ) ఆధ్వర్యంలో కానిస్టిట్యూషన్ క్లబ్ ఆఫ్ ఇండియా వద్ద వీరంతా సమావేశమయ్యారు. 1989లో సఫ్దార్ హత్యకు గురైన విషయం ఆయన సోదరుడు సోహేల్ హష్మి ఈ సందర్భంగా గుర్తు చేశారు. జనవరి 1వ తేదీన సాహిబాబాద్ వద్ద ఓ ప్రదర్శన నిర్వహిస్తున్న సమయంలో తన సోదరుడిపై దాడి జరిగిందని ఆయన చెప్పారు. అప్పటినుంచి ప్రతి యేటా అదే రోజున వివిధ అంశాలతో ప్రజలను చైతన్యవంతులను చేయడానికి ప్రదర్శన నిర్వహిస్తున్నట్టు ఆయన చెప్పారు. జమ్మూకాశ్మీర్‌కు స్వతంత్ర ప్రతిపత్తిని కల్పించిన రాజ్యాంగంలో 370 అధికరణను రద్దు చేయడం, సీఏఏను అమల్లోకి తీసుకురావడం వంటి చారిత్రాత్మక తప్పిదాలకు కేంద్రం పాల్పడిందని ఆయన విమర్శించారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకునే వరకు సీఏఏ వ్యతిరేక ఆందోళనకు ఎస్ఏహెచ్ఎంఏటీ మద్దతు ఇస్తుందని ఆయన స్పష్టం చేశారు.

భారత్ సరిహద్దుల్లో
మొబైల్ నెట్‌వర్క్
పునరుద్ధరించిన బంగ్లాదేశ్

ఢాకా, జనవరి 1: భారత దేశ సరిహద్దుల్లో సుమారు నాలుగు వేల కిలోమీటర్ల పొడవున మొబైల్ నెట్ వర్క్‌లను మూసి వేసిన బంగ్లాదేశ్ ప్రభుత్వం రెండు రోజుల్లోనే తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. మొబైల్ నెట్ వర్క్‌లను పునరుద్ధరించాల్సిందిగా బంగ్లా ప్రభుత్వం బంగ్లాదేశ్ టెలి కమ్యూనికేషన్ రెగ్యులేటరీ కమిషన్ (బీటీఆర్‌సీ)ను ఆదేశించింది. అంతకు ముందు అంటే ఆదివారం ప్రభుత్వం ఇచ్చిన ఆదేశంతో బీటీఆర్‌సీ రెండు వేల ప్రధాన స్టేషన్లలో సర్వీసులను నిలిపి వేసింది. ఫలితంగా 32 జిల్లాల్లో సుమారు కోటి మంది ఫోన్లు పని చేయడం మానేసాయి. భారత దేశం, మయన్మార్‌ల సరిహద్దుల్లో ఈ నెట్ వర్క్‌లు నిలిచి పోయాయి. భారత దేశ ప్రభుత్వం పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) చేయడంతో పెద్ద ఎత్తున వలసదారులు తమ దేశంలోకి వచ్చేస్తారన్న భావనతో బంగ్లాదేశ్ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నదని సమాచారం. అయితే బంగ్లా ప్రభుత్వం ఎటువంటి కారణం చెప్పకుండానే మొబైల్ నెట్‌వర్క్‌లను పునరుద్ధరించాల్సిందిగా బీటీఆర్‌సికి ఆదేశాలు జారీ చేసింది.

దౌత్య సిబ్బంది రక్షణ బాధ్యత ప్రభుత్వానిదే

శ్రీలంక ఘటనపై స్విట్జర్లాండ్ ఎంబసీ

కొలంబో, జనవరి 1: ఏ దేశంలో తమ దౌత్య మిషన్ ఉంటే, ఆ దౌత్య మిషన్‌కు భద్రత కల్పించాల్సిన బాధ్యత సదరు దేశానిదేనని శ్రీలంకలోని స్విట్జర్లాండ్ ఎంబసీ పేర్కొంది. తనపై దాడి జరిగిందని ఫిర్యాదు చేసిన ఇక్కడి స్విట్జర్లాండ్ ఎంబసీలోని ఒక మహిళా ఉద్యోగిని శ్రీలంక ప్రభుత్వం అరెస్టు చేసి, బెయిల్‌పై విడుదల చేసిన కొన్ని రోజులకు ఎంబసీ ఈ వ్యాఖ్యలు చేసింది. కొంతమంది నవంబర్ 25వ తేదీన తనను అపహరించి, కొన్ని గంటల పాటు నిర్బంధించారని, ఆ సమయంలో తనపై లైంగిక దాడికి పాల్పడ్డారని, ఎంబసీకి సంబంధించిన సమాచారం చెప్పాలని తనను బెదిరించారని ఆ మహిళా ఉద్యోగి ఫిర్యాదు చేశారు. అయితే, ఆ మహిళా ఉద్యోగి శ్రీలంక ప్రభుత్వంపై విరోధ భావము కలిగించేలా ప్రకటనలు చేశారని, తప్పుడు సాక్ష్యాలు సృష్టించారని ప్రభుత్వం ఆరోపించింది. అంతేకాకుండా ఈ అభియోగాలపై ఆమెను అరెస్టు చేసింది. ఈ అభియోగాలపై రెండు వారాల పాటు దర్యాప్తు జరిగిన అనంతరం ఆమె బెయిల్‌పై సోమవారం విడుదల అయింది. స్విట్జర్లాండ్ ఎంబసీలోని మహిళా ఉద్యోగిపై దాడి జరిగిందనడానికి ఎలాంటి ఆధారాలు లేవని శ్రీలంకలోని దర్యాప్తు అధికారులు మంగళవారం మీడియాకు విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఇతర దేశాలకు చెందిన దౌత్య మిషన్లకు భద్రత కల్పించవలసిన బాధ్యత ప్రభుత్వానిదేనని స్విట్జర్లాండ్ ఎంబసీ నొక్కి చెప్పింది. ఈ సంఘటనపై చోటు చేసుకున్న అపార్థాల వల్ల ఇరు దేశాల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయని పేర్కొంది. అయితే, సానుకూల సహకారానికి అవసరమయిన సామరస్య వాతావరణం తిరిగి వేగంగా నెలకొంటుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేసింది. ఏ దేశంలో పనిచేస్తున్న దౌత్య మిషన్‌లోని ఉద్యోగులు ఆ దేశానికి సంబంధించిన చట్టాలకు లోబడి ఉండాలనే అంశంతో ఏకీభవిస్తూనే, పని పరిస్థితులు, దౌత్య మిషన్ల ఉద్యోగులందరి క్షేమంపై ఇరు పక్షాలు దృష్టి సారించవలసి ఉంటుందని పేర్కొంది.

ప్రజాస్వామ్యం ఖూనీ

యూపీ అసెంబ్లీలో ప్రతిపక్ష నేత రామ్ గోవింద్



లక్నో, జనవరి 1: ఉత్తరప్రదేశ్‌లో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోందని, యోగి ఆదిత్యనాథ్ సర్కార్ దమనకాండను కొనసాగిస్తోందని అసెంబ్లీలో ప్రతిపక్ష నేత, సమాజవాది పార్టీ సీనియర్ నాయకుడు రామ్ గోవింద్ చౌదరి ధ్వజమెత్తారు. బుధవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ప్రభుత్వ పాలన అస్తవ్యస్తంగా మారిందని విమర్శించారు. దీనిని ప్రశ్నించిన వారిపై సర్కారు దమనకాండకు దిగుతోందని, బ్రిటీష్ సర్కారు అనుసరించిన విధానాలను అమలు చేస్తోందని ఆయన ఆరోపించారు. 'రాష్ట్రంలో ప్రజాస్వామ్యానికి తెరపడింది. అస్తవ్యస్త పాలనతో ప్రజలు స్వేచ్ఛను కోల్పోతున్నారు. అయితే, స్వేచ్ఛ కోసం గళమెత్తిన వారిని బ్రిటీషర్ల తరహాలో ఆదిత్యనాథ్ సర్కారు అణచివేస్తోంది. సత్యాగ్రహం చేస్తున్నవారిపై తూటాలు పేలుతున్నాయి. ఎలాంటి న్యాయవిచారణ లేకుండానే శిక్షలు విధిస్తున్నారు. మనది ప్రజాస్వామిక దేశమా అన్న అనుమానం రేకెత్తుతున్నాయి' అని అన్నారు. మరోమాటలో చెప్పాలంటే ప్రజాస్వామ్యం అపహాస్యం పాలవుతోందని ఆయన విమర్శించారు. అసెంబ్లీలో తాము వేస్తున్న ప్రశ్నలకు సమాధానం ఇవ్వలేకపోతున్న ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే సమావేశాలను హడావుడిగా ముగించేసిందని ఆయన ఆరోపించారు. సీఏఏకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న వారిపై తప్పుడు కేసులు బనాయించి జైళ్లలో తోస్తున్నారని అన్నారు. వీరంతా సత్యాగ్రహులని, వారిపై పెట్టిన కేసులను తక్షణమే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీజేపీ అన్నివిధాలుగా విఫలమయ్యాయని ఆయన పేర్కొన్నారు. ఉద్యోగ కల్పనకు కృషి చేయాల్సిన సమయంలో ఉన్న ఉద్యోగాలను కూడా లాక్కుంటున్నారని విమర్శించారు. రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, రాష్ట్రంలో హింసాత్మక సంఘటనలు గతంలో లేనంత తీవ్ర స్థాయిలో నమోదవుతున్నాయని రామ్ గోవింద్ మండిపడ్డారు. సీఏఏ, ఎన్ఆర్‌సీ, ఎన్‌పీఆర్ పేరుతో ప్రధాని మోదీ, అమిత్ షా నాటకాలు ఆడుతున్నారని, అనేక సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి ప్రయత్నిస్తున్నారని అన్నారు.

ప్రజల మనోభావాలు
దెబ్బతీయొద్దు
ఎన్డీయే ప్రభుత్వంపై మాయావతి ధ్వజం
ఆందోళనలు విధ్వంసభరితం కాకూడదని వ్యాఖ్య




లక్నో, జనవరి 1: మతపరమైన విధానాలతో రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేసే విధంగా బీజేపీ ప్రభుత్వం పనిచేస్తోందని బీఎస్పీ అధినేత్రి మాయావతి దుయ్యబట్టారు. అయితే, కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ చేసే ఆందోళనలు విధ్వంసపూరితం కాకూడదని ఆమె హితవు పలికారు. 'రాష్ట్రంలో, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న మతపరమైన విధానాలు 2019 సంవత్సరం మాదిరిగా ఇబ్బందికరంగా కాకుండా ఉత్తేజభరితంగా నూతన సంవత్సరం ఉండాలని' ఆమె ఆకాంక్షించారు. 2019 సంవత్సరం చివరిలో జరిగిన విధ్వంసం యాదృచ్ఛికంగానే జరిగినప్పటికీ చాలా బాధపెట్టిందని వ్యాఖ్యానించారు. మతపరమైన పరిణామాలు ప్రజల మనోభావాలను దెబ్బతీసేవిగా కానీ.. దేశంలో వాతావరణం ప్రతికూల పరిస్థితుల్లోకి వెళ్లే విధంగా కానీ ఉండకూడదని ఆమె అభిప్రాయపడ్డారు. మన దేశం లౌకిక రాజ్యం అన్న సంగతిని బాధ్యత కలిగిన ఏ ఒక్క ప్రజా ప్రతినిధి మరువకూడదని ఈ సందర్భంగా మాయావతి హితవు పలికారు. అందులోనూ భిన్న మతాలకు నెలవైన దేశం మనదన్న సంగతిని గుర్తెరిగి నేతలు ప్రవర్తించాలని స్పష్టం చేశారు. 'మన దేశం భిన్న మతాలకు నెలవనీ.. ఆయా మతాలకు చెందిన వారి మనోభావాలు దెబ్బతీసే విధంగా ప్రవర్తించకూడదనీ.. వారి సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించాలని' మాయావతి పేర్కొన్నారు.

ప్రకృతి విలయం నుంచి బయటపడి..

తప్పిపోయాడనుకున్న వ్యక్తి కుటుంబ సభ్యుల చెంతకు...

కేదార్‌నాథ్ బాధితుడి గాథ

గోపేశ్వర్, జనవరి 1: ఉత్తరాఖండ్‌లోని కేదార్‌నాథ్‌లో సంభవించిన ప్రకృతి విలయం ఎన్నో కుటుంబాల్లో పెను విషాదాన్ని నింపింది. కుటుంబ సభ్యులను కోల్పోయిన వారి గురించి కథలు కథలుగా విన్నాం. అయితే 2013 నాటి ప్రకృతి విలయంలో తప్పిపోయాడని భావించిన ఓ వ్యక్తి క్షేమంగా కుటుంబం వద్దకు చేరాడు. ఆ వృద్ధుడిని బుధవారం కుటుంబ సభ్యులకు అప్పగించినట్టు ఛమోలీ ఎస్పీ యశ్వంత్ సింగ్ చౌహాన్ వెల్లడించారు. ఆయన చెప్పిన వివరాల ప్రకారం జామిల్ అహ్మద్ అన్సారీ అనే వ్యక్తిది సీతార్‌గంజ్ గ్రామం. కేదార్‌నాథ్ ప్రకృతి విలయంలో అన్సారీ తప్పిపోయాడు. అప్పటి నుంచి కుటుంబ సభ్యులకు ఎలాంటి సమాచారం లేదు. విలయాన్ని ప్రత్యక్ష చూసిన అతడి జ్ఞాపకశక్తి పాక్షికంగా దెబ్బతింది. ఆరేళ్ల పాటు గోపేశ్వర్‌లోని వృద్ధాశ్రయంలో తలదాచుకున్నాడు. పేరుగాని, కుటుంబ సభ్యుల వివరాలు గానీ చెప్పలేకపోయేవాడు. కాలక్రమంలో మెల్లమెల్లగా జ్ఞాపక శక్తి రావడం మొదలైంది. దీన్ని ఆశ్రమ నిర్వాహకులు గమనించి ఆరా తీశారు. పనుల కోసం 2009లో జోషిమఠ్‌కు వచ్చానని, తనది సీతార్‌గంజ్ అని అన్సారీ వెల్లడించాడు. కూలీగా పని చేసుకుంటుండగా 2013 ప్రకృతి విలయంలో చిక్కుకున్నానని అధికారులకు తెలిపాడు. ఇలా ఉండగా అన్సారీ తెలిపిన వివరాల ప్రకారం అతడి కుటుంబ సభ్యుల కోసం పోలీసులు గాలించినట్టు ఎస్పీ యశ్వంత్ సింగ్ చౌహాన్ తెలిపారు. సోషల్ మీడియాలో అన్సారీని కుటుంబ సభ్యులు గుర్తించారని అన్నారు. మొత్తానికి అతడిని క్షేమంగా కుటుంబ సభ్యులకు అప్పగించినట్టు ఎస్పీ వెల్లడించారు. అన్సారీకి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారని ఆయన పేర్కొన్నారు.



బుద్ధ గయలో బుధవారం ఆంగ్ల సంవత్సరాది సందర్భంగా బౌద్ధులను కలుసుకున్న టిబెట్ ఆధ్యాత్మికవేత్త దలైలామా

పరశురామావతారంలో భద్రాద్రి రామయ్య



పరశురామావతారంలో
శ్రీ సీతారామచంద్రస్వామి

భద్రాచలం టౌన్, జనవరి 1: భద్రాచలం రామాలయంలో నిర్వహిస్తున్న అధ్యయనోత్సవాల్లో బుధవారం స్వామివారు పరశురామావతారంలో భక్తులకు దర్శనమిచ్చి కనువిందు చేశారు. ఈ రూపంలో ఉన్న స్వామికి తొలుత ఆలయంలో పూజలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం మాడవీధుల్లో ఊరేగింపుగా తీసుకొచ్చి అధ్యయనోత్సవ వేదిక వద్ద ఆసీనులను చేశారు. అక్కడ స్వామి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. దుర్మార్గులైన రాజులను ఇరవై ఒక్క మారు దండెత్తి పరశురాముడు సంహరించాడని, ఈ అవతార దర్శనం చేసుకుంటే శుక్ర గ్రహ బాధలు తొలగుతాయని వైదిక పెద్దలు సుభాషించారు. అనంతరం స్వామి తిరువీధి సేవకు బయలుదేరగా ప్రతి ఇంటి ముందు కల్లాపి చల్లి రంగవల్లులు తీర్చిదిద్ది రా రమ్మని స్వామిని స్వాగతించారు. గురువారం స్వామి రామావతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

గీతం వర్సిటీకి భారీ ప్రాజెక్టు

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 1: హైదరాబాద్ గీతం డీమ్డ్ యూనివర్శిటీలోని స్కూల్ ఆఫ్ సైన్స్ రసాయన శాస్త్ర విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ సురేంద్రబాబు మనుబోలు సూర్యకు ముంబైలోని అణుశక్తి విభాగానికి చెందిన అణుశక్తి పరిశోధనా బోర్డు భారీ ప్రాజెక్టును మంజూరు చేసింది. ఈ విషయాన్ని గీతం వర్శిటీ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ ఎన్ శివప్రసాద్ బుధవారం నాడు తెలిపారు. ఎంవోఎఫ్‌లను ఉపయోగించి సజల అణు వ్యర్థాల నుండి స్ట్రోంటియం అయాన్ల ఎంపిక, వెలికితీత పేరిట చేపడుతున్న ఈ ప్రాజెక్టుకు బీఆర్‌ఎన్‌ఎస్ సిఫార్సు పరిపాలనా అనుమతులు అందజేసింది. 2019-20 ఆర్థిక సంవత్సరంలో ప్రారంభం అయ్యే ఈ ప్రాజెక్టుకు 32.50 లక్షల గ్రాంట్‌ను మంజూరు చేసిందని అన్నారు. ఈ పరిశోధనలో సాయపడేందుకు గానూ ప్రాజెక్టు ఫెలో అవసరం ఉందని, ఎమ్మెస్సీ కెమిస్ట్రీలో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన వారు అర్హులని, నెట్ జేఆర్‌ఎఫ్, గేట్‌లలో అర్హత సాధించిన వారికి ప్రాధాన్యం ఉంటుందని అన్నారు. సురేంద్రబాబును రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్‌ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ ప్రిన్సిపల్ డైరెక్టర్ ఎస్ సీతారామయ్య, స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జీఏ రామారావు, కెమిస్ట్రీ విభాగాధిపతి డాక్టర్ జీ రాంబాబు, యూజీసీ వ్యవహారాల సమన్వయ కర్త ఐవీ సుబ్బారెడ్డి తదితరులు అభినందించారు.

మంచి పనులు నమోదు చేసుకోవాలి

మీడియా డైరీ ఆవిష్కరణలో గవర్నర్ తమిళిసై

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 1: వర్కింగ్ జర్నలిస్టులు తమ డైరీలోని ప్రతిపేజీలో సమాజ శ్రేయస్సు కోసం మంచి పనులు, విజయాలు నమోదయ్యేలా కృషి చేయాలని రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్ కోరారు. బుధవారం రాజ్‌భవన్‌లో తెలంగాణ యూనియన్ వర్కింగ్ జర్నలిస్టు ఆధ్వర్యంలో మీడియా డైరీని గవర్నర్ ఆవిష్కరించారు. డైరీలో ప్రచురించిన సమాచారాన్ని ఆమె పరిశీలించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఐజేయు అధ్యక్షుడు కె. శ్రీనివాసరెడ్డి, ఏపీ ప్రభుత్వ జాతీయ మీడియా సలహాదారుడు దేవులపల్లి అమర్, టీయుడబ్ల్యుజే అధ్యక్ష, కార్యదర్శులు నగునూరి శేఖర్, కె.విరాహత్ అలీ. పీసీఐ సభ్యుడు ఎంఏ మాజిద్, ఐజేయూ కార్యదర్శి వై. నరేందర్‌రెడ్డి, సీసీఐ మాజీ సభ్యులు కె. అమర్‌నాథ్, జాతీయ కార్యవర్గ సభ్యులు కల్లూరి సత్యనారాయణ, టీయుడబ్ల్యు ఉప ప్రధాన కార్యదర్శి విష్ణుదాస్ శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు దొంతు రమేష్, కోశాధాకారి కె మహిపాల్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ రాజేష్, యాదగిరి, అయిలు రమేష్, హెచ్‌యూజే అధ్యక్ష, కార్యదర్శులు రియాజ్ అహ్మద్, శివశంకర్ గౌడ్ పాల్గొన్నారు. డైరీ ఆవిష్కరణలో గవర్నర్ భర్త డాక్టర్ సౌందరరాజన్ కూడా



తెలంగాణ యూనియన్ వర్కింగ్ జర్నలిస్టు ఆధ్వర్యంలో రూపొందించిన మీడియా డైరీని బుధవారం ఆవిష్కరిస్తున్న గవర్నర్ తమిళి సై

నుమాయిష్ షురూ

- ★ ప్రారంభించిన మంత్రి ఈటల రాజేందర్
- ★ హాజరైన మంత్రులు అలీ, తలసాని, మేయర్
- ★ నిరంతర సోదాలు, స్టాళ్లకు బీమా ★ 1500కి తగ్గిన స్టాళ్లు
- ★ రాత్రి 11 గం.ల వరకు మెట్రో సర్వీసులు

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 1: కుటీర, చిన్నతరహా పరిశ్రమలు మొదలుకుని జాతీయ, అంతర్జాతీయ కంపెనీల ఉత్పత్తులను మహానగరవాసులకు సంవత్సరానికి ఓసారి అందుబాటులోకి తెచ్చే అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన (నుమాయిష్-2020) బుధవారం ప్రారంభమైంది. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్ బుధవారం సాయంత్రం నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నుమాయిష్‌ను ప్రారంభించారు. హోం మంత్రి మహమూద్ అలీ, సినిమాటోగ్రఫీ మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్, నగర మేయర్ బొంతు రామ్మోహన్ అతిధులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి ఈటల మాట్లాడుతూ ప్రతి సంవత్సరం 45 రోజుల పాటు దేశంలోని వివిధ రాష్ట్రాలు, విదేశాలకు చెందిన కంపెనీల ఉత్పత్తులతో ఈ అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శనను నిర్వహించి, వచ్చే ఆదాయంతో పేద, మధ్య తరగతి విద్యార్థినులు చదుకునేందుకు వీలుగా కాలేజీల నిర్వహించడం అభినందనీయం అని అన్నారు. ఈ ప్రదర్శనతో అంతర్జాతీయ కంపెనీల ఉత్పత్తులు నగరవాసులకు అందుబాటులోకి రావడంతో పాటు అన్ని రకాల వస్తువులు, అన్ని రకాల సామాగ్రి నగర ప్రజలకు ఒకేచోట లభ్యమయ్యేలా ఈ ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నిజాం కాలం నుంచే ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా నిర్వహించే ఈ నుమాయిష్‌కు అంతర్జాతీయ స్థాయిలో మంచి పేరు ఉందని, ఒక రకంగా ఈ ప్రదర్శన కారణంగా ప్రపంచ దేశాలన్నీ హైదరాబాద్‌ను గుర్తుచేసుకుంటాయని ఆయన వివరించారు. గత సంవత్సరం 2500 వరకు స్టాళ్లను ఏర్పాటు చేసినా, దురదృష్టవశాత్తు సంభవించిన అగ్నిప్రమాదం కారణంగా, ఈసారి స్టాళ్ల ఏర్పాటు, సందర్శకుల భద్రత కోసం ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. 45 రోజుల పాటు కొనసాగనున్న ఈ ప్రదర్శనలో ఈసారి 1500 స్టాళ్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. హోం మంత్రి మహమూద్ అలీ మాట్లాడుతూ నుమాయిష్ హైదరాబాద్ షాన్ అని పేర్కొన్నారు. ఈ ప్రదర్శనలో మహిళలు, యువతుల భద్రత కోసం పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టనున్నామని, దీనికి తోడు ఎగ్జిబిషన్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా సీసీ కెమెరాలను కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గతంలో నుమాయిష్‌కు రాకపోకలు సాగించేందుకు కేవలం మూడు ద్వారాలు మాత్రమే ఉండేవని, ఈసారి అదనంగా మరో ఆరు ద్వారాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సందర్శకుల సౌకర్యార్థం ఈ ప్రదర్శన జరిగినన్ని రోజులు రాత్రి పదకొండు గంటల వరకు మెట్రోరైలు సర్వీసులను కొనసాగించనున్నట్లు తెలిపారు. మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ మాట్లాడుతూ ఇలాంటి ప్రదర్శనలు నిర్వహించి, వచ్చిన ఆదాయంతో విద్యా సంస్థల నిర్వహణ చేపట్టడం అనేది సంస్కృతి అని అభివర్ణించారు. మేయర్ బొంతు రామ్మోహన్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ నుమాయిష్‌కు మన దేశంలోని వివిధ రాష్ట్రాల్లోనే గాక, పలు దేశాల్లోనూ మంచి ఆదరణ ఉందని వివరించారు. ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నుమాయిష్‌తో పాటు ఏడాది పొడవునా పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నా, మౌలిక సదుపాయాలు ఆశించిన స్థాయిలో కల్పించటం లేదని అన్నారు.

నాంపల్లి పరిసర ప్రాంతాల్లో మౌలిక వసతులను మెరుగు పరిచేందుకు జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో త్వరలోనే మల్టీపర్పస్ పార్కింగ్ కాంప్లెక్సులను నిర్మించనున్నామని, నుమాయిష్ జరిగినపుడు ఈ పార్కింగ్‌లు సందర్శకులకు ఎంతో సహాయపడతాయని అన్నారు. ఎగ్జిబిషన్ సొసైటీ అధ్యక్ష కార్యదర్శులు సురేందర్, ప్రభాశంకర్ మాట్లాడుతూ స్టాళ్లలో గ్యాస్ సిలిండర్లు పెట్టకుండా నిరంతరం సోదాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. గత సంవత్సరం జరిగిన అగ్నిప్రమాదాన్ని దృష్టిలో పెట్టుకుని ఈసారి పబ్లిక్ లయబిలిటీ కింద తక్కువ ప్రీమియంతో రూ.5 కోట్ల వరకు బీమా సౌకర్యం కల్పిస్తున్నామని, దీనిని స్టాల్ నిర్వాహకులకు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించినట్లు తెలిపారు.

న్యాయమూర్తుల కొరత కలచివేస్తోంది

సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ ★ వేడుకగా తెలంగాణ హైకోర్టు వార్షికోత్సవాలు

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 1: న్యాయవాదుల పోరాట పటిమ చాలా గొప్పదని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్ వీ రమణ వ్యాఖ్యానించారు. తెలంగాణ హైకోర్టు ఏర్పాటై ఏడాది గడచిన సందర్భంగా హైకోర్టు ప్రాంగణంలో నిర్వహించిన వార్షికోత్సవాలకు జస్టిస్ రమణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ ఉత్సవాల్లో పాల్గొనడం తనకు ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. హైకోర్టుల్లో ఖాళీల సంఖ్య ఆందోళన కలిగిస్తోందని చెప్పారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో హైకోర్టుల్లో ఇదే పరిస్థితి ఉందని, కేసులు మాత్రం లక్షల్లో పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. 1100 మంది హైకోర్టు న్యాయమూర్తులకు 600 మంది మాత్రమే ఉన్నారని , ఎప్పటికపుడు న్యాయమూర్తుల నియామకాలకు కేంద్రానికి ప్రతిపాదనలు పంపిస్తున్నామని, 55 ప్రతిపాదనలు కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్నాయని, మరో 115 మంది న్యాయమూర్తుల నియామక ప్రతిపాదనలు సుప్రీంకోర్టు నుండి వెళ్లనున్నాయని చెప్పారు. వివిధ రాష్ట్రాల్లో ఎన్నికలు, ఇతర కారణాలతో నియామకాల్లో తీవ్ర జాప్యం జరుగుతోందని అన్నారు.

ఆంధ్రప్రదేశ్‌లోనూ ఇదే పరిస్థితి ఉందని పేర్కొన్నారు. జ్యుడిషియల్ ప్యానల్, అడ్వకేట్ ప్యానల్ నుండి వచ్చే ప్రతిపాదనలను త్వరలోనే ప్రాసెస్ చేస్తామని అన్నారు. హైకోర్టు న్యాయమూర్తుల సంఖ్యను కూడా పెంచాల్సి ఉందని చెప్పారు. ఇటీవల రాష్ట్రపతి ఎట్ హోం కార్యక్రమంలో పాల్గొన్నపుడు ముఖ్యమంత్రి కే చంద్రశేఖరరావు ఈ అంశాన్ని ప్రతిపాదించారని, ఇలాంటి ప్రతిపాదన ఏదీ సుప్రీంకోర్టు వద్ద లేదని, ఇలాంటి ప్రతిపాదన కేంద్రప్రభుత్వం వద్ద ఉందని, కేంద్రం నిర్ణయం తీసుకోనిదే సుప్రీంకోర్టు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని పేర్కొన్నారు. హైకోర్టుకు పది ఎకరాల స్థలాన్ని కేటాయించి భవన నిర్మాణం వల్ల మంచి జరుగుతుందని, ఆ దిశగా చర్యలు చేపట్టాలని అన్నారు. భవన నిర్మాణానికి కొంత సమయం పట్టినా, న్యాయవాదులకు మంచి శిక్షణ ఇప్పించాలని సూచించారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి తొందరగా నిర్ణయాలు తీసుకుంటున్నారని , ఏదీ పెండింగ్‌లో ఉంచడం లేదని అన్నారు. దేశంలో వేగంగా న్యాయం జరిగేందుకు 400 కోట్లు కేటాయించామని, రాష్ట్రంలో కూడా తొందరగా న్యాయం జరిగేందుకు వీలుగా ప్రధాన న్యాయమూర్తి త్వరితగతిన చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. న్యాయవాదులు పడిన కష్టఫలితంగా హైకోర్టు ఏర్పడిందని, అయినా రెండు రాష్ట్రాల్లో సంపూర్ణ హైకోర్టు అనే భావన రావడం లేదని పేర్కొన్నారు. ఆంధ్రాలో భవనాలు ఏవీ సరిగా లేవని, తెలంగాణలో విశాల భవనం ఉన్నా న్యాయమూర్తులు లేక ఇబ్బందులు పడుతున్నారని, ఆశలు, ఆలోచనా విధానాలకు తగ్గట్టు పేదవారికి న్యాయం అందించేందుకు చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. దేశ ప్రజలు అంతా హైదరాబాద్ వైపు చూస్తున్నారని, అనేక మంది న్యాయవాదుల కోసం సంస్థలు ఏర్పడాలని కోరుకుంటున్నానని చెప్పారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్, ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్ర చౌహాన్, లోకాయుక్త జస్టిస్ సీవీ రాములు, మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ చంద్రయ్య, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సూర్యకరణ్ రెడ్డి, న్యాయశాఖ కార్యదర్శి, హైకోర్టు సిబ్బంది, సభ్యులు పాల్గొన్నారు.

తిరుమలేశుని ఆలయం ఎదుట

భక్తుల సంబరాలు


నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ వేడుకలు

తిరుపతి, జనవరి 1: తిరుమల శ్రీవారి ఆలయం ఎదుట మంగళవారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో భక్తులు నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ సంబరాలు జరుపుకున్నారు. నూతన ఆంగ్ల సంవత్సరాన్ని పురస్కరించుకుని స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులు ఆ సమయంలో తమకు శ్రీ వేంకటేశ్వరుని దర్శనం కలగపోయినా బాధపడలేదు. ఎందుకంటే తిరుమల క్షేత్రానికి చేరుకున్న తమకు స్వామి అనుగ్రహం ఉందని భావించి సరిగ్గా 12 గంటల సమయానికి ఆలయం ఎదుట గుమిగూడి హ్యాపీ న్యూ ఇయర్ అంటూ ఆనందంతో కేకలు వేశారు. పిల్లలు, పెద్దలు అని తేడా లేకుండా కొందరు చిందులు వేస్తే, మరికొందరు ఒకరికొకరు ఆలింగనం చేసుకుంటూ, కరచాలనం చేస్తూ శుభాకాంక్షలను తెలియజేశారు. స్వామివారి ఆలయం ఎదుట నూతన సంవత్సర సంబరాలను జరుపుకున్న తరువాత అందరూ అక్కడ నుంచి స్వామివారికి సాష్టాంగ నమస్కారాలు చేసి, అఖిలాండం వద్ద కర్పూర నీరజనాలు, నారికేళం సమర్పించుకుని ఆనంద పరవశులయ్యారు.

టీఎస్ సెట్ మెంబర్ సెక్రటరీగా ప్రొఫెసర్ కిషన్

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 1: తెలంగాణ స్టేట్ ఎలిజిబిలిటీ టెస్టు (సెట్) మెంబర్ సెక్రటరీగా ప్రొఫెసర్ ఎన్ కిషన్ నియమితులయ్యారు. ఉస్మానియా యూనివర్శిటీ గణితశాస్త్ర సీనియర్ ఆచార్యుడిగా వ్యవహరిస్తున్న కిషన్ గత ఏడాది టీఎస్ సీపీజెట్ కన్వీనర్‌గా వ్యవహరించారు. తెలంగాణలోని అన్ని యూనివర్శిటీల్లో సంప్రదాయ పీజీ కోర్సుల్లో చేరేందుకు నిర్వహించే సీపీజెట్‌ను వివాదాలకు అతీతంగా విజయవంతంగా నిర్వహించి మంచి పేరుతెచ్చుకున్నారు. సుమారు 66 కోర్సుల్లో ప్రవేశానికి వివిధ మాధ్యమాల్లో నిర్వహించిన సీపీజెట్ మన రాష్ట్రంలో అతిపెద్ద ప్రవేశపరీక్షగా చెప్పవచ్చు. కిషన్ కృషిని ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ టీ పాపిరెడ్డి, ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ ఆర్ లింబాద్రి, ప్రొఫెసర్ వీవీ రమణ సైతం కొనియాడారు. ఈ క్రమంలో స్టేట్ ఎలిజిబిలిటీ టెస్టు మెంబర్ సెక్రటరీగా ఆయనను నియమించారు. వెంటనే ఆయన బాధ్యతలు స్వీకరించగా, వివిధ విభాగాల ఆచార్యులు, విద్యార్థులు ఆయనను సత్కరించారు.



ఏపీలో ఐటీ పరిశ్రమల ప్రోత్సాహానికి రూ. 100 కోట్లు కేటాయింపు

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 1: రాష్ట్రంలో ఐటీ పరిశ్రమలను ప్రోత్సహించేందుకు వీలుగా 100 కోట్ల రూపాయలను కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. గత ప్రభుత్వ హయంలో ఐటీ పరిశ్రమలకు రాయితీ కోసం 133 కోట్ల రూపాయలు కేటాయించినా, ఆ నిధులను వినియోగించలేదు. రాష్ట్రంలో ఐటీ పరిశ్రమలకు ఊతం ఇచ్చేందుకు ఈ నిధులను ఏపీటీఎస్‌కు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

1వ పేజీ తరువాయి

రాజకీయాలకు దూరం..

రావత్ తెలిపారు. త్రివిధ దళాలు సమన్వయంతో ఒక జట్టుగా పని చేస్తాయాలని, ఈ లక్ష్య సాధన కోసం తన వంతు కృషి చేస్తానని ఆయన చెప్పారు. తన నాయకత్వంలో సైన్యం, వాయు సేన, నావికా దళం ఒకటిగా పని చేస్తాయని హామీ ఇస్తున్నానని ఆయన ప్రకటించారు. సీడీఎస్‌గా తాను వీరిపై ఆజమాయిషీ చేసినప్పటికీ, సైనిక కార్యాచరణ పథకాలను త్రివిధ దళాల అధిపతులే అమలు చేస్తారని ఆయన వివరించారు. ప్రతి లక్ష్యాన్ని టీం వర్క్‌గా తీసుకుని పని చేస్తామన్నారు. సైన్యాన్ని రాజకీయం చేస్తున్నారనే ఆరోపణలను ఆయన ఖండించారు. త్రిదళాధిపతి పదవిని సృష్టించడాన్ని కాంగ్రెస్ విమర్శించిందని ఒక విలేకరి చెప్పగా 'మేము రాజకీయాలకు దూరంగా ఉంటాం. వాస్తవానికి రాజకీయాలకు చాలా దూరం. కానీ, అధికారంలో ఉన్న వారి ఆదేశాల మేరకు పని చేస్తాం' అని ఆయన స్పష్టం చేశారు. త్రివిధ దళాలకు కేటాయించిన నిధులను పూర్తి స్థాయిలో సక్రమంగా, పారదర్శకంగా, ఫలప్రదంగా ఉపయోగించుకునేందుకు ప్రాధాన్యం ఇస్తానని రావత్ తెలిపారు. ప్రభుత్వం ఈ లక్ష్యంతోనే సీడీఎస్ పదవిని సృష్టించినట్టు ఆయన చెప్పారు. త్రివిధ దళాల మధ్య సమన్వయం సాధించడంతోపాటు వాటి పూర్తి శక్తిసామర్థ్యాలను బహిర్గతం చేయడంపై దృష్టి సారించడం తన ప్రధాన కర్తవ్యమని రావత్ తెలిపారు. తన ఆదేశాల మేరకు త్రివిధ దళాలను పని చేయవని, నిజానికి వారిపై ఆజమాయిషీ తన పని కాదని తేల్చిచెప్పారు. అయితే, మూడు దళాల మధ్య సమన్వయం సాధించడం ద్వారా ఆశించిన లక్ష్యాలను చేరుకోవడమే తమ లక్ష్యమన్నారు. త్రివిధ దళాల మధ్య సమన్వయం సాధించడమంటే 1+1+1+ మూడు చేయడం కాదని, 1+1+1ని ఐదు లేదా ఏడు చేయడమే తన లక్ష్యమని వ్యాఖ్యానించారు. సమన్వయం ద్వారా త్రివిధ దళాల శక్తిసామర్థ్యాలు పెరగాలే తప్ప తరగడూదని అన్నారు. సమన్వయంతోపాటు సమష్టి శిక్షణకు ప్రాధాన్యం పెరుగుతుందని ఆయన తెలిపారు. పరస్పర సమన్వయం సాధించడంతో పాటు, కలిసి పని చేసే విధంగా ఆయుధాల సేకరణ ఉంటుందని రావత్ వివరించారు. 'మనమంతా పాశ్చాత్య దేశాలను కాపీ కొడుతున్నాం. కానీ, మనం మన స్వంత వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలి. త్రివిధ దళాలు ఒకరినొకరు అర్థం చేసుకోవడం ద్వారా స్వంత యంత్రాంగం, వ్యవస్థను ఏర్పాటు చేసుకోవచ్చు' అని రావత్ అభిప్రాయపడ్డారు. చొరబాటుదారులు వాస్తవాధీన రేఖ వద్ద జరిపిన భారీ కాల్పుల్లో ఇద్దరు సైనికులు మరణించడంపై అడిగిన ప్రశ్నకు బదులిచ్చేందుకు ఆయన నిరాకరించారు. మన వ్యూహాన్ని ఎలా బైట పెడతామని రావత్ విలేఖరులను ప్రశ్నించారు. పాక్ ఆక్రమిత కాశ్మీర్ విషయంలో త్రివిధ దళాల అధిపతులు ఏవైనా పథకాలను సిద్ధం చేస్తున్నారా? అని మరో విలేఖరి అడుగ్గా, ఇలాంటి విషయాలలో తాను తటస్థంగా ఉంటానని రావత్ స్పష్టం చేశారు. చైనా సరిహద్దుల్లో నెలకొన్న పరిస్థితులు గురించి అడిగిన ప్రశ్నపై స్పందిస్తూ, త్రివిధ దళాలు సమన్వయంతో లక్ష్యాన్ని సాధిస్తాయని ఆయన బదులిచ్చారు.

నిరక్షరాస్యుల జాబితా సిద్ధం చేయండి

సిద్ధం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేష్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ కొత్త ప్రధాన కార్యదర్శిగా బుధవారం బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన అధికారికంగా జిల్లా కలెక్టర్లతో బుధవారం బీఆర్కే భవన్ నుండి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నిరక్షరాస్యుల జాబితాను సిద్ధం చేసి ఈ నెల 10లోగా ప్రభుత్వానికి పంపించాలని సూచించారు. అక్షరాస్యత పెంచేందుకు 'ఈచ్ వన్-టీచ్ వన్' కార్యక్రమం చేపట్టాలని ముఖ్యమంత్రి కేసీఆర్ మంగళవారం ఇచ్చిన పిలుపును దృష్టిలో ఉంచుకుని సోమేష్ కుమార్ కలెక్టర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని నిరక్షరాస్యుల వివరాలను సేకరించే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్ ముఖ్యకార్యదర్శి వికాస్‌రాజ్, సెన్సెస్ డైరెక్టర్ ఇలంబర్తి, పంచాయతీరాజ్ కమిషనర్ రఘునందన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'పల్లె ప్రగతి-2'

ప్రధానంగా రోడ్లను శుభ్రపరచడం, మురుగునీటి పారుదల, పాత ఇళ్లు, పాత భవనాలు తదితరాలు ఏవైనా ఊళ్లో ఉంటే వాటిని తొలగించడం తదితర పనులన్నీ పల్లె ప్రగతిలో చేర్చారు. ప్రతి ఇంటిలో చెత్త వేసేందుకు డస్ట్‌బిన్‌లను ఏర్పాటు చేయడం, వాటిని రోజూ సేకరించి డంపింగ్ యార్డులకు చేరే వేసే బాధ్యత పంచాయతీలకు అప్పగించారు.

50 తనిఖీ బృందాలు

తొలిదశ పల్లె ప్రగతి కార్యక్రమాలను తనిఖీ చేసేందుకు ప్రభుత్వం 50 తనిఖీ బృందాలను ఏర్పాటు చేసింది. సివిల్ సర్వెంట్స్‌కు ఈ బాధ్యతలు అప్పగించారు. ఈ బృందాలు కూలంకషంగా పరిశీలన చేసి ప్రభుత్వానికి నివేదికలను సమర్పిస్తారు. తనిఖీల సందర్భంగా బాగా పనిచేశారని తేలిన పంచాయతీలకు అవార్డులను, పనిచేయలేకపోతే అందుకు బాధ్యులైన సర్పంచ్‌లు లేదా అధికారులను గుర్తించి వారిపై చర్య తీసుకునేందుకు ఏర్పాట్లు చేశారు. ఇలాఉండగా పల్లె ప్రగతి-2 దశ సందర్భంగా ప్రతి పంచాయతీకి ఒక మండలస్థాయి అధికారిని ఇన్‌చార్జిగా నియమించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) మండలస్థాయిలో పర్యవేక్షకులుగా ఉంటారు. జిల్లా పంచాయతీ అధికారులు (డీపీఓ) ద్వారా జిల్లా కలెక్టర్లు పల్లె ప్రగతి పనులను పర్యవేక్షిస్తారు.

చంద్రయాన్-3కి రెడీ

యువ విజ్ఞాని ఆర్యక్రాం (యువిక) అనే పాఠశాల పిల్లల కోసం ఒక ప్రత్యేక కార్యక్రమం కూడా గత సంవత్సరంలో ప్రవేశపెట్టామన్నారు. అంతరిక్ష వ్యవస్థల పరిశ్రమ ఉత్పత్తిని ముందుకు తీసుకెళ్లడానికి ఇస్రో అంతరిక్ష శాఖ కింద న్యూస్పేస్ ఇండియా లిమిటెడ్‌ను చేర్చిందన్నారు. ప్రారంభించిన పరిశ్రమనుండి పి ఎస్ ఎల్‌విలను గ్రహించే ప్రయత్నాలు భవిష్యత్తులో కార్యక్రమాలకు సంబంధించి డాక్టర్ శివన్ మాట్లాడుతూ చంద్రయాన్-3 చంద్రునికి ఒక లాండర్, రోవర్‌తో కూడిన మిషన్‌ను ప్రభుత్వం ఆమోదించిందన్నారు. దాని సాక్షాత్కారానికి సంబంధించి కార్యకలాపాలు పురోగతిలో వున్నాయన్నారు. భారతదేశం మొట్టమొదటి మానవ అంతరిక్ష విమాన మిషన్ గగన్‌యాన్ గురించి మాట్లాడుతూ తాము మిషన్లలో మంచి పురోగతి సాంచాము.. మిషన్‌కోసం వ్యోమిగామి ఎంపిక పూర్తయిందన్నారు. నలుగురు వ్యోమగాములను ఎంపిక చేశారని వీరు విస్తృతమైన శిక్షణ పొందుతున్నారని ఆయన తెలిపారు. ఎస్ ఎస్ ఎల్‌వి, జి ఎస్ ఎల్‌వి-4 ఎం వోగివ్‌పేలోడ్ పీరింగ్, జి ఎస్ ఏపి-20 ఉపగ్రహం స్వదేశీ అణు గడియారాలతో నావిక్ , ఇండియన్ డేటా రిలే శాటిలైట్ సిస్టం, ఆదిత్య- ఎల్ 1, ఫోక్స్ పోశాట్ ఈ సంవత్సరంలో ఇతర ప్రాజెక్టులుగా ఇస్రో సిద్ధమవుతోందన్నారు.

ఈ దశాబ్దం టీఆర్‌ఎస్‌దే!

ఇప్పటికీ అలానే ఉందన్నారు. ఎంఐఎం పార్టీతో తమకు స్నేహపూర్వక సంబంధాలు ఉన్నప్పటికీ ఆ పార్టీతో కలిసి పోటీ చేయబోమని కేటీఆర్ స్పష్టం చేశారు. గతంలో కూడా ఆ పార్టీతో కలిసి పోటీ చేయలేదని గుర్తు చేశారు. పీసీసీ అధ్యక్షునిగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కొనసాగుతారా? లేదా? అనేది ఆయన వ్యక్తిగత విషయమన్నారు. బాధ్యతాయుతమైన ఆయన ఒక ఐపీఎస్ అధికారిని దూషించడం సరైందని కాదని కేటీఆర్ హితవు పలికారు. ఇక పౌరసత్వ చట్ట సవరణకు అనుకూల, వ్యతిరేక ర్యాలీలు హైదరాబాద్‌లో జరిగాయని, కాంగ్రెస్ పార్టీ సరూర్‌నగర్ స్టేడియంలో సమావేశం పెట్టుకుంటే అనుమతి ఇచ్చేవారేమోనని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. జిల్లా కేంద్రాల్లో నిర్మాణం పూర్తయిన పార్టీ భవనాలను తమ అధినేత కేసీఆర్ సంక్రాంతి తర్వాత ప్రారంభిస్తారని ఆయన చెప్పారు. పార్టీ శ్రేణులకు శిక్షణా తరగతులు నిర్వహించేందుకు కసరత్తు చేస్తున్నామన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారిధిగా పార్టీ శ్రేణులు పనిచేయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. మున్సిపల్ ఎన్నికల్లో గెలిచిన ప్రజాప్రతినిధులకు మున్సిపల్ చట్టంపై అవగాహన కల్పించేందుకు శిక్షణా తరగతులు నిర్వహిస్తామన్నారు. మున్సిపల్ సిబ్బందికి కూడా శిక్షణ ఇస్తామన్నారు. కఠినంగా ఉన్న కొత్త మున్సిపల్ చట్టం అమలును ప్రజాప్రతినిధులతో ప్రారంభిస్తామన్నారు. కొత్త మున్సిపల్ చట్టాన్ని సమర్థంగా అమలుకు ఈ ఏడాది లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. ఎన్‌పీఆర్, ఎన్‌ఆర్‌సీ విషయంలో పార్టీ నిర్ణయం కంటే ప్రభుత్వ నిర్ణయమే ముఖ్యమన్నారు. అందరితో చర్చించిన తర్వాతే సీఎం నిర్ణయం తీసుకుంటారని వివరించారు. పొరుగు రాష్ట్రాలతో తమకు మంచి సంబంధాలు ఉన్నాయని, గతంలో చంద్రబాబుతో ప్రస్తుతం జగన్‌తో సఖ్యతగానే ఉన్నామని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే నాయకత్వ లోపం తలెత్తుతుందని గతంలో వాదించిన వారే ప్రస్తుతం కేసీఆర్ నాయకత్వాన్ని సమర్థిస్తున్నారని చెప్పారు. అనేక విషయాల్లో తెలంగాణ రాష్ట్రం అగ్రగామిగా ఉన్నప్పటికీ అక్షరాస్యతలో మాత్రం వెనుకబడి ఉండటం పట్ల సీఎం దృష్టి సారించారని తెలిపారు. ఓ వైపు పల్లె ప్రగతి, మరో వైపు పట్టణ ప్రగతి రెండు సమాంతరంగా జరిగితే అద్భుత ఫలితాలు వస్తాయని సీఎం భావిస్తున్నారని కేటీఆర్ తెలిపారు.

హైటెక్ కోడి పందేలు..!

- ★ పుంజుల ఆహారం, పెంపకంపై సమాచార సేకరణ
- ★ ఉభయ గోదావరి జిల్లాల్లో మొదలైన సందడి

ఆంధ్రభూమి బ్యూరో

రాజమహేంద్రవరం, జనవరి 1: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సహకారంతో గోదావరి జిల్లాల్లో పందెం కోళ్లు సంక్రాంతి పందేలకు సన్నద్ధమవుతున్నాయి. కొన్ని పాశ్చాత్య దేశాల్లో కోడి పందేలు జరుగుతున్న తీరును అంతర్జాలం సహాయంతో ఇటు నిర్వహణకు సంబంధించి, అటు పెంపకానికి సంబంధించి మెళకులను పరిశీలిస్తూ పరిశ్రమ మాదిరిగా కొన్ని ప్రాంతాల్లో రక రకాల జాతుల పందెం కోళ్లను సిద్ధం చేస్తున్నారు. తూర్పు గోదావరి జిల్లాలోని కోరుకొండ, రాజానగరం, గోకవరం, కోనసీమలోని కొన్ని ప్రాంతాలు, పశ్చిమ గోదావరి జిల్లాలోని మెట్ట, డెల్టా ప్రాంతంలో భారీ స్థాయిలో పందెం కోళ్ల పెంపకం జరుగుతోంది. కొన్ని ప్రత్యేక జాతుల కోళ్ల నుంచి గుడ్లను సేకరించి, అత్యాధునిక విధానంలో పిల్లలుగా పొదిగించి, అనంతరం పెంపకం నుంచి ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటూ భారీ స్థాయిలో ఫాం తరహాలో పందెం కోళ్ళను సిద్ధం చేస్తున్నారు. అలాగే ఏ తరహా ఆహారాన్ని అందించాలి తదితరాలను సైతం అంతర్జాలంలో లభించే సమాచారం ఆధారంగా చేపడుతున్నారు. ఇదిలావుండగా పందేల నిర్వహణకు సంప్రదాయ బరులతోపాటు కొత్త బరులు కూడా సిద్ధం చేస్తున్నట్టు తెలుస్తోంది. ప్రధానంగా కోనసీమలోని గోడి, గోడితిప్ప, ఐ పోలవరం, మురమళ్ళ, ఎదుర్లంక, కొత్తపల్లి, మూలపొలం, అల్లవరం, ఉప్పలగుప్తం, బండారులంక, అప్పనపల్లి, శేరుల్లంక, పశువుల్లంక తదితర ప్రాంతాలతో పాటు రాజానగరం, ప్రత్తిపాడు, గోకవరం, కోరుకొండ, రౌతులపూడి, శంఖవరం, రామచంద్రపురం, అనపర్తి, ద్వారపూడి, మండపేట, ఆత్రేయపురం, రావులపాలెం, కొత్తపేట తదితర ప్రాంతాల్లో, పశ్చిమ గోదావరి జిల్లాలో ఆకివీడు, కాళ్ల, భీమవరం, మొగల్తూరు, యలమంచిలి, జంగారెడ్డిగూడెం, కామవరపుకోట తదితర మండలాల్లో పందాలకు సిద్ధమవుతున్నట్టు విశ్వసనీయంగా తెలియవచ్చింది. ఇరు జిల్లాల్లో ఇప్పటికే కోడి పందేలను అనుమతించేది లేదని పోలీసులు ప్రకటిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో బైండోవర్ కేసులు పెట్టి పగడ్బందీగా వ్యవహరిస్తున్నారు. తూర్పు గోదావరి జిల్లా కేంద్రం కాకినాడ సమీపంలోని తాళ్లరేవు మండలంలో ఇటీవలే సుమారు రూ.12 లక్షల విలువైన కోడి పందేల్లో ఉపయోగించే ప్రత్యేక కత్తులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అయితే పండగ మూడు రోజుల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ కోడి పందేలకు అనుమతి లభిస్తుందని నిర్వాహకులు ధీమా వ్యక్తంచేస్తున్నారు. గత ఏడాదిని మించిన స్థాయిలో ఈసారి పందేలు జరుగుతాయని విశ్వాసం వ్యక్తంచేస్తున్నారు. ఉభయ గోదావరి జిల్లాల్లో గత ఏడాది సుమారు రూ.200 కోట్ల వరకు పందాలు, అనుబంధ జూదాలు జరిగినట్టు ఒక అంచనా. ఈ ఏడాది కూడా అంతకంటే ఎక్కువగానే జరగవచ్చని అంటున్నారు. కాగా గోదావరి జిల్లాలోని కొన్ని గ్రామాల్లో ఇప్పటికే పండగ సందడి మొదలైంది. బెట్టింగ్‌లు కాకుండా గ్రామాల్లో పుంజుకు పుంజు అన్నట్టు పందేలకు సిద్ధమవుతున్నారు.

ఎవరు చెప్పినా వినకపోతే జగన్‌కే నష్టం

మాజీ ఉప ముఖ్యమంత్రి కేఈ అనుమానం

ఆంధ్రభూమి బ్యూరో

కర్నూలు, జనవరి 1: ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఎవరు చెప్పినా వినకుండా ఏకపక్ష నిర్ణయాలతో ముందుకుపోతే ప్రభుత్వం కూలిపోయే ప్రమాదం ఉందని మాజీ ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి అనుమానం వ్యక్తం చేశారు. క బుధవారం తనను కలిసిన ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ జగన్ చిన్న పిల్లాడిలా మొండి వైఖరితో ఉంటే ఆయనకే కాకుండా రాష్టానికి కూడా నష్టం చేకూరుతుందని అభిప్రాయపడ్డారు. గత ఆరునెలల్లో ఆయన తీసుకున్న అత్యధిక నిర్ణయాలు కోర్టు, కేంద్ర ప్రభుత్వం వ్యతిరేకించినవేనని గుర్తు చేశారు. హైకోర్టు, రాజధానిని మరోచోటుకు మార్చాలంటే అంత సులభమైన విషయాలు కావని అన్నారు. కేవలం తన పంతం కోసం ఇలాంటి అనవసర రాద్ధాంతాలు చేస్తున్నారని విమర్శించారు. అమరావతి ప్రాంతంలో అక్రమాలు జరిగినా, చట్టవిరుద్ధంగా క్రయవిక్రయాలు జరిగినా విచారణ జరిపించి బాధ్యులను అరెస్టు చేసే అవకాశం ఉందని తెలిపారు.

క్రీడాభూమి

భారత పర్యటనకు లంక రెడీ

• జట్టును ప్రకటించిన బోర్డు



కొలంబో, జనవరి 1: భారత్- శ్రీలంక మధ్య ఈ నెల 5 నుంచి జరిగే టీ20 సిరీస్‌కు శ్రీలంక 16 మందితో కూడిన జట్టును ప్రకటించింది. జట్టుకు లసిత్ మలింగ కెప్టెన్‌గా వ్యవహరించనుండగా, 16 నెలల అనంతరం ఆల్‌రౌండర్ ఏంజిలో మాథ్యూస్‌కు లంక బోర్డు అవకాశం కల్పించింది. దీంతో లసిత్ మలింగ, ఏంజిలో మాథ్యూస్, కుశాల్ పెరీరా, కుశల్ మెండీస్‌తో జట్టు పటిష్టంగా కనిపిస్తోంది. అయితే ఇటీవల పాకిస్తాన్‌ను సొంత గడ్డపై మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో క్లీన్‌స్వీప్ చేసిన లంక, అదే జోరును భారత్‌పై కొనసాగించాలని చూస్తోంది. మరోవైపు టీమిండియా సైతం వెస్టిండీస్‌తో జరిగిన టీ20 సిరీస్‌ను 2-1 తేడాతో కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. అయితే కెప్టెన్ కోహ్లీతో పాటు కేఎల్ రాహుల్, శ్రేయాస్ అయ్యర్, రిషభ్ పంత్‌తో భారత్ బలంగా కనిపిస్తోంది. ఈ మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో జనవరి 5న గౌహతి వేదికగా మొదటి మ్యాచ్ జరగనుండగా, 7న ఇండోర్, 10న పుణె వేదికగా మిగతా మ్యాచ్‌లు జరగనున్నాయి.

శ్రీలంక జట్టు: లసిత్ మలింగ (కెప్టెన్), ధనుష్క గుణతిలక, అవిష్క ఫెర్నాండో, ఏంజిలో మాథ్యూస్, దసున్ శనక, కుశల్ పెరీరా, నిరోషన్ డిక్వెల్లా, ధనుంజయ డిసిల్వా, ఇసురు ఉదాన, భానుక రాజపక్స, ఒషాడో ఫెర్నాండో, వానిందు హసరంగా, లహీరు కుమార, కుశల్ మెండీస్, లక్ష్యన్ సందకాన్, కసున్ రజిత.

భారత జట్టు: విరాట్ కోహ్లీ (కెప్టెన్), శిఖర్ ధావన్, కేఎల్ రాహుల్, శ్రేయాస్ అయ్యర్, రిషభ్ పంత్ (వికెట్ కీపర్), మనీష్ పాండే, సంజూ శాంసన్, శివమ్ దూబే, వాషింగ్టన్ సుందర్, రవీంద్ర జడేజా, యుజువేంద్ర చాహల్, కుల్దీప్ యాదవ్, శార్దుల్ ఠాకూర్, నవదీప్ సైనీ, జస్ప్రీత్ బుమ్రా.



కోనేరు హంపికి స్వాగతం పలుకుతున్న ఏపీ ఒలింపిక్ అసోసియేషన్, వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు

నా కల సాకారం : కోనేరు హంపి

గన్నవరం, జనవరి 1: తన కల సాకారమైందని ప్రపంచ చెస్ చాంపియన్ కోనేరు హంపి ఆనందం వ్యక్తం చేశారు. రష్యాలో జరిగిన ప్రపంచ ర్యాపిడ్ చెస్ పోటీల్లో విజేతగా నిలిచిన అనంతరం తొలిసారిగా విజయవాడ నగరానికి వచ్చిన ఆమెకు బుధవారం గన్నవరం విమానాశ్రయంలో ఏపీ ఒలింపిక్ అసోసియేషన్, కుటుంబ సభ్యులు ఘన స్వాగతం పలికారు. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేపీ రావు విమానం వద్ద నుండి విమానాశ్రయ ప్రధాన ద్వారం వద్దకు తోడ్కొని వచ్చారు. రాష్ట్ర చెస్ సంఘ నాయకులు శ్రీహరి, రాష్ట్ర జూడో సంఘ నాయకులు వెంకట్, సైకిల్‌పోల్ ప్రధాన కార్యదర్శి ధనియాల నాగరాజు, ఆర్చరీ సంఘ కార్యదర్శి చెరుకూరి సత్యనారాయణ, డాలి, రెజ్లింగ్ సంఘ నాయకులు పాండురంగారావు ఆమెకు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. క్రీడా సాధికార సంస్థ స్పోర్ట్స్ డైరెక్టర్ రమణ, ఓఎస్‌డీ రామకృష్ణ హంపికి పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువతో సత్కరించారు. ఎయిర్‌పోర్టు డైరెక్టర్ మధుసూదనరావు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. హంపి తల్లిదండ్రులు కోనేరు అశోక్ చౌదరి, లత, భర్త దాసరి అన్వేష్, హంపి కుమార్తె స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా హంపి మీడియాతో మాట్లాడుతూ తన తండ్రి ఇచ్చిన సూచనలతోనే అడుగు ముందుకు వేస్తూ ప్రపంచంలో నంబర్‌వన్ స్థానానికి చేరుకున్నానన్నారు. తన భర్త అన్వేష్ ప్రోత్సాహంతో ప్రపంచ స్థాయిలో నిలిచానని అన్నారు. వర్ధమాన క్రీడాకారులు క్రమశిక్షణ, పట్టుదలతో సాధన చేయడం ద్వారా అనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చని ఆమె సూచించారు.



ఏటీపీ కప్ టెన్నిస్ టోర్నమెంట్‌కు ముందు పెర్త్ తీరంలోని రోట్నెస్ట్ ఐస్‌లాండ్ బీచ్‌ను సహచరులతో కలిసి సందర్శించిన స్పెయిన్ టెన్నిస్ ఆటగాడు రాఫెల్ నాదల్

టీమిండియా కెప్టెన్ విరాట్‌కు మరో అరుదైన గౌరవం

• క్రిక్‌బజ్ ప్రకటించిన జట్లకు కెప్టెన్‌గా కోహ్లీ

న్యూఢిల్లీ, జనవరి 1: టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీకి మరో అరుదైన గౌరవం దక్కింది. ప్రముఖ క్రికెట్ స్పోర్ట్స్ సంస్థ క్రిక్‌బజ్ ఈ దశాబ్దపు టెస్టు, వన్డే జట్టు కెప్టెన్‌గా కోహ్లీని ఎంపిక చేసింది. క్రిక్‌బజ్ ప్రకటించిన రెండు జట్లకు కోహ్లీయే కావడం విశేషం. ఓ భారత క్రికెటర్ ఇలాంటి గౌరవం దక్కడం ఇదే మొదటిసారి. ఈ దశాబ్దంలో ఆటగాళ్ల ప్రదర్శన ఆధారంగా జట్లను ఎంపిక చేసినట్లు క్రిక్‌బజ్ పేర్కొంది.



ధోనీకి దక్కని చోటు..

టీమిండియా వికెట్ కీపర్, మాజీ కెప్టెన్ మహేంద్రసింగ్ ధోనీకి క్రిక్‌బజ్ రెండు జట్లలోనూ చోటు కల్పించకపోవడం విశేషం. ధోనీకి బదులు ఇంగ్లాండ్ వికెట్ కీపర్ జోస్ బట్లర్‌ను జట్టులోకి తీసుకుంది. వన్డేల్లో ఓపెనర్‌గా రోహిత్ శర్మ, హషీమ్ ఆమ్లాను తీసుకోగా, మూడో బ్యాట్స్‌మన్‌గా విరాట్ కోహ్లీతో పాటు, మిడిలార్డర్‌లో రాస్ టేలర్, ఏబీ డివిలియర్స్, షకిబుల్ హసన్, జోస్ బట్లర్‌ను తీసుకుంది. ఇక బౌలింగ్ విభాగంలో మిచెల్ స్టార్క్, ట్రెంట్ బౌల్ట్, లసిత్ మలింగ వంటి పేసర్లతో పాటు ఇమ్రాన్ తాహీర్, షకిబుల్ హసన్‌ను స్పిన్ విభాగంలో తీసుకుంది. అయితే క్రిక్‌బజ్ ప్రకటించిన రెండు జట్లలో పాకిస్తాన్, వెస్టిండీస్ జట్ల ఆటగాళ్లకు చోటు దక్కలేదు.

టెస్టు జట్టు: అలిస్టర్ కుక్, డేవిడ్ వార్నర్, కుమార సంగాక్కర, విరాట్ కోహ్లీ (కెప్టెన్), స్టీవ్ స్మిత్, ఏబీ డివిలియర్స్ (వికెట్ కీపర్), రవిచంద్రన్ అశ్విన్, రంగాన హెరాత్, డేల్ స్టెయిన్, మోర్నీ మోర్కల్, జేమ్స్ అండర్సన్.

వన్డే జట్టు: రోహిత్ శర్మ, హషీమ్ ఆమ్లా, విరాట్ కోహ్లీ (కెప్టెన్), రాస్ టేలర్, ఏబీ డివిలియర్స్, జోస్ బట్లర్ (వికెట్ కీపర్), షకిబుల్ హసన్, ఇమ్రాన్ తాహీర్, మిచెల్ స్టార్క్, ట్రెంట్ బౌల్ట్, లసిత్ మలింగ.

అర్ధ సెంచరీతో రాణించిన బెన్‌క్రాఫ్ట్

• బ్రిస్బేన్స్ హీట్‌పై పెర్త్ స్కాచర్స్ విజయం

క్వీన్స్‌లాండ్, జనవరి 1: బిగ్ బాష్ లీగ్‌లో భాగంగా బ్రిస్బేన్స్ హీట్‌తో జరిగిన మ్యాచ్‌లో పెర్త్ స్కాచర్స్ 40 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. అంతకుముందు టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పెర్త్ స్కాచర్స్ నిర్ణీత ఓవర్లలో 6 వికెట్లను కోల్పోయి 149 పరుగులు చేసింది. కామెరాన్ బెన్‌క్రాఫ్ట్ (50) అర్ధ సెంచరీతో చెలరేగగా, వికెట్ కీపర్ జోష్ ఇంగ్లీస్ (27), కెప్టెన్ మిచెల్ మార్ష్ (26) ఫర్వాలేదనిపించారు. జహీర్ ఖాన్, బెన్ లఫ్లిన్‌లు రెండేసి వికెట్లు తీయగా, జోష్ లలార్, బెన్ కట్టింగ్ ఒక్కో వికెట్ దక్కించుకున్నారు. అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన బ్రిస్బేన్స్ హీట్ 18.4 ఓవర్లలోనే 109 పరుగులు చేసి కుప్పకూలింది. ఫవాద్ అహ్మద్ 3 వికెట్లతో రాణించగా, మాథ్యూ కీల్లె, ఆస్టన్ అగర్ చెరో రెండు, రిచర్డ్‌సన్, క్రిస్ జోర్డాన్, లివింగ్‌స్టన్ ఒక్కో వికెట్ తీశారు.



టోక్యోలోని ద న్యూ స్టేడియంలో జరిగిన ఎంపీరర్స్ కప్ ఫుట్‌బాల్ ఫైనల్‌లో కాశీమా అంట్లర్స్‌పై విజయం సాధించిన అనంతరం అభిమానులకు అభివాదం చేస్తున్న విస్సెల్ కోబ్ ఆటగాళ్లు

స్టాక్ మార్కెట్లకు ‘హ్యాపీ’ న్యూ ఇయర్


• తొలిరోజు లాభాలతో శుభారంభం • ప్రధాన సూచీలు నష్టపోయినా మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ స్టాక్స్‌లో భారీగా వాటాల కొనుగోళ్లు

• 52.28 పాయింట్లు లాభపడిన సెన్సెక్స్.. నిఫ్టీకి 14.05 పాయింట్ల ఆధిక్యత

• అంతర్జాతీయ మార్కెట్లకు సెలవు

ముంబయి, జనవరి 1: నూతన సంవత్సరం 2020 తొలి వాణిజ్య దినం దేశీయ స్టాక్ మార్కెట్లకు శుభారంభాన్నిచ్చింది. ఇన్ఫోసిస్, హెచ్‌డీఎఫ్‌సీ ట్విన్స్, లార్సన్ అండ్ టర్బో భారీ లాభాలను సంతరించుకోవడంతో నష్టాల బాటను అధిగమించిన స్టాక్ మార్కెట్ సూచీలు బుధవారం స్వల్ప లాభాలను నమోదు చేశాయి. 2019 చివరి రోజైన మంగళవారం అధిక స్థాయిలో నష్టాలపాలైన స్టాక్ మార్కెట్లు మదుపర్లను నిరాశపరచిన సంగతి తెలిసిందే. కాగా అంతర్జాతీయంగా ఎలాంటి సానుకూలతలు లేని పరిస్థితుల్లో దేశ ఆర్థికాభివృద్ధి సానుకూల అంచనాలు మార్కెట్లకు చేయూతనిచ్చాయి. 2019 సెప్టెంబర్ త్రైమాసికంలో దేశ జీడీపీలో కరెంట్ అకౌంట్ వార్షిక లోటు (సీఏడీ) సమాన స్థాయి 0.9 శాతానికి (6.3 బిలియన్ డాలర్లకు) చేరింది. ఇందుకు కారణం వాణిజ్య మాంద్యం తగ్గడమేనని విశ్లేషకులు చెబుతున్నారు. ఈ పరిణామం మదుపర్ల సెంటిమెంట్‌పై సానుకూల ప్రభావాన్ని చూపిందని వారు అంచనా వేస్తున్నారు. ఈక్రమంలో బీఎస్ఈ 30 షేర్ల సూచీ సెన్సెక్స్ 52.28 పాయింట్లు (0.13 శాతం) లాభపడి 41,306.02 పాయింట్ల ఎగువన స్థిరపడింది. అలాగే బ్రాడర్ ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ సైతం 14.05 పాయింట్లు (0.12 శాతం) లాభపడి 12,182.50 పాయింట్ల ఎగువన స్థిరపడింది. సెన్సెక్స్ ప్యాక్‌లో పవర్‌గ్రిడ్ అత్యధికంగా 2.76 శాతం లాభపడింది. అదే బాటలో ఎన్‌టీపీసీ, ఎం అండ్ ఎం, ఎల్ అండ్ టీ, హిందుస్తాన్ యూనీలీవర్, హెచ్‌డీఎఫ్‌సీ, ఎన్ఫోసిస్ సైతం లాభాలను సంతరించుకున్నాయి.

మరోవైపు టైటాన్ అత్యధికంగా 2.76 శాతం నష్టపోగా, ఇండస్ ఇండ్ బ్యాంక్ 1.72 శాతం, బజాజ్ ఆటో 1.21 శాతం నష్టపోయాయి. ఆరంభం నుంచి ప్రధాన సూచీలు నష్టాలను నమోదు చేశాయి. మధ్యాహ్నం తర్వాత మదుపర్లు మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ స్టాక్స్‌లో వాటాలను పెద్ద ఎత్తున కొనుగోలు చేయడంతో సూచీలు లాభాల బాటపట్టాయి. చివరికి స్వల్ప లాభాలతో నూతన సంవత్సరానికి శుభసూచకంగా ముగిశాయి. ఇక రంగాలవారీగా చూస్తే ఐటీ, ఎఫ్ఎంసీజీ, ఫార్మా రంగాలు లాభాలను సంతరించుకున్నాయి. వాహన, లోహ, ఫైనాన్షియల్ సూచీలు నష్టపోయాయి. అంతర్జాతీయ మార్కెట్లకు బుధవారం సంవత్సరారంభ సందర్భంగా సెలవు.



వాణిజ్యభూమి

ఐపీఓ ద్వారా రూ. 1000 కోట్ల సమీకరణ

• ‘ది పార్క్’ హోటల్స్ నిర్ణయం




న్యూఢిల్లీ, జనవరి 1: ఇనిషియల్ పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) ద్వారా రూ. 1000 కోట్లు సమీకరించాలని ‘అపీజయ్ సురేంద్ర పార్క్ హోటల్స్’ యాజమాన్యం నిర్ణయించింది. ఈ మేరకు అనుమతి కోసం ఆ సంస్థ మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీకి డ్రాఫ్ట్‌తో కూడిన దరఖాస్తు అందజేసింది. ఈ ఐపీఓలో రూ. 400 కోట్ల తాజా ఇస్యూతోబాటు మరో రూ. 600 కోట్ల విలువైన ‘ఆఫర్ ఫర్ సేల్’ (ఓఎఫ్ఎస్) ఇస్యూ ఉన్నాయి. ఓఎఫ్ఎస్ ద్వారా సమీకరించే మొత్తంలో రూ. 125 కోట్లు ప్రమోటర్ విక్రయ వాటాలుగా, రూ. 354.9 కోట్లు అపీజయ్ ప్రైవేట్ లిమిటెడ్ వాటాలుగా, మరో రూ. 84.7 కోట్లు అపీజయ్ హౌస్ ప్రైవేట్ లిమిటెడ్ వాటాలుగా (పెట్టుబడిదారుల విక్రయ వాటాలు) ఉన్నాయి. డ్రాఫ్ట్ రెడ్ హెర్రింగ్ ప్రాస్పెక్టస్ (డీఆర్‌హెచ్‌పీ) ప్రకారం ఇలా సమీకరించే నిధులను జనరల్ కార్పొరేట్ విధానంలోని ముందస్తు లేదా తిరిగి చెల్లించాల్సిన వాటికి ప్రధానంగా కంపెనీ వినియోగిస్తుంది. ఈ కంపెనీ వాటాలను బీఎస్ఈ, ఎన్ఎస్ఈల్లో లిస్టెడ్‌గా మార్చేందుకు సంబంధించిన ప్రతిపాదనలున్నాయి. దేశంలోని అన్ని ప్రముఖ నగరాలు, పట్టణాల్లో ఈ కంపెనీకి శాఖలున్నాయి. ‘లగ్జరీ బౌటిక్ హోటల్’ పేరిట దేశంలో ‘ది పార్క్’ బ్రాండ్ ద్వారా ఈ కంపెనీ హోటల్ రంగంలో ప్రత్యేకతను చాటుతోంది.

అలాగే షిప్పింగ్, తేయాకు, స్థిరాస్తి వ్యాపారాలతోబాటు ఆక్సఫర్డ్ బుక్‌స్టోర్స్ వంటి రీటెయిల్ బ్రాండ్ల వాణిజ్యం, విద్యారంగంలోనూ ఈ సంస్థ తన వ్యాపార విస్తరణ చేసింది.

ఇక థర్మల్ విద్యుత్ ఉత్పత్తిలో బొగ్గుతో పాటు వ్యవసాయ వ్యర్థ గుళికల వినియోగం

• దాద్రి పవర్ ప్లాంట్‌లో ప్రయోగం విజయవంతం • మరో 21 ప్లాంట్లకు ఈ ఏడాది విస్తరణ

• విద్యుత్ ఉత్పత్తిలో స్థిరత్వానికే అంటున్న అధికారులు



న్యూఢిల్లీ, జనవరి 1: వ్యవసాయ వ్యర్థాలతో కూడిన గుళికలను సైతం ఇకపై బొగ్గుతోబాటు విద్యుత్ ఉత్పత్తిలో వినియోగించాలని ప్రభుత్వ రంగ విద్యుత్ సంస్థ జాతీయ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్‌టీపీసీ) నిర్ణయించింది. ఈమేరకు ఆరు మిలియన్ టన్నుల వ్యవసాయ వ్యర్థ గుళికలను సేకరించాలని తీర్మానించింది. ప్లాంట్లలో విద్యుత్ ఉత్పత్తి చేసే సమయంలో బొగ్గుతోబాటు మండేందుకు ‘కోఫైర్’ ఇంధనంగా ఈ వ్యవసాయ వ్యర్థ గుళికలను వినియోగిస్తారు. తద్వారా విద్యుత్ ఉత్పత్తి ప్రక్రియకు బొగ్గు కొరత కారణంగా ఏర్పడే ఆటంకాలు తమసిపోయి ఉత్పత్తిలో స్థిరత్వం చోటుచేసుకుంటుందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం ఈ వ్యవసాయ వ్యర్థ ఆధారిత గుళికలను ప్రయోగాత్మకంగా ‘దాద్రి’ థర్మల్ పవర్ ప్లాంట్‌లో వినియోగిస్తున్నారు. అక్కడ విజయవంతం కావడంతో 2020లో ఆ కంపెనీకి దేశ వ్యాప్తంగా ఉన్న 21 విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో ఈ గుళికలను వినియోగించాలని నిర్ణయించారు. కంపెనీకి మొత్తం 24 బొగ్గు మండించడం ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసే థర్మల్ కేంద్రాలున్నాయి. అలాగే అనుబంధ సంస్థలకు చెందిన మరో 9 విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలున్నాయి. వీటన్నింటికీ వ్యవసాయాధారిత వ్యర్థ గుళికల సేకరణ నిమిత్తం టెండర్ల ప్రక్రియ ఆరంభమైందని సంబంధిత అధికారి తెలిపారు. మొత్తం ఆరు మిలియన్ టన్నుల గుళికలను సేకరించాలన్న లక్ష్యం ఉందని, ఒక్కో టన్ను గుళికల ధర సుమారుగా రూ. 7వేల వరకు ఉంటుందని ఆయన వివరించారు. మొత్తం సేకరణకు రూ. 4,200 కోట్లు వ్యయం కావచ్చన్నారు. ప్రస్తుతం ప్లాంట్లలో వినియోగిస్తున్న బొగ్గుకు కుంచెల వినియోగం, పొడి వంటి సమస్యలున్నాయని, తాజాగా బొగ్గుకు తోడుగా వ్యవసాయ వ్యర్థ ఆధారిత గుళికలు వినియోగించడం ద్వారా ఆ సమస్యలు తొలగుతాయని తెలిపారు. గత పక్షం రోజుల వ్యవధిలో దాద్రి పవర్ ప్లాంట్‌లో బొగ్గుతోబాటు 70 నుంచి 80 టన్నుల ఆగ్రోబేస్డ్ పెల్లట్‌లను వినియోగించడం జరిగింది. హర్యానా, పంజాబ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లోని సరఫరాదారుల ద్వారా ఈ గుళికలను సేకరించారు.

మౌలిక వసతుల రంగంలో 388 ప్రాజెక్టులపై అదనపు వ్యయం

• అంచనా వ్యయానికి రూ. 4 లక్షల కోట్లు అదనం

• వ్యయ భారంతో నిర్మాణంలో తీవ్ర జాప్యం

• ఈ తరహా ప్రాజెక్టుల సంఖ్య తగ్గిస్తున్నామంటున్న కేంద్రం

న్యూఢిల్లీ, జనవరి 1: దేశవ్యాప్తంగా మౌలిక వసతుల రంగానికి చెందిన 388 ప్రాజెక్టులు అదనపు వ్యయ భారంతో అలమటిస్తున్నాయి. ఒక్కో ప్రాజెక్టు విలువ సుమారు రూ. 150 కోట్లుకాగా వీటి నిర్మాణంలో వివిధ కారణాలతో జాప్యం నెలకొని సుమారు రూ. 4లక్షల కోట్ల మేర అదనపు వ్యయభారం పడింది. కేంద్ర గణాంకాలు, పథకాల అమలు మంత్రిత్వ శాఖ రూ. 150 కోట్లు, అంతకు మించిన వ్యయ అంచనాలతో కూడిన మౌలిక వసతుల ప్రాజెక్టులను నిర్వహిస్తోంది. ఇలా ఈ శాఖ పరిధిలోని మొత్తం 1,636 ప్రాజెక్టుల్లో 388 ప్రాజెక్టుల నిర్మాణం అధిక వ్యయ భారం కారణంగా ఆలస్యం అవుతుండగా 563 ప్రాజెక్టులు మాత్రమే నిర్ణీత కాల వ్యవధిలో పూర్తికావస్తున్నాయి. ఈ మంత్రిత్వ శాఖ నిర్వహణలోని 1,636 ప్రాజెక్టుల వాస్తవ ఖర్చు అంచనాలు రూ. 19,52,524.85 కోట్లు. అయితే తాజాగా ఈ ప్రాజెక్టులు పూర్తి కావాలంటే రూ. 23,53,108.80 కోట్లు వ్యయం చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. అంటే వాస్తవ వ్యయం కంటే 20.52 శాతం అదనపు భారం ఈ ప్రాజెక్టులపై పడింది. దీన్నిబట్టి రూ. 4,00,583.95 కోట్లు అదనంగా ఈ ప్రాజెక్టులకోసం ప్రభుత్వం వ్యయం చేయాల్సిన అగత్యం నెలకొంది. ఐతే గడచిన 2019 అక్టోబర్ నాటికి 43.86 శాతంగా ఉన్న ఈ అదనపు భారాన్ని తగ్గించడానికి తీసుకున్న చర్యలు విజయవంతం కావడం వల్లే తాజాగా ఆ భారం 20.52 శాతానికి దిగివచ్చిందని, ఆలస్యమవుతున్న ప్రాజెక్టుల సంఖ్య 490కి తగ్గిందని సంబంధిత మంత్రిత్వ శాఖ అధికారులు చెబుతున్నారు. 563 ప్రాజెక్టుల్లో 185 ప్రాజెక్టులు 1 నుంచి 12 నెలలు, 123 ప్రాజెక్టులు 13 నుంచి 24 నెలలు, 136 ప్రాజెక్టులు 25 నుంచి 60 నెలలు 119 ప్రాజెక్టులు 61 నెలలకు పైబడి ఆలస్యం అవుతున్నాయి. ఈ ప్రాజెక్టుల కనీస కాలయాపన 38.74 నెలలుగా ఉంది.

ముదురుతున్న వివాదం

సీఏఏపై బీజేపీయేతర రాష్ట్రాల ఎదురు దాడి

అసెంబ్లీలకు ఆ అధికారాలు ఉన్నాయి..

కేరళ సీఎం పినుయి విజయన్ ❖ బీజేపీ విమర్శలపై ఎదురుదాడి



తిరువనంతపురం, జనవరి 1: పౌరసత్వ సవరణ చట్టంపై వేడి ఇంకా తగ్గలేదు. సీఏఏను అమలు చేయబోమని బీజేపీయేతర పాలిత రాష్ట్రాలు ఖరాఖండిగా చెబుతుండగా, రాష్ట్రాలకు ఆ అధికారం లేదని కేంద్ర మంత్రులు, బీజేపీ నేతలు వాదిస్తున్నారు. కేంద్రం తీసుకునే ఏ విషయంపైన అయినా అనుకూలంగా లేదా వ్యతిరేకంగా తీర్మానం చేసి పంపించే అధికారం అసెంబ్లీలకు ఉందని కేరళ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ తెలిపారు. పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ), జాతీయ పౌరుల జాబితా (ఎన్ఆర్సీ)లకు వ్యతిరేకంగా కేరళ రాష్ట్ర అసెంబ్లీ మంగళవారం తీర్మానం చేయడంతో, రాష్ట్రాలకు ఆ అధికారం లేదంటూ బీజేపీ నేతలు, కేంద్ర మంత్రులు మండిపడుతున్న సంగతి తెలిసిందే. ముఖ్యమంత్రి విజయన్ ఈ విషయంలో 'న్యాయ నిపుణుల సలహాలు' తీసుకుంటే మంచిదని కేంద్ర న్యాయ శాఖ మంత్రి రవి శంకర్ ప్రసాద్ వ్యాఖ్యానించారు. పౌరసత్వ సవరణ చట్టం చేయాలంటే పార్లమెంటుకే అధికారం ఉంటుంది తప్ప కేరళ లేదా ఏ రాష్ట్రానికీ అధికారం ఉండదని ఆయన వివరించారు. బీజేపీ రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు కూడా తీవ్రంగా ప్రతిస్పందించారు. పార్లమెంటు చేసిన చట్టానికి వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేసినందుకు కేరళ ముఖ్యమంత్రి విజయన్‌పై పార్లమెంటు హక్కుల ఉల్లంఘన కింద చర్య తీసుకోవాలని కోరుతూ ఆయన ఉప రాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడుకు లేఖ రాశారు. ఇలాఉండగా ముఖ్యమంత్రి విజయన్ బుధవారం విలేఖరులతో మాట్లాడుతూ తనపై విమర్శలు చేస్తున్న బీజేపీ నేతలపై ఎదురు దాడికి దిగారు. ఏ విషయంపైన అయినా అనుకూలంగా లేదా వ్యతిరేకంగా తీర్మానం చేసే అధికారం రాష్ట్రాలకు ఉందని ఆయన చెప్పారు. అసెంబ్లీలకు సర్వాధికారాలు ఉన్నాయని, స్వీయ ప్రత్యేక రక్షణ ఉందని అన్నారు. రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ప్రాథమిక సూత్రాలకు, అధికారాలకు భంగం వాటిల్లిలా పౌరసత్వ సవరణ చట్టం ఉన్నందున దానిని వ్యతిరేకిస్తూ మొట్టమొదట తీర్మానం చేసింది తమ రాష్ట్ర అసెంబ్లీనే అని ఆయన తెలిపారు. కేరళ గవర్నర్ ఆరిఫ్ మహ్మద్ ఖాన్ సీఏఏ చట్టాన్ని సమర్థించడాన్ని విలేఖరులు ప్రస్తావించగా, వివిధ అంశాలపై గవర్నర్‌కు వ్యక్తిగత అభిప్రాయాలు ఉంటాయని ఆయన చెప్పారు. పౌరసత్వ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ కేరళ అసెంబ్లీ మంగళవారం అసెంబ్లీ తీర్మానం చేసింది. బీజేపియేతర పాలిత రాష్ట్ర ప్రభుత్వాలు కూడా సీఏఏను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఈ చట్టాన్ని తమ రాష్ట్రంలో అమలు చేయబోమని ఇదివరకే ప్రకటించిన సంగతి తెలిసిందే.

ఇది నూతన శకం

సీడీఎస్ నియామకంపై కేంద్రం



ఆర్మీ చీఫ్ మనోజ్ ముకుంద్ నరవాణే, నౌకాదళ చీఫ్ అడ్మిరల్ కరంబీర్ సింగ్, ఎయిర్ చీఫ్ మార్షల్ రాకేష్ కుమార్ సింగ్ భదౌరియాతో భారత మొట్టమొదటి చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్) జనరల్ బిపిన్ రావత్

న్యూఢిల్లీ, జనవరి 1: చీఫ్ ఆఫ్ డిఫెన్స్ సర్వీసెస్ (సీడీఎస్)గా బిపిన్ రావత్ నియామకాన్ని ఓ చారిత్రాత్మక సంఘటన, నూతన శకంగా కేంద్ర ప్రభుత్వం అభివర్ణించింది. రక్షణ విభాగంలో ప్రస్తుతం దేశం ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు ఈ చర్యతో పరిష్కారం లభిస్తుందని పేర్కొం ది. అదేవిధంగా భద్రతా రంగంలో సంస్కరణలకు మార్గం ఏర్పడుతుందన్న అభిప్రాయాన్ని కేంద్రం వ్యక్తం చేస్తోంది. ఎయిర్ చీఫ్ మార్షల్ ఆర్‌కేఎస్ భదౌరియా సహా అటు ఆర్మీ, ఇటు ప్రభుత్వ వర్గాలు సీడీఎస్ నియామకం పట్ల హర్షం వ్యక్తం చేశాయి. అయితే, సీడీఎస్ నియామకంపై కాంగ్రెస్ ఆచితూచి వ్యవహరించింది. ఆ పార్టీ నాయకులు అధీర్ రంజన్ చౌదరి, మనీష్ తివారీ తదితరులు బిపిన్ రావత్ నియామకాన్ని వ్యతిరేకించడం లేదని స్పష్టం చేశారు. దేశ రక్షణ వ్యవస్థను పటిష్టపరచడానికి ప్రభుత్వం తీసుకునే ఎలాంటి నిర్ణయాలకైనా తమ పార్టీ మద్దతు ఉంటుందని వారు స్పష్టం చేశారు. కాగా, ప్రధాని నరేంద్ర మోదీ తన ట్విట్టర్ అకౌంట్‌లో సీడీఎస్ నియామకంపై హర్షం వ్యక్తం చేశారు. భారత్‌కు ఎన్నో విలువైన సేవలు అందించిన బిపిన్ రావత్ ఎంతో ఉత్సాహవంతుడైన అధికారి అని మోదీ పేర్కొన్నారు. దేశ సైనిక బలగాలను ఆధునీకరించే బాధ్యత సీడీఎస్‌పై ఉంటుందని అన్నారు. 130 కోట్ల మంది భారతీయుల ఆశలకు అనుగుణంగా రావత్ సమర్థంగా విధులను నిర్వర్తిస్తారనే నమ్మకం తనకు ఉందని మోదీ పేర్కొన్నారు. 'మొట్టమొదటి సీడీఎస్‌గా బిపిన్ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా దేశం కోసం అసువులు బాసిన ఎంతోమంది సైనికుల త్యాగాలను గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉంది. కార్గిల్‌లో యుద్ధం చేసిన సైనికులను గుర్తు చేసుకుంటున్నాను. దేశ రక్షణ వ్యవస్థలో కొన్ని సంస్కరణలు చేపట్టాల్సి ఉంది. దీనిపై విస్తృతంగా చర్చలు జరిపాం. నిపుణులను సంప్రదించాం. ఎన్నో అభిప్రాయాలను సేకరించాం. ఆ తర్వాత చారిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతమైంది' అని మోదీ అన్నారు. హోం మంత్రి అమిత్ షా స్పందిస్తూ నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత రక్షణ వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని అన్నారు. ఎయిర్ చీఫ్ మార్షల్ భదౌరియా సీడీఎస్ నియామకాన్ని ఆహ్వానించారు. ఆధునీకరణతోపాటు రక్షణ రంగంలో సంస్కరణలకు కూడా అవకాశం ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఇలావుంటే, సీడీఎస్ నియామకంతో ఒక్కసారిగా భారత రక్షణ వ్యవస్థ ముఖచిత్రం మారిపోతుందని అనుకోరాదని కాంగ్రెస్ అధికార ప్రతినిధి సుస్మితా దేవ్ వ్యాఖ్యానించారు. సీడీఎస్ నియామకాన్ని తాము వ్యతిరేకించడం లేదంటూనే రక్షణ వ్యవస్థ బలోపేతానికి ఇదొక్కటే మార్గం కాదని స్పష్టం చేశారు. అంతేకాక, ఫలితం ఏ రకంగా ఉంటుందో చెప్పలేని పరిస్థితి నెలకొందని అన్నారు. సీడీఎస్ నియామకం వల్ల రక్షణ వ్యవస్థకు మంచి జరుగుతుందా లేదా అన్నది రానున్న కాలంలో తెలుస్తుందని వ్యాఖ్యానించారు.



ఆంగ్ల సంవత్సరం సందర్భంగా న్యూఢిల్లీలో ఇండియా గేట్ వద్ద సందర్శకుల కోలాహలం

అది ఓ అయోమయ పార్టీ

కాంగ్రెస్‌పై జవడేకర్ విసుర్లు



విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి ప్రకాశ్ జవడేకర్

న్యూఢిల్లీ, జనవరి 1: కాంగ్రెస్‌ను ఓ అయోమయ పార్టీగా కేంద్ర మంత్రి ప్రకాశ్ జవడేకర్ అభివర్ణించారు. చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్) జనరల్ బిపిన్ రావత్ నియామకంపై కాంగ్రెస్ చేస్తున్న విమర్శలు ఆ పార్టీ పరిస్థితికి అద్దం పడుతోందని బుధవారం ఇక్కడ జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన అన్నారు. సీడీఎస్ నియామకాన్ని కూడా రాజకీయం చేయడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. సీడీఎస్ నియామకం ద్వారా దేశంలో ఒక కొత్త సంప్రదాయానికి బీజం పడిందని, ఈ అంశాన్ని రాజకీయ ప్రయోజనాలకు వాడుకునే ఎలాంటి ప్రయత్నాన్నైనా ఖండించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. కాంగ్రెస్ నాయకులు ఒక్కొక్కరు ఒక్కో విధంగా మాట్లాడుతుంటారని, ఆ పార్టీలో అయోమయ పరిస్థితి నెలకొందనే విషయం దీని ద్వారా స్పష్టమవుతున్నదని ఆయన వ్యాఖ్యానించారు. ఏఐసీసీ నాయకుడు రాహుల్ గాంధీ ట్వీట్లను ఆయన మార్గదర్శకులే నిర్ధారిస్తారని వ్యాఖ్యానించారు. మిగతా నాయకులు ఇందుకు విరుద్ధమైన ప్రకటనలు చేస్తూ అందర్నీ అయోమయంలోకి నెడతారని ఆయన ఎద్దేవా చేశారు. సీడీఎస్ నియామకాన్ని గత వారం కేంద్ర కేబినెట్ ఆమోదించిన విషయాన్ని ఆయన గుర్తు చేస్తూ త్రివిధ దళాల సమన్వయానికి సీడీఎస్ కృషి చేస్తారని తెలిపారు. భారత రక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి, మూడు దళాల మధ్య సమన్వయం లోపం లేకుండా సాగడానికి ఈ చర్య ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ చర్యను కాంగ్రెస్ అధికార ప్రతినిధి మనీష్ తివారీ పేర్కొనడాన్ని మంత్రి జవడేకర్ ఖండించారు.

లడఖ్‌లో భారత్-చైనా సైనికాధికారుల భేటీ!

జమ్మూ, జనవరి 1: ఆంగ్ల సంవత్సరాదిన భారత్-చైనా ఆర్మీ అధికారులు లడఖ్‌లో సమావేశమైనట్టు సమాచారం. చుషుల్-మూడ్లోవ్‌లోని బీపీఎమ్ హట్, డీబీఓ-టీడబ్ల్యూడీ మీటింగ్ పాయింట్స్‌లో ఇరు దేశాల ఆర్మీ అధికారులు సమావేశమైనట్టు ఆర్మీ ప్రతినిధి ఒకరు పీటీఐతో మాట్లాడుతూ తెలిపారు. భారత బృందానికి బ్రిగేడియర్ హెచ్ఎస్ గిల్, కల్నల్ మనోజ్ కుమార్ అలాగే చైనా బృందానికి సీనియర్ కల్నల్ బై మిన్, లెఫ్టినెంట్ కల్నల్ లీ మింగ్ జూ నేతృత్వం వహించినట్టు ఆ ప్రతినిధి చెప్పారు. స్వేచ్ఛాయుత, స్నేహపూర్వక వాతావరణంలో ఈ భేటీ జరిగినట్టు ఆయన వివరించారు. సరిహద్దు ప్రాంతాలు సహా పలు అంశాలపై వీరు చర్చించినట్టు సమాచారం. సుహృద్భావ వాతావరణంలో జరిగిన ఈ చర్చలు ఫలవంతమైనట్టు తెలిపారు.

సీడీఎస్ దేశ చరిత్రలోనే చిరస్మరణీయం

కేంద్ర హోం మంత్రి అమిత్ షా



న్యూఢిల్లీ, జనవరి 1: త్రిదళాధిపతి నియామకం భారత దేశ చరిత్రలోనే చిరస్మరణీయంగా కేంద్ర హోం మంత్రి హోం మంత్రి అమిత్‌షా అభివర్ణించారు. త్రిదళాలకు చెందిన సిబ్బంది సంక్షేమానికి మోదీ ప్రభుత్వం తీసుకొంటున్న చర్యలకు ఇది మరింతగా వన్నె తెచ్చే విధంగా ఉంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. సుదీర్ఘ కాలం నుంచి పెండింగ్‌లో ఉన్న త్రిదళాధిపతి నియామకం మోదీ హయంలో నెరవేరిందని బుధవారం షా ట్వీట్ చేశారు. దేశ చరిత్రతోనే మొట్టమొదటి త్రిదళాధిపతిగా బిపిన్ రావత్‌ను సోమవారం కేంద్ర ప్రభుత్వం నియమించిన సంగతి తెలిసిందే. ఈ నియామకంతో ఆర్మీ, నేవీ, వైమానిక దళాల పరాక్రమం మరింతగా బలోపేతం చేస్తుందని ఆయన వివరించారు. సీడీఎస్‌గా బిపిన్ రావత్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన నియామకం కేవలం మూడు దళాలకు చెందిన సిబ్బంది సంక్షేమానికి మరింత దోహదపడడమే కాకుండా మిలిటరీ సామర్థ్యాన్ని ఆధునీకరించేందుకు దోహదపడుతుందని చెప్పొచ్చు. దీంతో 'నవ భారత' శకానికి నాంది పలికినట్లవుతుందని చెప్పారు. 'త్రిదళాధిపతి నియామకం అన్నది ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉందనీ.. మోదీ ప్రభుత్వ హయాంలో ఈ కల నెరవేరిందనీ.. ఇది ఒక చిరస్మరణీయ ఘట్టంగా చరిత్రలో నిలిచిపోతుంది' అని షా ట్వీట్‌లో పేర్కొన్నారు. ప్రపంచంలోనే అత్యుత్తమ భారత రక్షణ దళంగా నిలిచేందుకు ఈ నిర్ణయం కచ్చితంగా దోహదపడుతుందన్న నమ్మకం తనకుందని షా వివరించారు. భారత మొట్టమొదటి సీడీఎస్‌గా నియమితులైన రావత్‌కు ఈ సందర్భంగా షా శుభాకాంక్షలు తెలియజేశారు. 'బిపిన్ రావత్ నేతృత్వంలోని త్రిదళాలు సమన్వయంతో పనిచేస్తూ భారత సైనిక సామర్థ్యం మరింత దీటుగా నిలుస్తుందన్న నమ్మకం తనకు ఉంది' అని షా ఈ సందర్భంగా అభివర్ణించారు.



హాంకాంగ్‌లో బుధవారం భారీ ప్రదర్శన నిర్వహిస్తున్న ప్రజాస్వామ్య అనుకూలవాదులు. గత ఆరు నెలలుగా హాంకాంగ్‌లో నిరసన ప్రదర్శనలు జరుగుతున్న విషయం తెలిసిందే. వివిధ నేరాలపై అరెస్టయిన వారిని చైనాలో విచారించడానికి ప్రభుత్వం అనుమతించిన నేపథ్యంలో నిరసనలు వెల్లువెత్తుతున్నాయి.

మారనున్న ఉత్తర కొరియా వైఖరి?

కిమ్ జోంగ్ ఉన్ ప్రసంగమే సంకేతం!



సియోల్, జనవరి 1: ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ ప్రతి సంవత్సరం నూతన సంవత్సర ఆరంభాన్ని పురస్కరించుకొని ఇచ్చే ఉపన్యాసం తీరులో ఈసారి మార్పు చోటు చేసుకుంది. అమెరికాతో నెరపిన దౌత్య వ్యవహారాలలో గత రెండు సంవత్సరాలలో చోటు చేసుకున్న పొరపాట్లను అంగీకరించకుండా ఉండేందుకే బుధవారం నాటి కిమ్ జోంగ్ ఉన్ ప్రసంగం తీరులో మార్పు వచ్చిందని విశ్లేషకులు పేర్కొన్నారు. ఉత్తర కొరియా గత రెండేళ్లుగా అనుసరిస్తూ వస్తున్న విధానంలో మార్పు కూడా చోటు చేసుకుంటుందని అధ్యక్షుడి ఉపన్యాసం సంకేతాలు ఇచ్చిందని కూడా వారు విశ్లేషించారు. కిమ్ జోంగ్ ఉన్ తన తాత, ఉత్తర కొరియా వ్యవస్థాపక అధ్యక్షుడు కిమ్ 2 సంగ్ ప్రారంభించిన నూతన సంవత్సర ఆరంభం నాడు ఉపన్యాసం ఇచ్చే సంప్రదాయాన్ని పునరుద్ధరించి, 2013 నుంచి ప్రసంగిస్తూ వస్తున్నారు. అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ సాధారణంగా ఉత్తర కొరియా రాజకీయాలకు సంబంధించి గతంలో జరిగిన అంశాలను సమీక్షించి, భవిష్యత్తుకు సంబంధించి నిర్దేశించుకున్న లక్ష్యాలను ప్రకటించడం చేస్తుంటారు. అధ్యక్షుడి ఉపన్యాసాన్ని పూర్తిగా అధికార పత్రిక రొడోంగ్ సిన్‌మున్‌లో ప్రచురిస్తుంటారు. ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం కూడా చేస్తుంటారు. తొలిసారి పార్టీ యూనిఫామ్ ధరించి ఉత్తర కొరియా బలగాలను ఉద్దేశించి కిమ్ జోంగ్ ఉన్ ప్రసంగించారు. అయితే, ఈసారి జనవరి ఒకటో తేదీ ఉదయం నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేయలేదు. మధ్యాహ్నం కూడా అధికారిక టెలివిజన్ అధ్యక్షుడు ఉన్ ప్రసంగాన్ని పూర్తిగా ప్రసారం చేయలేదు. ఆయన ప్రసంగంలోని కొన్ని అంశాలను మాత్రమే ప్రసారం చేసింది. ఉత్తర కొరియా అణు పరీక్షలు, ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి పరీక్షలపై తనకు తానుగా విధించుకున్న మారటోరియానికి ఇంకెంతో కాలం కట్టుబడి ఉండకపోవచ్చుని ఉన్ తన ఉపన్యాసంలో పేర్కొన్నారు. ఉత్తర కొరియా గత రెండేళ్లుగా అనుసరిస్తున్న దౌత్య విధానం నుంచి తప్పుకోబోతున్నట్టు అధ్యక్షుడి ఉపన్యాసం సంకేత ప్రాయంగా వెల్లడిస్తోందని విశ్లేషకులు పేర్కొన్నారు. ఈ రెండేళ్ల కాలం లో అనుసరించిన విధానం వల్ల ఉత్తర కొరియాపై అమెరికా విధించిన ఆంక్షలు పెద్దగా సడలిపోలేదు.

హాంకాంగ్‌లో ప్రజాస్వామ్య పోరాటం

వేల సంఖ్యలో ప్రజల భారీ కవాతు

హాంకాంగ్, జనవరి 1: హాంగ్-కాంగ్‌లో ప్రజాస్వామ్య అనుకూలవాదుల పోరాటం తీవ్ర రూపం దాలుస్తోంది. బుధవారం కొత్త సంవత్సరం రోజున వేల సంఖ్యలో ప్రజలు వీధుల్లోకి వచ్చి ప్రజాస్వామ్యానికి అనుకూలంగా నినాదాలు చేశారు. అంతే కాదు హాంగ్-కాంగ్ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ప్రజలు వేలాదిగా తరలి వచ్చి భారీ కవాతులో పాల్గొన్నారు. సుమారు ఏడు నెలలుగా జరుగుతున్న ఆందోళనలతో హాంగ్- కాంగ్ అట్టుడుకుతున్నది. అల్లర్లతో జన జీవనం స్తంభించింది. రవాణ వ్యవస్థ దెబ్బతిన్నది. ప్రధాన భూభాగమైన చైనాకు రప్పించే ప్రతిపాదన ద్వారా ఈ తిరుగుబాటుకు తెర లేచింది. కానీ బీజింగ్ అనే భయానికి వ్యతిరేకంగా పెద్ద తిరుగుబాటుగా మార్చబడింది. బుధవారం వేల సంఖ్యలో నిరసనకారులు, ఆందోళనకారులు విక్టోరియా పార్కు వద్ద గుమిగూడి హాంగ్-కాంగ్ ప్రధాన రహదారుల్లో భారీ కవాతు నిర్వహించారు. కాజ్-వే, ఇతర దారులన్నీ క్రిక్కిరిసిపోయాయి. దీంతో పర్యాటకులు కొంత ఇబ్బంది పడ్డారు. ప్రధాన వాణిజ్య, వ్యాపారులు తమ దుకాణాలను మూసివేశారు. పౌర హక్కుల ఫ్రంట్ సారథ్యంలో జరిగిన ఈ భారీ కవాతులో ప్రజాస్వామ్యం కోసం పోరాడుతున్న వివిధ ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలూ పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కవాతులో పాల్గొన్న వారు ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని రాసి ప్ల-కార్డులను చేతబూనారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. చిన్న, పెద్ద, ముదుసలి అనే తేడా లేకుండా అన్ని వయస్సుల వారూ ఈ కవాతులో పాల్గొన్నారు. స్వేచ్ఛాయుతమైన వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలని, ఇటీవల శాంతియుతంగా ప్రదర్శన నిర్వహిస్తున్న నిరసనకారులపై పోలీసులు భాష్పవాయువు ప్రయోగించి, విచక్షణారహితంగా లాఠీ ఛార్జి చేసి, రబ్బర్ బుల్లెట్లు ఉపయోగించిన ఘటనలపై స్వతంత్ర సంస్థతో దర్యాప్తు జరిపించాలని, అరెస్టు చేసిన 6,500 మందిని వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. ఇంకా పెద్ద ఎత్తున నిరసన సెగ తగలాల్సి ఉందని ప్రజలు తెలిపారు. శాంతియుతంగా నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న తమపై పోలీసులు చాలా దురుసుగా ప్రవర్తించారని, అమానుషంగా చితకబాదారని వారన్నారు. అయితే పోలీసులు మాత్రం దీనిని ఖండించారు. ఆందోళనకారులు పెట్రోలు బాంబులు విసిరారని, వాణిజ్య, వ్యాపారులకు ఆటంకం కలిగించారని పోలీసులు ఆరోపిస్తున్నారు. అశాంతి కలిగించేందుకు విదేశీ శక్తులూ ప్రయత్నిస్తున్నాయని చైనా ప్రభుత్వ ప్రతినిధి ఒకరు ఆరోపించారు.

10 మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటేయండి

గోవా స్పీకర్‌ను కోరిన కాంగ్రెస్

పనాజీ, జనవరి 1: గత ఏడాది ఆగస్టులో పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాల్సిందిగా గోవా అసెంబ్లీ స్పీకర్ రాజేష్ పట్నేకర్‌ను కాంగ్రెస్ పార్టీ కోరింది. బీజేపీలోకి మారిన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని బుధవారం ఓ వినతిపత్రం సమర్పించింది. రాజ్యాంగంలోని 10వ అధికరణ కింద పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలని స్పీకర్‌కు సమర్పించిన వినతి పత్రంలో గోవా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (జీపీసీసీ) అధ్యక్షుడు దినేష్ చోడాంకర్ కోరారు. రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరించి, బీజేపీలోకి మారిన ఆ 10 మంది ఎమ్మెల్యేలపై చర్య తీసుకోకపోతే ఒక దుష్ట సంప్రదాయాన్ని ప్రోత్సహించినట్టు అవుతుందని ఆయన వ్యాఖ్యానించారు.

ఆసుపత్రులకూ అందని 'నెట్'

శ్రీనగర్, జనవరి 1: కాశ్మీర్ లోయలో ఇంటర్‌నెట్ సౌకర్యాలపై విధించిన నిషేధం ఇప్పటికీ కొనసాగుతోందని, కొత్త ఆంగ్ల సంవత్సరంలో ఆసుపత్రులకు ఈ సౌకర్యాన్ని పునరుద్ధరిస్తామని ప్రభుత్వం గతంలో హామీ ఇచ్చింది. అయితే, ఇప్పటికీ సౌకర్యం మెరుగుపడలేదు. ప్రభుత్వ అధికార ప్రతినిధి రోహిత్ కన్సాల్ ఈ విషయాన్ని ధృవీకరించారు. ఆసుపత్రుల్లో నెట్ సౌకర్యంతోపాటు పోస్టుపెయిడ్ మొబైల్‌లో ఎస్ఎంఎస్ సేవలను కూడా పునరుద్ధరించాలని నిర్ణయించినట్టు చెప్పారు. అయితే, అనివార్య కారణాల వల్ల ఇంటర్‌నెట్ సదుపాయం ఇంకా అందుబాటులోకి రాలేదని ఆయన అన్నారు. ఇంటర్‌నెట్ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నట్టు అనుమానం వ్యక్తం చేశారు. ఇలావుంటే, ప్రభుత్వ ప్రకటన అనంతరం నెట్ సౌకర్యం మంగళవారం రాత్రి నుంచే అమల్లోకి వస్తుందని ఊహించామని, కానీ తమకు నిరాశ కలిగిందని వివిధ ఆసుపత్రుల యాజమాన్యాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ఇంటర్‌నెట్ సౌకర్యం అందకపోవడానికి ప్రొవైడర్ల నిర్లక్ష్యమే కారణమని రోహిత్ కన్సాల్ అనుమానం వ్యక్తం చేయగా, ప్రభుత్వ ఆసుపత్రుల్లో నెట్ సౌకర్యాన్ని పునరుద్ధరించాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

Printed and Published by T. Venkateswarlu on behalf of Deccan Chronicle Holdings Ltd. Printed at Deccan Chronicle Press situated at Plot No. 9, Alwal Village, Vallabh Nagar Taluk, Medchal Malkajgiri Dist., Telangana and Published at 36, S.D. Road, Secunderabad-3, Chief Editor T.V.Ravi Reddy, PBX 27803930 (6Lines), Editorial: 27805056, Regd.No.H/SDHO-4/2K RNI Regd.No.5595/60





మాతృభూమి

పర స్త్రీలను తల్లులుగా
పర ధనమును మట్టిపోలె భావించుటయే
పరమోన్నత సంస్కారము
సరళముగా పొందగల్గు సాయుజ్యమిదే

కొత్త దశాబ్దంలోనైనా..



ఆడపిల్లలు, మహిళలు ఎదుర్కొనే చాలా సమస్యలు కొత్త కొత్త చట్టాలతోనో, శిక్షలతోనే పరిష్కారమై పోయేవి కాదు. వాటి మూలాలు, పరిధి మన సమాజంలో, కుటుంబాల్లో లోతుగా వేళ్లూనుకుని ఉన్నాయి. ఆ సమస్యలను పరిష్కరించాలన్నా, ఇప్పుడున్న పరిస్థితిని చక్కదిద్దాలన్నా, మహిళలకు సమాజంలో సమానత్వం కల్పించాలన్నా ఆ కృషి కుటుంబాల నుంచి, ముఖ్యంగా ఇంటి దగ్గర నుంచే మొదలవ్వాలి.





మరో సంవత్సరాన్ని కాలగర్భంలో కలిపేసి నూతన సంవత్సరంలోకి అడుగుపెట్టేశాం.. కొత్త ఆశలతో, కొంగొత్త కోరికలతో మరో దశాబ్దాన్ని మొదలుపెట్టేశాం.. ఈ కొత్త దశాబ్దంలోనైనా మహిళలపై వివక్ష తగ్గి మహిళలను పురుషులతో సమానంగా చూస్తారని ఆశ.. మహిళలను పూజ్యభావంతో చూసే పురిటిగడ్డ మన భారతదేశం. అలాంటి భారతదేశంలో నేడు ఆడబిడ్డల పుట్టుక కూడా ప్రశ్నార్థకంగా మారింది. దేశవ్యాప్తంగా నమోదైన జననాల గణాంకాలు కూడా ఔననే సమాధానమిస్తున్నాయి. నేటితరం మహిళలు ఉన్నత చదువులతో, కొత్త ఆలోచనతో ముందుకు వెళుతున్నారు. పురుషుల కంటే మహిళలు ఏ రకంగానూ తక్కువ కాదని నిరూపించుకుంటున్నారు. కానీ చిన్నప్పటి నుంచీ తాము ఆడపిల్లలకంటే అధికమన్న సామాజిక ఆధిపత్య భావనల మధ్య పెరుగుతున్న మగపిల్లలు ఈ మార్పును జీర్ణించుకోలేక పోతున్నారు. అందుకే ఇన్ని అఘాయిత్యాలు జరుగుతున్నాయి. అమ్మాయిలు అందంగా ఉండి తమ ప్రేమను కాదన్నా, తమను పట్టించుకోకుండా చదువుల వైపు మొగ్గుచూపుతున్నా, తమను కాదని ఇంకొకరిని పెళ్లి చేసుకున్నా అబ్బాయిలు భరించలేకపోతున్నారు. దీనికి కారణం అబ్బాయిలమన్న అహంకారమే.. దీన్ని పోగొట్టాలి.. అంతేకాదు రాజకీయంగా రాజ్యాంగపరంగానే కాదు.. సామాజికంగా, సాంస్కృతికంగా కూడా మనల్ని మనం సంస్కరించుకోవాలి. పిల్లలకు చిన్నప్పటి నుండే జెండర్ ఎడ్యుకేషన్, జెండర్ సెన్సిటివిటీ పట్ల అవగాహన కల్పించడం అవసరం. అప్పుడే వారికి అమ్మాయిలకు గౌరవం ఇవ్వాలని, వారిని తమతో సమానంగా చూడాలని అనుకుంటారు.

ఇవే కాదు..

లింగనిష్పత్తి, సమానత్వం, వేతనాలు, చట్ట సంస్థలు, రాజకీయ ప్రాతినిధ్యం.. వంటి వాటిల్లో ఈ దశాబ్దంలో తప్పకుండా మార్పు రావాలి.

లింగనిష్పత్తి

కారణం ఏదైనా.. కారకులెవరైనా దేశవ్యాప్తంగా ఆడపిల్లల సంఖ్య నానాటికీ తగ్గిపోతోంది. మరీ ప్రమాదకరమైన అంశం ఏమిటంటే విజ్ఞానవంతులు, చదువుకున్నవాళ్లు అధికంగా ఉండే పట్టణ ప్రాంతాల్లో ఆ సంఖ్యలో తరుగుదల నమోదవడం, తాజాగా విడుదలైన జనాభా లెక్కల వివరాలు ఈ చేదు నిజాన్ని బయటపెట్టాయి.

ఒక్క అరుణాచల్‌ప్రదేశ్ మినహా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఇదే పరిస్థితి ఉంది. ప్రతి వెయ్యి మంది అబ్బాయిలకు, ఎంతమంది అమ్మాయిలు పుట్టారనే సంఖ్యను 'లింగనిష్పత్తి'గా పిలుస్తారు. దేశవ్యాప్తంగా 2017 ఒకటి నుంచి డిసెంబర్ 31 వరకూ నమోదైన జననాల ప్రకారం మొదటిస్థానంలో అరుణాచల్‌ప్రదేశ్‌లో లింగనిష్పత్తి 1047 ఉంటే.. రెండో స్థానంలో ఉన్న ఛత్తీస్‌గఢ్‌లో 78కి తగ్గి 968గా నమోదైంది. ఆ ఏడాది దేశం మొత్తం పుట్టినవారిలో అబ్బాయిలకన్నా అమ్మాయిలు సుమారు 11.21 లక్షల మంది తక్కువగా ఉన్నాయి. అభివృద్ధి చెందిన రాష్ట్రాలుగా పేరొందిన ఆంధ్రప్రదేశ్, తెంగాణ, పంజాబ్, తమిళనాడు, గుజరాత్‌లలో కూడా లింగనిష్పత్తి దారుణంగా తగ్గుతోంది. రాష్ట్రాలవారీగా లింగనిష్పత్తిలో ఏపీ 11, తెలంగాణ 20వ స్థానంలో ఉన్నాయి. జాబితాలో ఆఖరున ఉన్న పంజాబ్ రాష్ట్రంలో ప్రతి వెయ్యిమంది బాలురకు కేవలం 890 మంది అమ్మాయిలే పుట్టగా.. చివర నుంచి రెండో స్థానంలో ఉన్న గుజరాత్‌లో 898 మందే ఉన్నారు. దేశంలో లింగ నిష్పత్తి అతి తక్కువగా.. అంటే 900 కంటే దిగువన ఉన్నది ఆ రెండు రాష్ట్రాలే.. ఆడపిల్లల జననాలు అభివృద్ధి చెందిన రాష్ట్రాల్లో తక్కువగా ఉండటానికి కొన్ని ప్రధాన కారణాలున్నాయని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. చాలామంది ఉద్యోగులు, విద్యావంతులు మొదట అబ్బాయి పుట్టిన పక్షంలో రెండో బిడ్డను కనకుండా ఆపేస్తున్నారు. ఉన్నత కుటుంబాలు, బాగా విద్యావంతులైన కుటుంబాల్లో ఆలస్యంగా పెళ్లిళ్లు కావడం, ఒకరు లేదా ఇద్దరు పిల్లలకే పరిమితం అవుతుండటం కూడా లింగనిష్పత్తి తగ్గేందుకు కారణమవుతోంది. ప్రస్తుత పరిస్థితులు ఇలాగే కొనసాగితే ప్రపంచవ్యాప్తంగా స్త్రీ, పురుష నిష్పత్తి, తారతమ్యాలు పోవడానికి మరో వందేళ్లు పడుతుందని అంచనా.

విదేశాల్లో..

విదేశాల్లో నివసిస్తున్న భారతీయ కుటుంబాల్లో జననాలకు, భారత రాయబార కార్యాలయాల్లో నమోదు చేయిస్తున్నారు. ఆ ప్రకారం 2017లో 110 దేశాల్లోని భారతీయ కుటుంబాల్లో నమోదు చేయి



స్తున్నారు. ఆ ప్రకారం 2017లో 110 దేశాల్లోని భారతీయ కుటుంబాల్లో 12, 479 మంది జన్మించారు. అక్కడ బాలురతో పోలిస్తే బాలికల సంఖ్య 155 తక్కువగా ఉంది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో 70 మంది తక్కువగా ఉన్నారు. దక్షిణాఫ్రికా, సూడాన్, పోలండ్, సౌదీ అరేబియా, జర్మనీ, ఆస్ట్రేలియా దేశాల్లోని భారతీయ కుటుంబాల్లో బాలికలు ఎక్కువగా పుట్టారు.

సమానత్వం

ఇంట్లో ఆడపిల్ల, మగపిల్లాడు ఉంటే వారిద్దరినీ ఎలా పెంచుతామన్నది తల్లిదండ్రులు తప్పకుండా ఆలోచించాల్సిన విషయం. పిల్లలకు బొమ్మలను కొనిపెట్టడం దగ్గరి నుంచీ నీతి నియమాలను బోధించడం వరకూ.. అన్నింటిలోనూ అబ్బాయిలు అధికమన్న భావనను పొరబాటున కూడా పిల్లలిద్దరి మనసులో పడకుండా చూసుకోవాలి. సాంప్రదాయం, సామాజిక కట్టుబాట్ల ముసుగులో అమ్మాయిల్ని కట్టిపడేయకుండా బాల్యం నుంచి ఆడపిల్లకు స్వేచ్ఛ, సమానత్వాన్ని కలిగిస్తూ పెంచాలి. అబ్బాయిలకు చిన్నప్పటి నుంచే ఆడపిల్లలతో ఎలా మసగాలి, వారిని ఎలా గౌరవించాలి అన్న విషయాలను చెబుతూ పెంచాలి. ఆడపిల్లలు వారికి ఏ రూపంలో కష్టమొచ్చినా స్వేచ్ఛగా ఇంట్లో చెప్పుకోగలిగే వాతావరణాన్ని తల్లిదండ్రులు కల్పించాలి. వారి ప్రవర్తనలో ఏ పాటి తేడా కనిపించినా వెంటనే వారిని ప్రేమగా దగ్గర కూర్చోబెట్టుకుని ఆరాతీయాలి. అంతే తప్ప వారిని చీటికిమాటికి కసరకూడదు.

సినిమాలు

సినిమాల్లో అమ్మాయిలను వేధించడం, వెటకారాలు ఆడటం, దురుసుగా ప్రవర్తించడం, వారి అభిప్రాయాలకు విలువ ఇవ్వకుండా దాడులకు దిగడం వంటివి పరిపాటిగా మారాయి. యుక్తవయస్కులపై బలమైన ప్రభావం వహించే సినిమాల్లో ఈ ధోరణిని చక్కదిద్దడం మంచిది. అంతేకాదు.. అమ్మాయి, అబ్బాయిల మధ్య చక్కటి అనురాగాలను ప్రదర్శించడం అవసరం. ఇలాంటివి అనుసరిస్తూనే మారుతున్న కాలానికి తగ్గ సినిమాలు రావడం చాలా ముఖ్యం.

చట్టాలు

అమ్మాయిలను సమానంగా చూడటానికి, అమ్మాయిలపై వేధింపులకు చాలానే చట్టాలు ఉన్నాయి. కానీ వీటిల్లోని లొసుగులను ఉపయోగించుకుని అబ్బాయిలు చట్టానికి దొరక్కుండా తప్పించుకుని తిరుగుతున్నారు. అలాంటివి జరగకుండా చూసి తప్పు చేసిన వాడికి త్వరితగతిన శిక్ష పడేలా చూడాలి. అలాగే లింగవివక్షపైనా, దాని నిరోధక చట్టాలపైనా యుక్త వయస్సు నుంచే పిల్లల్లో అవగాహన పెంచాలి. ఆడపిల్లలు, మహిళలు ఎదుర్కొనే చాలా సమస్యలు కొత్త కొత్త చట్టాలతోనో, శిక్షలతోనే పరిష్కారమైపోయేవి కాదు. వాటి మూలాలు, పరిధి మన సమాజంలో, కుటుంబాల్లో లోతుగా వేళ్లూనుకుని ఉన్నాయి. ఆ సమస్యలను పరిష్కరించాలన్నా, ఇప్పుడున్న పరిస్థితిని చక్కదిద్దాలన్నా, మహిళలకు సమాజంలో సమానత్వం కల్పించాలన్నా ఆ కృషి కుటుంబాల నుంచి, ముఖ్యంగా ఇంటి దగ్గర నుంచే మొదలవ్వాలి. లింగవివక్ష మూలంగా మన సమాజం ఆర్థికంగా, సామాజికంగా.. ఏ రకంగా చూసుకున్నా భారీ మూల్యం చెల్లించుకోవలసిందే.. అందుకే పరిస్థితులను అర్థం చేసుకుని ఈ సమస్యల నుండి బయటపడటానికి ఈ దశాబ్దిలోనే ముందడుగు వేద్దాం. మరి ఏమాత్రం ఆలస్యం చేయకుండా.. వెంటనే మహిళలను సంరక్షిస్తూ, వారికి సమానత్వం కలిగించే దిశగా అడుగులను వేద్దాం.. ఆడబిడ్డను కాపాడుకుందాం.

- సన్నిధి

చలికాలం-చిన్నారులు



పిల్లల్లో రోగనిరోధకశక్తి తక్కువగా ఉండటం వల్ల త్వరగా వ్యాధులు వ్యాపిస్తాయి. ముఖ్యంగా చలికాలంలో వ్యాధుల ప్రభావం కాస్త ఎక్కువగా ఉంటుంది. గజగజా వణికించే ఈ చలికాలంలో పిల్లల్లో వచ్చే వ్యాధులు, ఈ వ్యాధులు రాకుండా తల్లిదండ్రులు ముందే జాగ్రత్తలు తీసుకోవాలి.

ఊపిరితిత్తుల్లో నెమ్ము

చలికాలంలో జలుబు, దగ్గు.. బాక్టీరియా లేదా వైరస్ వల్ల వ్యాపిస్తాయి. జలుబు, దగ్గు మామూలే కదా అని అశ్రద్ధ చేస్తే శ్వాస తీసుకోవడం ఇబ్బంది అవుతుంది. దీన్నే న్యుమోనియా అంటారు. దీని కారణంగా ఊపిరితిత్తుల్లోకి నెమ్ము చేరి పిల్లలకు ప్రమాదంగా మారుతుంది. ఇలా నెమ్ము చేరకుండా ఉండాలంటే తల్లి, బిడ్డకు ఆరునెలల పాటు పాలు ఇస్తే మంచిది.

ఆస్తమా

అపరిశుభ్రత, కాలుష్యంలోని పుప్పొడి రేణువుల వల్ల, శ్వాసనాళాల్లో అడ్డుపడి ఊపిరి తీసుకోవడం కష్టంగా ఉంటుంది. ఇలా ఉండే పరిస్థితినే ఆస్తమా అని అంటారు. ఆస్తమా ఉన్నప్పుడు దగ్గు కూడా ఎక్కువగా ఉంటుంది. మంచు కురుస్తున్నప్పుడు పిల్లలను బయటకు తీసుకెళ్లడం చేయకూడదు. శ్వాసకోశాలు అడ్డుపడటం వల్ల గుండెపోటు వచ్చే ప్రమాదం ఉంది.

హైపోథరిమియా

చలికాలంలో మంచుకి, చలికి కొందరి శరీరం తట్టుకోలేదు. ఎక్కువగా వణికిపోతుంటారు. ఈ సీజన్‌లో చలి ప్రభావం కారణంగా కొందరి పిల్లల్లో సాధారణం కంటే తక్కువ శరీర ఉష్ణోగ్రత ఉంటుంది. దీనినే వైద్య పరిభాషలో హైపోథరిమియా అంటారు. దీని కారణంగా కాళ్లు, చేతులు పనిచేయకపోయే ప్రమాదం ఉంది.

ఫ్లూ జ్వరాలు

జలుబు, దగ్గు నుండి ఫ్లూ జ్వరాలు వెంటనే రోగనిరోధకశక్తి తక్కువగా ఉన్న పిల్లలను చేరుతాయి. అలాగే ఇంటి వాతావరణం సరిగా లేకపోయినా, కలుషిత నీటిని తాగడం వల్ల, దోమలు ఎక్కువగా ఉండటం కారణంగా వైరల్ ఫీవర్, టైఫాయిడ్, మలేరియా వ్యాపిస్తాయి.

స్కిన్ అలర్జీ

చలికి చర్మం పొడిబారడం వల్ల మంట, దురద కలగడంతో పిల్లలు వెంటనే చర్మంపై రుద్దడం,



గిల్లడం చేస్తుంటారు. ఇలా ఒకరిని మరొకరు తాకినప్పుడు తామర, చర్మ సమస్యలు అధికంగా ఉంటాయి. అయితే ఈ వ్యాధులు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

జాగ్రత్తలు

⁘ చలి ప్రభావం ఎక్కువగా ఉంటుంది కాబట్టి పిల్లలను రాత్రిపూట బయటకు తీసుకురావడం మంచిది కాదు. అలాగే ఉదయం సూర్యుడు వచ్చాకే పిల్లలను బయటకు తీసుకురావాలి. ఇంట్లో ముసలివారు ఉన్నా కూడా ఇలాగే చేయాలి.

⁘ చలికాలంలో ఉన్నిదుస్తులు ధరించడం, తలకు మఫ్లర్, కాళ్ళు, చేతులకు సాక్స్ ధరించడం వంటివి చేయాలి. ఇలా చేయడం వల్ల శరీర ఉష్ణోగ్రత తగ్గకుండా చూసుకోవచ్చు. ముఖ్యంగా పిల్లలకు ఉన్ని దుస్తులు వేయడం మర్చిపోకూడదు.

⁘ ఇంట్లో పిల్లలు ఉన్నప్పుడు ఏసీ, ఫాన్లు వేయడం వల్ల మరింత చలి పుడుతుంది కాబట్టి వణికిపోతారు.


⁘ చలికాలంలో చర్మ సంరక్షణ పిల్లలు, పెద్దలు తప్పకుండా చూసుకోవాలి. చర్మం పొడిబారి పక్కులు వచ్చి పెళుసుగా ఊడిపోయి మంట, దురదను కలిగిస్తాయి. అందుకని చర్మాన్ని కాపాడే చలికాలం క్రీములు లేదా నూనెలను రాయాలి.

⁘ పిల్లలకు ప్రతిరోజూ తప్పకుండా ఒక గ్లాసు గోరువెచ్చటి పాలను తాగించాలి. అలాగే చలికాలం కదా అని నిర్లక్ష్యం చేయకుండా ఎక్కువ మంచినీటిని తాగిస్తూ ఉండాలి.

ఇలా చలికాలం ఈ జాగ్రత్తలు తీసుకుంటే ఎటువంటి వ్యాధులూ రాకుండా పిల్లలను కాపాడుకోవచ్చు.

★

రంగవల్లి



19 చుక్కలు
1 వచ్చేవరకు
సరిచుక్కలు

యస్. నేహ
బైసిన్ కాలనీ, యాప్రాల్

ముగ్గులకు ఆహ్వానం

నింగిలోని హరివిల్లులను నేలపైన పేర్చి.. కనులకింపైన రంగుల్ని అందంగా అద్దితే అది రంగుల మాలికవుతుంది. ముంగిట్లో రంగవల్లిక అవుతుంది. ధనుర్మాసం సందర్భంగా తెలుగు ముంగిళ్లలో రంగవల్లులను తీర్చిదిద్దడం ఆనవాయితీ.. ఆ సందర్భంగా ముగ్గులకు ఆహ్వానం పలుకుతోంది మాతృభూమి. ఆసక్తి కలవారు కింది చిరునామాకు ముగ్గులను పంపగలరు.

సూచనలు

- ★ ముగ్గులను పంపేవారు ఎ4 సైజు తెల్ల కాగితంపై వేయాలి.
- ★ ముందుగా నల్లని ఇంక్‌తో ఔట్‌లైన్ గీసిన తరువాత అందులో రంగుల్ని నింపాలి.
- ★ ఎన్ని చుక్కలను పెట్టి ముగ్గులు వేశారో.. అంటే సరి చుక్కలా, బేసి చుక్కలా, సందు చుక్కలా.. అనే విషయం స్పష్టంగా రాయాలి.
- ★ ముగ్గుతో పాటు, మీ పాస్‌పోర్ట్ సైజు కలర్ ఫొటోను, చిరునామాని జతచేయాలి.
- ★ డౌన్‌లోడ్ చేసిన ముగ్గులు కాక, స్వయంగా చేతితో వేసిన ముగ్గులనే పంపాలి. అదీ చుక్కల ముగ్గులకు మాత్రమే ఆహ్వానం.

ముగ్గులు పంపాల్సిన చిరునామా:
ఎడిటర్,
ఆంధ్రభూమి దినపత్రిక, 36, సరోజినీదేవి రోడ్,
సికింద్రాబాద్ - 500 003

కొత్త ఏడాదిని ఎలా మలచుకోవాలి?



ఈమధ్య కాలంలో యువత మద్యాన్ని సేవించి డ్రైవింగ్‌కు ఉపక్రమించడం మూలాన ఎంతగా పలు ఘోర, ప్రమాదాల బారినపడి మృత్యువాత పడుతున్నారో, తీవ్రగాయాల పాలు అయ్యేవారి తల్లిదండ్రులకు ఎంతటి గర్భశోకాన్ని మిగులుస్తున్నారో తెలియనవి కాదు. ముఖ్యంగా నూతన సంవత్సరం వచ్చిన సందర్భంలో యువతీ యువకులు మరింతగా మద్యం సేవించి పేట్రేగి పోతూ, వాహనాలకు విపరీతమైన వేగంతో నడుపుతూ వారొక హీరోలుగా, హీరోయిన్లుగా ఫీలవుతున్నారు. కానీ ఒక్కోసారి యువతీ యువకులు అదుపుతప్పి వేగం కారణంగా తమ ప్రాణాల మీదకు సైతం కొని తెచ్చుకుంటూ ఉంటారు. వీరిని నియంత్రణ చేయడం వారి తల్లిదండ్రులకు సైతం శక్తికి మించిన పనిగా పరిణమిస్తూ ఉంటుంది. యువత నూతన సంవత్సరం రోజైనా జ్ఞానోదయం పొంది తమ వైఖరిలో మార్పు తెచ్చుకోకుండా వ్యవహరిస్తే మాత్రం భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు. ఎందుకంటే జీవితం ఎంతో విలువైనది. క్షణికావేశంలో చేసే తప్పుల వల్ల తల్లిదండ్రుల మాటను పెడచెవిన పెట్టక జీవితాన్ని దృష్టిలో ఉంచుకుని మంచిగా ముందుకు నడవాలి.

ఈ సంవత్సరం నుంచైనా ఒక మంచి మార్పునకు స్వీకారం చుడితే రాబోయే కాలంలో మన దేశం అంతర్జాతీయ సమాజంలో ఒక వెలుగు వెలగడం తథ్యం అని గుర్తుపెట్టుకోవాలి. ఎందుకంటే యువత ఒక్కసారి ఉక్కు పిడికిలి బిగించి పరిశ్రమించింది అంటే మన దేశ పురోభివృద్ధిని ఆపడం ఎవరి తరం కాదు.

- బుగ్గన మధుసూదన రెడ్డి

కర్మభూమి

రచనో, చిత్రమొ నాట్యమొ
రుచి పెంచెడి కర్మమొకటె ఋతమై నిలుచున్
శుచియౌ ప్రేరణ నొసగుచు
కాచుచుబ్రోచుచు మనుజుల కాంక్షలు తీర్చున్

ఆంధ్రభూమి గురువారం, 2 జనవరి 2020 II

సూర్య శతకం - కొడుకుల సూర్యసుబ్రహ్మణ్యం 9492457262

తే.గీ.
గుణము లేనట్టి కులమేల?కోట్ల వేల
సకల సద్గుణ సంపత్తి సాటి ధనము
వెదకి జూచిన లేదిల వేల్పు గుణమె
చూడుమో కర్మసాక్షి యో సూర్యదేవ!

భావం: గుణములేని కులం దేనికి? కోట్లాది రూపాయలు ఉన్నా గుణసంపద లేకుంటే వృథా సకల సద్గుణ సంపత్తితో సమానమైన ధనం ఈ భూమ్మీద లేదు. ఇలవేల్పు సద్గుణమేనన్న విషయాన్ని కర్మసాక్షియైన సూర్యదేవా ఈలోకానికి తెలియుజేయుము.

తే.గీ.
నూత్న సంవత్సరాన వినూత్న కాంతి
నిత్య నిజజీవితాలలో నివ్వటిల్ల
దివ్య భారతి సేవకై దిగుదురయ్య
చూడుమో కర్మసాక్షి! యో సూర్యదేవ!

భావం: ఈకొత్తవత్సరంలో వినూత్న కాంతి మనందరిజీవితాలలో వ్యాపించాలి. ఆ వెలుగులో దివ్యభారతి సేవకై నడుముగట్టాలని కర్మసాక్షియైన ఓ సూర్యదేవా ఈలోకానికి తెలియుజేయుముదేవా!

జగదేక సుందరి క్లియోపాత్రా

27 -ధనికొండ హనుమంతరావు

ఆమె దేశద్రోహిగా ముద్రింపబడింది. ఈ అభిప్రాయం తమకు లేకపోవచ్చు. తమ సేనానులమైన మాకు లేకపోవచ్చు. కాని ఆమె ఈజిప్షియన్ కనుక, ఆమె నేరాలను విచారించే హక్కు ఈజిప్షియన్ చట్టాలకే ఉంటుంది.''

''కాని ఈప్పు రోమన్ అధికారాలకు లోబడి ఉన్నది కదా?'' అన్నాడు సీజర్. ఎలాగైనా క్లియోపాత్రా మీద ఈగ వాలకుండా చూడాలని ఆయన ప్రయత్నిస్తున్నాడని అర్థమౌతోంది.

''ఎప్పుడు? నిన్నమొదటిదాకా! కాని, మీరు తొందరపడి దేశద్రోహిని చేరదీశారు. రాజవంశానికే ద్రోహం చేశారనే భావం ఈజిప్షియన్ ప్రభుత్వానికి ఏర్పడింది. మీరు భార్యాభర్తలమధ్య సంధి కూర్చగల పెద్దమనుషులూ, మధ్యవర్తులూ కదానని వారు ఆశపడ్డారు. కాని, ఆ భార్యనే తాము స్వంతం చేసుకున్నారు. ఇప్పుడు మనందరం అటు క్లియోపాత్రా వలెనే దేశద్రోహులుగా తయారయ్యాము. ఒక్కటి ఆలోచించండి. ఇదే సంఘటన రోమ్‌లో జరిగి ఉంటే, మనందరి మనస్తత్వాలు ఎలా ఉండేవి? ఈ నీచానికి వడిగట్టిన వ్యక్తిని క్షమించి ఉండేవాళ్ళ శమా?''

ఉద్రేకంలో వొళ్ళు తెలయక సీజర్‌ను నీచుడుగా కూడా సర్వసేనాని చిత్రించాడు. సీజర్ ఇది గ్రహించాడు. కాని, ఉద్రేకాలకు ఇది సమయం కదాలు. ఈ సమయంలో తాను సేనానుల్ని ఎదిరించి అవమానంచి, తన ఇష్టానుసారంగా ప్రవర్తించలేడు. అన్ని విధాలా తాను ఇరుకున పడ్డాడు. ఎలాగైనా వారిని మెప్పించాలి.

ఆ''నాకు అర్థమైంది.. కాని క్లియోపాత్రకూ, నాకూ ప్రణయబంధం ఉన్నది. ఆ విషయం మా ఇద్దరికీ సంబంధించిన వ్యక్తిగత సమస్య. ఇతరులకు ఇందులో సంబంధం లేదు కదా!'' అన్నాడు సీజర్.

''క్లియోపాత్రా వ్యక్తిగా మిమ్ము ప్రేమించి ఉండొచ్చు. కాని, ఆమెతోపాటే అనేక రాజకీయ సమస్యలు కూడా మిమ్ము ప్రేమించినవని అనుకుంటున్నారా? ఆమెకు మీరు రక్షణ ఇచ్చినంత కాలం, ఆమె చేసిన తప్పుల్ని కాపాడుతుండవలసిన బాధ్యత మీ మీద పడుతుంది. ఆమె చేసిన నేరాలన్నీ మీవిగా కూడా పరిగణించబడతవి కదా! ఐనప్పుడు మనకున్న సమస్యలే తీరక చస్తూంటే, ఈ కొత్త ప్రమాదాల్ని కూడా కావాలని కొని తెచ్చుకోవటం దేనికి?'''

సీజర్ మాట్లడలేదు. నిస్సహాయ స్థితిలో సేనానులందర్నీ పరీక్షించి చూశాడు. ఒక్కరూ తనకు సుముఖులుగా లేరని గ్రహించాడు.

''ఇప్పటికైనా మించిపోయింది లేదు. క్లియోపాత్రాను టాలమీకి అప్పగించండి; వాళ్ళూ వాళ్ళూ ఏమైనా చస్తారు. అప్పుడు టాలమీ ప్రభుత్వానికి మీమీద కత్తి కట్టవలసిన కారణం ఉండదు!'' అన్నాడు సర్వసేనాని.

''ఏమిటీ?'' అని హూంకరించాడు సీజర్.

''మాకు తోచిన సలహా అదీ! అదే న్యాయమని కూడ మేమందరమూ అనుకుంటున్నాము!'' అన్నాడు సర్వసేనాని.

''న్యాయం! న్యాయానిచ్చే అధికారం నాకు లేదా?''

''ఉన్నది సీజర్! ఈ రోజుల్లో అధికారమే న్యాయం! అధికారంతో వున్నవారు, తమకు అనుకూలంగా ఉండేట్లుగా న్యాయాన్ని ఎటుపడితే అటు తిప్పగలుగుతారు. అందుకనే న్యాయశాస్త్రాలనేవి సామాన్యులపాలిట కల్పతరువుల్లాగు కనిపించినా, వారికవి విషతుల్యాలుగా పరిణమిస్తున్నవి. అయినా ఇక్కడ న్యాయా న్యాయాలతో పనేమిటి? అధికారిగా, నియంతగా మీరే నిర్ణయిస్తున్నారు. కాని, ఆ అధికారం ఇప్పుడు మన చేతుల్లో లేదనీ దాన్ని ఈజిప్టు లాక్కుపోతున్నదనీ మీరు గ్రహిస్తే న్యాయాన్ని గూర్చి మాట్లాడే హక్కు మనకెంతవరకూ ఉంటుందో తెలిసిపోతుంది!'' అన్నాడు సర్వసేనాని.



సీజర్ మళ్లీ మామూలు మనిషవుతున్నాడు. ప్రతి ఉద్రేకానికి, తీవ్రమైన ఆలోచనలు ఉండనందువల్లనే, అంత తేలిగ్గా అంతర్ధానమౌతోంది.

'కాని..' అన్నాడు సీజర్. ''క్లియోపాత్రాకు కూడా ఈజిప్షియన్ సింహాసనంమీద హక్కున్నది కదా! ఔలటీస్ టాలమీ పెద్ద కూతురుగా ఆమె కూడా రాజ్యపాలనకు అర్హురాలు! ఆమె పక్షాన న్యాయం లేదని ఎవరనగలరు?''

తాము ఊహించినదానికన్నా సీజర్ చాలా ముందుకు వెళ్ళాడని సేనానులు గ్రహించారు. సీజర్‌ను ఈ మైకంలో నుంచి మేల్కొల్పటం ఎంతకష్టమో కూడా వారికి తెలియకపోలేదు. ఐనప్పటికీ, తమ బాధ్యతల్నిమరచి ఉండలేని సేనానులు తిరిగి తిరిగి చేయక తప్పింది కాదు.

''ఆమె హక్కుల సంగతి ఆమె చూసుకోవాలి. న్యాయాన్ని నిలబెట్టేందుకు మనం నడుం కట్టామా? అదిలా ఉంచి, ఆమె వివాహిత. ఆమె యోగక్షేమాలనేవి, ఆమె భర్త టాలమీ చూసుకోవలసి ఉంది. విశేషించి ఆమెకు వివాహమైననాడే ఆమెకున్న హక్కులు కూడ ఆమె భర్తకే చెందినవి. ఇక్కడి చట్టం ఇదీ! దీన్ని మార్పుచేయాలంటే, పాలన మన చేతుల్లోకి రావాలి. అంతవరకూ యీచట్టాలకు తల వంచవలసిందే కాని మరోదారి లేదు!''

''మనం పోరాడి క్లియోపాత్రా హక్కును స్థాపిద్దాం''.

''అందుకు ముందు మన బొందిలో ప్రాణాలుండే మార్గం చూడండి!''

''మీరింత పిరికిపందలా!'' అన్నాడు సీజర్.

''సీజర్! ఈనాడు ఆ మాటెలా అనగలుగుతున్నారు? మా ధైర్య సాహసాలను నిన్నటిదాకా చూస్తూనే ఉన్నారు. పాంపేలాంటి అతి శక్తివంతునితో తలపడి, రోమన్ సామ్రాజ్యాన్ని గెలిచి, తమకు సమర్పించాము. ఈ విశ్వాసాన్ని కానీ, మా శౌర్యాన్ని కానీ తాము శంకించటం మమ్ము అవమానించటమే కాగలదు!''

''సేనానులారా! క్షమించండి.. పొరబడ్డాను!'' అన్నాడు సీజర్.

ఆ మాటలతో అక్కడ లేచిన సుడిగాలులు చాలా తేలిగ్గా అంతరించినవి.

''ఇక కర్తవ్యం ఆలోచించండి సీజర్! నియంతగా మీకు ఎదురుచెప్పేసాహసం మాలో ఎవరికీ లేదు!'' అన్నాడు సర్వసేనాని.

''అవసరమైతే యుద్ధం చేద్దాం. అందుకు తగిన సన్నాహాలు చేసే ఉంచండి. క్లియోపాత్రాను నేను విడనాడలేను. ఆ అందాలరాశి ప్రణయాన్ని నేను తృణీకరించలేను!'' అన్నాడు సీజర్ కుండ పగలగొట్టినట్లు.

''సీజర్! మీరింకా స్వప్నసీమల్లోనే విహరిస్తున్నారు. క్లియోపాత్రా ప్రణయ దేవతని మీరు భ్రమ పడుతున్నారు. కాని, ఆమె మన సర్వనాశనానికే కారకురాలవుతుంది. ఆమె మృత్యుదేవత! ఒక్కొక్కసారి మృత్యుదేవత కూడా కళ్లు మిరుమిట్లు గొలిపే అవతారాలు దాలుస్తూంటుంది. మనమంతా ప్రాణాల్ని కూడా లెక్క చేయకుండా గెలుచుకున్న రోమన్ సామ్రాజ్యాన్ని ఒక స్త్రీ కోసం బలిపెడతారా సీజర్!''

సీజర్ మౌనం వహించాడు. మౌనమే అంగీకారమని ఎవరికి తెలియదు?

''ఆలోచిండి సీజర్! అనేక క్లిష్ట సమస్యల్లో కూడా మీరెంతో చురుకుగా ఉండి, అతి త్వరలో నిర్ణయాన్ని చేసేవారు. కాని ప్రస్తుతం తొందరపడి లాభం ఉండదు. తెలిసి ఉండే ప్రమాదాలలో పడటం అవివేకమౌతుంది! చివరకు విచారించవలసిన దుస్థితి రాకుండా చూడండి!''

''ఆమె నన్నెంత ప్రేమిస్తోందో మీరెవరూ ఊహించలేరు'' అన్నాడు సీజర్.

''సీజర్! మీలోని బలహీనతను ఆమె కనిపెట్టింది. అర్ధశతాబ్ద జీవితాన్ని చూశారు! ఎంతో మంది అందగత్తెల కౌగిళ్లు రుచి చూశారు. ఆమెకి మీకు ఇప్పటికి ప్రణయమంటే, అదెంత మధురతరమైనదనా సరే మొహం మొత్తి ఉండవలసింది! కాని..''మాట పూర్తిగాకముందే నవ్వి సీజర్ అన్నాడు: ''కనుకనే- సేనానులారా! ఈ వయస్సులో కూడా ప్రణయమంటే నన్ను నమ్మించగల స్త్రీ ఎంత గొప్పదో ఆలోచించండి! ఆమె నన్ను మనసారా ప్రేమిస్తుంది!''

- ఇంకాఉంది



రాశిఫలం

- గౌరీభట్ల దివ్యజ్ఞాన సిద్ధాంతి

● **మేషం (అశ్విని, భరణి, కృత్తిక 1పా.)**
మానసికాందోళనతో కాలం గడుస్తుంది. ఆరోగ్యం విషయంలో శ్రద్ధ వహించక తప్పదు. ప్రయత్న కార్యాలు ఆలస్యంగా సఫలమవుతాయి. చెడు పనులకు దూరంగా నుండుట మంచిది. వృత్తి ఉద్యోగ రంగాల్లో అభివృద్ధి వుంటుంది. స్థిరాస్తులకు సంబంధించిన విషయాల్లో జాగ్రత్త అవసరం.

● **వృషభం (కృత్తిక 2, 3, 4పా., రోహిణి, మృగశిర 1, 2పా.)**
నూతన కార్యాలకు చక్కని రూపకల్పన చేస్తారు. ఆకస్మిక ధనలాభముంటుంది. కుటుంబ సౌఖ్యం సంపూర్ణంగా వుంటుంది. బంధు, మిత్రులతో కలిసి విందులు, వినోదాల్లో పాల్గొంటారు. శుభవార్తలు వింటారు. మనోల్లాసాన్ని పొంది ఆనందంగా కాలక్షేపం చేస్తారు.

● **మిథునం (మృగశిర 3, 4 పా., ఆరుద్ర, పునర్వసు 1, 2, 3పా.)**
ఇంతవరకు అనుభవించిన కష్టాలన్నీ క్రమేణా తొలగిపోతాయి. నూతన కార్యలకు శ్రీకారం చుడతారు. కుటుంబ సౌఖ్యం సంపూర్ణంగా వుంటుంది. బంధు, మిత్రులతో కలిసి సరదాగా కాలక్షేపం చేస్తారు. ఆకస్మిక ధనలాభముంటుంది. గొప్ప వ్యక్తిని కలుస్తారు.

● **కర్కాటకం (పునర్వసు 4 పా., పుష్యమి, ఆశ్రేష)**
ఆకస్మిక ధనలాభముంటుంది. నూతన వస్తు, ఆభరణాలు ఖరీదు చేస్తారు. ముఖ్యమైన వ్యక్తులను కలుస్తారు. అన్ని రంగాల్లో అద్భుత విజయాలను సాధిస్తారు. నూతన కార్యాలను ప్రారంభిస్తారు. ఋణవిముక్తి లభిస్తుంది. మానసికానందం పొందుతారు.

● **సింహం (మఖ, పుబ్బ, ఉత్తర 1 పా.)**
వృత్తి, ఉద్యోగ రంగాల్లో కోరుకున్న అభివృద్ధి వుంటుంది. ఆకస్మిక ధనలాభాన్ని పొందుతారు. కుటుంబ సౌఖ్యం సంపూర్ణంగా లభిస్తుంది. గౌరవ మర్యాదలు పెరుగుతాయి. పిల్లలకు సంతోషం కలిగించే కార్యాలు చేస్తారు. శుభకార్య ప్రయత్నాలు సులభంగా నెరవేరతాయి.

● **కన్య (ఉత్తర 2, 3, 4పా., హస్త, చిత్త 1, 2 పా.)**
కుటుంబ విషయాలపై అనాసక్తితో వుంటారు. గృహంలో మార్పులు జరిగే అవకావాలున్నాయి. తలచిన కార్యాలు ఆలస్యంగా నెరవేరతాయి. కొన్ని కార్యాలు విధిగా రేపటికి వాయిదా వేసుకుంటారు. స్త్రీలతో జాగ్రత్తగా నుండుట మంచిది.

● **తుల (చిత్త 3, 4పా., స్వాతి, విశాఖ 1, 2, 3పా.)**
బంధు, మిత్రుల సహాయ సహకారాలు లభిస్తాయి. మానసికాందోళనతో కాలం గడుస్తుంది. ఆకస్మిక ధననష్టమేర్పడే అవకాశముంటుంది. స్థిరమైన నిర్ణయాలు తీసుకోలేకపోతారు. అధికారులతో జాగ్రత్తగా మెలగుట మంచిది. అనవసర భయం ఆవహిస్తుంది.

● **వృశ్చికం (విశాఖ 4 పా., అనూరాధ, జ్యేష్ఠ)**
మానసిక ఆందోళన తొలగుతుంది. ఆరోగ్యం గూర్చి జాగ్రత్త వహించాలి. ఆకస్మిక భయం దూరమవుతుంది. ప్రయాణాల్లో మెలకువ అవసరం. ప్రయత్న కార్యాల్లో ఇబ్బందులెదురవుతాయి. విదేశయాన ప్రయత్నాలు ఆలస్యంగా ఫలిస్తాయి.

● **ధనుస్సు (మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా.)**
విదేశయాన ప్రయత్నాలు అనుకూలిస్తాయి. అనారోగ్య బాధలు అధికమవుతాయి. ఆకస్మిక ధననష్టమేర్పడే అవకాశముంటుంది. బంధు, మిత్రులతో విరోధమేర్పడకుండా జాగ్రత్త వహించుట మంచిది. అనవసర వ్యయ ప్రయాసలుంటాయి. ప్రయాణాలెక్కువ చేస్తారు.

● **మకరం (ఉత్తరాషాఢ 2, 3,4పా., శ్రవణం, ధనిష్ఠ 1, 2పా.)**
స్వల్ప అనారోగ్య బాధలుంటాయి. ప్రయాణాల్లో వ్యయ, ప్రయాసలు తప్పవు. కలహాలకు దూరంగా ఉండుటకు ప్రయత్నించాలి. దూర వ్యక్తుల పరిచయం ఏర్పడుతుంది.

● **కుంభం (ధనిష్ఠ 3, 4పా., శతభిషం, పూర్వాభాద్ర 1,2, 3పా.)**
విందులు, వినోదాలకు దూరంగా నుండుట మంచిది. ఆకస్మిక ధననష్టం కలిగే అవకాశముంది. మానసికాందోళనతో ఉంటారు. కుటుంబంలో మార్పును కోరుకుంటారు. ప్రతి చిన్న విషయంలో ఆటంకాలెదురగును. ఆరోగ్యం గూర్చి ప్రత్యేక శ్రద్ధ అవసరం.

● **మీనం (పూర్వాభాద్ర 4 పా., ఉత్తరాభాద్ర, రేవతి)**
శుభకార్య ప్రయత్నాలు సులభంగా నెరవేర్చుకుంటారు. శుభవార్తలు వింటారు. ఆకస్మిక ధనలాభంల ఆనందంగా ఉంటారు. ప్రయత్న కార్యాలన్నింటిలో సఫలీకృతులవుతారు. కీర్తి, ప్రతిష్ఠలు అధికమవుతాయి. విందులు, వినోదాల్లో పాల్గొంటారు.

మాటాట

నిర్వహణ: సుధామ 2134

■	1		2			■
3	■	■		■	■	4
5	6	■		■	7	
■	8		■	9		■
10		■	11	■	12	13
	■	■		■	■	
■	14					■

అడ్డం ఆధారాలు నిలువు

అడ్డం
1. పాతది
5. పనిమనిషి
7. వీలు
8. ఓ కంట కనిపెడుతూండడం
9. అయ్యప్పస్వామి
10. మత్తులో ఉన్న రోగి స్థితి
12. గొడ్రాలు
14. సరికొత్తది

నిలువు
2. చెలువు
3. ఎల్లపుడూ
4. మ్యాప్
6. ఈ పరిపరిశ్రమకు గ్లామర్ ఎస్స్
7. యథార్థం
10. కుక్కుటం
11. గొప్పదైన
13. వ్యాధి

అడ్డం మాటాట-2133 సమాధానాలు నిలువు

అడ్డం
2. ట్వంటీ ట్వంటీ
5. వలపు
7. లత
8. వంక
9. పసిడి
10. పద
11. ముసి
12. మురవా
13. దినం
14. వీడుకోలు

నిలువు
1. చివరి
3. టీక
4. టీమ్ఇండియా
6. పులక
8. వంద
9. పసివాడు
10. పగిది
11. మురవీ

ప్రవచనాల మధురామృతం

మనిషికి ఇహ పర సాధకాలుగా మార్గదర్శనం చేసే సూక్తులు, నీతులు, వృత్తాంత పూర్వక సందేశాలు, ప్రవర్తన ప్రవచనాలు, కథా వస్తు ధ్వని పూర్వక నిర్దేశాలు, ఆదేశాలు నిండి ఉండే గ్రంథాలను 'గీత'లు అంటారు. ఉదాహరణకు భారతంలోని 'భగవద్గీత', కూర్మ పురాణంలోని 'ఈశ్వరగీత', 'శివ రహస్యం' అనే బృహద్గ్రంథంలోని 'ఋషభగీత' మొదలైనవి. ఈ 'గీతలు' అనేవి మన పురాణ ఇతిహాస వాఙ్మయంలో అసంఖ్యాకంగా ఉన్నాయి. అలాంటి వాటిలో ఒక అయిదింటిని తీసుకొని మా రోజు సూర్యప్రసాదరావు 'గీతా పంచామృతం' అనే పేరుతో ఒక సార సంగ్ర హ గ్రంథం రచించారు ఇటీవల.

బ్రహ్మ పురాణంలో మరీచి మహర్షికి బ్రహ్మ ఉపదేశించిన 'బ్రహ్మగీత', మహాభారత శాంతి పర్వంలోని 'జాజలి తులాధార గీత', అధ్యాత్మ రామాయణంలోని'వసిస్ఠగీత (యోగ వాసిష్ఠం)', భాగవత దశమ స్కంధంలోని వేణు గీత- భ్రమరగీతలతో కూడిన 'గోపీ గీత', అష్టావక్ర- జనక మహారాజుల మధ్య నడచిన సంవాద (సంభాషణ) రూపమైన 'అష్టావక్ర గీత'- ఈ అయిదు గీతలలోని లౌకిక, పారమార్థిక విషయాలను సరళమైన భాషలో సగటు పాఠకుడికి సులభ గ్రాహ్యంగా అందించారు రచయిత ఈ పుస్తకంలో.

42వ పుట (బ్రహ్మగీత)లోని 'ధర్మేతి వతువః పురుషోత్త మానాం..' అనే శ్లోకానికి 'పరలోకానికి పోయినపుడు ధర్మం ఒక్కటే ఆత్మబంధువు అవుతుంది. అర్థ, కామాలను ఎంత

పఠనీయం

గీతా పంచామృతమ్
(ఐదు సంగ్రహ గీతార్థ సారములు)
రచయిత: మారోజు సూర్యప్రసాదరావు, పుటలు:240,
వెల:రూ.100/-,
ప్రతులకు: ఇం.నెం.5-6-18/బి, పాక్బండ బజార్,
పెట్రోలు బంకు వెనుక, ఖమ్మం- 507 001.

జాగ్రత్తగా నియంత్రించుకొని అనుభవించినా వాటి ఫలితాలు స్థిరాలు కావు. అవి ఏలాటి సత్ఫలితాలనూ ఇవ్వవు అంటూ తెలియబరచిన తాత్పర్యం ప్రతి మనిషి దృష్టిలో పెట్టుకొని మనుగడలో అడుగు అడుగు ముందుకు వేయాలి. ఈ జీవన సూత్రాన్ని మానవజాతి మొత్తం త్రికరణ శుద్ధిగా ఆచరిస్తే భువియే దివి అయిపోతుంది. అపుడు ఇక ఎక్కడా ఏ 'దిశ' దారుణంగానీ, ఏ 'నిర్భయ' చట్టం యొక్క అవసరం గాని ఉండదు.

64వ పుట (జాజలి-తులాధారగీ)లోని 'నగములెల్ల పుణ్య నగములు.. ఆత్మతీర్థ మెరుగు అకలుషనకు' అనే పద్యంలో 'ఆత్మ అనే తీర్థం ఒకటుంది. ఆ తీర్థమేమిటో తెలిసినవారికి లోకంలోని కొండలన్నీ పవిత్ర పర్వతాలే; నదులన్నీ పావన జల పరిపూర్ణాలే' అంటూ కనిపించే భావార్థం బహు గంభీర సందేశాత్మకంగా ఉంది. ఈ 'గీత'లోని విశేషాంశం ఏమిటంటే తులాధారుడు అనే ఒక వైశ్య కులపు వడ్డీ వ్యాపారి జాజలి అనే మహా మునికే అద్భుతమైన జ్ఞాన బోధ చేస్తాడు. భారతంలో ధర్మవ్యాధుడు అనే కసాయివాడు కౌశికుడు అనే ఋషీశ్వరుడికే అమోఘమైన తాత్త్విక ధర్మప్రబోధం చేసినట్లు.

బహువిధ వికలాంగుడయ్యుండి కూడా అష్టావక్రుడు రాజర్షియైన జనక మహారాజుతో ధీటుగా చేసిన తాత్త్విక చర్చ అచ్చెరువును కలిగిస్తుంది. ఆ సందర్భంలో ఒక చోట తాతాల్కికములైన పురాణ, ప్రసూతి, శ్మశాన వైరాగ్యాలలో కాకుండా సహజ స్వచ్ఛ తత్త్వ సుందర మానసిక వైరాగ్యాన్ని అలవాటు చేసుకుంటే 'తృష్ణ' అనేది అంతరించి సుఖం కలుగుతుంది అని తెలియజేసిన 'యత్ర యత్ర భవే తృష్ణా..' అనే శ్లోకం (197వ పుట) అష్టావక్ర గీతకే మకుటాయమాన శ్లోకం.

అష్టావక్ర గీతలోనిదే మరో ముఖ్య సూక్తి శ్లోకం 'అచిత్యం చింతమ నోపి..' అనేది (204 పుట).

'చింతించుట అనే భావాన్ని త్యజించినపుడు ఆత్మ సంస్థితి ఏర్పడుతుంది. అహం అంతమై ఆత్మ స్ఫురిస్తుంది. అపుడు జీవాత్మ కృతార్థతను పొందుతుంది' అంటుంది ఆ శ్లోకం. ఇదే పరమార్థం. ఆలోచన, తాత్త్విక తార్కికత ఇటీవలి కాలంలో కొందరు యోగులు, తాత్త్వికులు, ధ్యానపరులు చెప్తున్న 'భావాతీత ధ్యానం' (ట్రాన్సెడెంటల్ మెడిటేషన్)లో ఉండి ఉండవచ్చు.

వస్తుపరంగా ఈ ప్రవచన గ్రంథం ఉదాత్త నైతిక తాత్త్విక అంశాల సంగ్రహమే. కానీ శాబ్దిక దోషాలు కనిపిస్తున్నాయి అక్కడక్కడ. వైశిష్ట్యత, ప్రాముఖ్యత (52వ పుట), స్మశాన (198వ పుట), ప్రారబ్ద అంటూ ఒకే వాక్యంలో మూడుసార్లు మొదలైన శబ్ద అసాధుత్వాలు అసంతృప్తిని కలిగిస్తున్నాయి. వైశిష్ట్యము, ప్రాముఖ్యము, శ్మశానము, ప్రారబ్ధము అని ఉండాలి. 224వ పుటలో 'శాంతశుద్ధి' అన్నారు. 'శాంతిశుద్ధి' అనాలి. 'శాంతి' పూర్వక - దాయిక శుద్ధి అనే అర్థం రావాలి అక్కడ. శాంతమైన శుద్ధి కాదు.చిన్న చిన్న దోషాలను మినహాయిస్తే మొత్తంమీద ఈ గీతా పంచకం మంచి ప్రవచనాల మధురామృతం. అందరూచదివి తెలుసుకోవాల్సిన విషయాలెన్నో ఉన్నాయి.

-శ్రీపతి పండితరాధ్యుల పార్వతీశం

కలసి భజన చేద్దాం రండి

గోపికలను నిద్ర నుంచి మేల్కొనుడు అని చెబుతూ వస్తున్న ఆండాళ్ తల్లికి ఆమె చెలులకు ఓ చోట పరమాద్భుతమైన విషయం తెలిసింది. ఓ ఇంటికి వచ్చేసరికి ఇంటిలోని గోపిక మేల్కొనియే ఉన్నది కాకపోతే బయటకు రాకుండా లోపల నుండే నిద్రలేపుదామని వచ్చినవారికి సమాధానాలు ఇస్తోంది. మీరు ఊరికే గోల చేస్తూ మాట్లాడకండి. నేనేమీ నిద్రపోవడం లేదు. నాకు అంతాతెలుసు అంటూ చిలుకపలుకులు పలికిందా వనిత. దానితో బయటనున్నవారు ఏమమ్మా నీకు ఏమి తెలుసు. గడుసుదానివలె మాట్లాడుతున్నావు. అన్నీ తెలసిన దానివైతే నీవెప్పుడూ ఆ చాణారముష్టికులను చంపిన వారిని నీవు స్తుతించడానికి వెళ్లాలి కదా. ఇంకా ఎందుకు లోపలే ఉన్నావు అని అడిగారు.నన్నే అంటున్నారు కదా సరే ఇదిగో ఇప్పుడేవస్తున్నాను. కువలయమును ఆనాసయసంగా చంపినవానిని సేవించడానికి పరుగుపరుగున వస్తున్నాను. మరి అందరూవచ్చారా అది చూసుకొన్నారా అని అడిగింది. ఇక్కడ చిలుకపలుకులతో పోల్చారంటే అర్థం భగవత్సారూప్యం నందిన ఆచార్యుడు. భగవంతుని ఆరాధిస్తూ అతనికి షోడశోపచారాలు చేస్తున్నపుడు వాకిట మరోరూపంతో భగవంతుడే వచ్చినా అది కూడా అంతరాయంవలె కనిపిస్తుంది అనే తాత్పర్యంతోఈ పాశురం కనబడుతుంది.

భాగవత గోష్ఠిని విడిచి ఒంటరిగా ఉండరాదు. ఏ ఒక్కభక్తుడూ భగవంతుని సేవకు రానట్టుఅయితే వెలితిగానే కనబడుతుంది. ఇళంకిళియే అని చిలుకనుసంబోధించడంలో నమ్మాళ్వారు ఉనక్కెన్నవేరుడయ అంటే నమ్మాళ్వారు సాధించిన శిరియ తిరుమడల్ పెరియ తిరుమడల్ అనే రెండు ప్రబంధాల వైలక్ష్యణమే వీరి వైలక్షణ్యం..


శ్రీమతే శఠకోపాయనమః స్వామి తిరువాయ్‌బొళి ని నాకు సంత చెప్పి నాచే పలికించిరని వీరు చెప్పుకుని యున్నారు.అందుకే వీరు చిలుక. ఆళ్వారులందరిలో వీరే చిన్న వయసు కలవారు. వీరు ఇళంకిలియే కూడా. చిలుక పలుకుల వలె అందంగా తీయగా మాట్లాడు వీరు అమృతానందించే సూక్తులను అందించారు. నంగైమీర్ అనే సంబోధన కూడా వీరికి సరిపోతుంది.

- ఆర్ లక్ష్మణమూర్తి , 7207074899

మార్గళి గీతాలు

తిరుప్పావై మూలానికి తెలుగు

- ఆసూరి మరింగంటి శేషగిరాచార్య
8886976760



1.
పదవ్రేత మేడేరి
పడతులామె నిదురలేప
సంభాషణ బయటినుండె
సలిపినారలివ్విధమున

2.
లేచిలుకా! నీవింకా
లేవకున్నావటే లెమ్ము
చీకాకుగా పిలువకండి
చేరుదు మిము నేవెంటనె

3.
నీ మాటల తీరు తెలుసు
మోమాటము పడకరమ్ము
చెలులంతా వచ్చిరటే
చెప్పరమ్మ సఖియలార!

4.
నీ ప్రత్యేకత ఏమిటి?
నీవె వచ్చి లెక్కించుకొ
నా తప్పును మన్నిండి
జతయయ్యెద మీతో సరి

5.
కువలయాపీడనమను
కుంజరదమనుండు మరియు
శత్రువుల మదమడంచిన
చక్రధరుని సేవింతమ

6.
అనివారలు చెప్పగనే
అతివలంత కూటమిగా,
వేదస్థలి కేగినారు
వేదవేద్యుఁ వ్రతమొనర్ప

ఇంకా ఉంది

ధర్మభూమి

ఒరులేయవి యొనరించిన
నరవర యప్రియము తన మనంబునకగు దా
నొరులకు నవిసేయకునికి
పరాయణము పరమ ధర్మ పథములకెల్లన్

ఆంధ్రభూమి గురువారం, 2 జనవరి 2020 III

విచక్షణతో ఆలోచన సాగాలి

ఆ గందరగోళం పామును మరింత కంగారు పెట్టింది. అది జరజరా వచ్చి గాంధీ కూర్చున్న దుప్పట్లోదూరింది. గాంధీ అందరికీ కంగారు పడొద్దని సైగలు చేసి తనప్రార్థన కొనసాగించాడు. కొద్దిసేపట్లోనే పాము నిశ్శబ్దంగా బయటకు వెళ్లిపోయింది. గాంధీ ప్రవర్తన గురించి ఆయనను ప్రశ్నించినపుడు ''ఒక్క క్షణం నాకూ భయం వేసింది. అయితే వెంటనే సర్దుకున్నాను. పాము నన్ను కరచినా, దాన్ని కొట్టకుండా వదిలేయమనే చెప్పేవాడిని''అన్నాడు.


పురోహితుడు

బ్రహ్మచారి జీవితం, స్వచ్ఛంద పేదరికం గాంధీ స్వీకరించినపుడు మానవతావాద సేవ చేద్దామనుకుంటున్నవారు వివాహం చేసుకోకుండా ఉండాలని చెప్పాడు.

ఆ ఆలోచన ఆయనలో నాటుకొనే ముందు ఆయన తన అవివాహిత స్నేహితులందరికీ వివాహాలు చేయడానికి ప్రయత్నించాడు. అందరూ కలిసి ఒక పెద్ద కుటుంబంలో సభ్యుల్లా ఉండాలని ఆయన భావించాడు. భారతీయ సహచరులను భార్యలతో సహా దక్షిణాఫ్రికాకు రావాలని సూచించేవాడు. తన ఆంగ్లేయ మిత్రులైన వెస్ట్, పోలాక్‌లను త్వరగా పెళ్లి చేసుకోమని వత్తిడి చేశారు. పోలాక్ తనకున్న ఆర్థిక సమస్యల కారణంగా వివాహానికి సంకోచించాడు. మనసులు కలసిన తర్వాత చాలా రోజుల క్రితం కుదుర్చుకున్న సంబంధాన్ని వాయిదా వేయడం మంచిది కాదని గాంధీ అతనికి నచ్చజెప్పాడు. పెళ్లి కూతురు ఇంగ్లాండునుంచి దక్షిణాఫ్రికా వచ్చిన మర్నాడే పోలాక్ ఆమెను పెళ్లాడాడు. గాంధీ పెళ్లి ఏర్పాట్లన్నీ స్వయంగా చేశాడు, తోడుపెళ్లికొడుకుగా వ్యవహరించాడు కూడా.భారతదేశంలో ఆయన ఆశ్రమాలలో గాంధీ కొన్నిసార్లు పురోహితుడిగా వ్యవహరించేవాడు. పెళ్లిచేయడం, పురోహితుడిగా వ్యవహరించడంలో ఆయన పద్ధతి సంప్రదాయబద్ధంగా ఉండేది కాదు. భారతీయ వివాహ పద్ధతిని సంస్కరించాలని గాంధీ ప్రయత్నించాడు. చాలా సంప్రదాయాలను తిరస్కరించాడు. వరకట్నం, ఆస్తిపాస్తులు, విద్యార్హతలు, ఉన్నత వంశం ఇవన్నీ ఒక పెళ్లి కుమార్తెను లేదా పెళ్లికుమారుడిని మెరుగైన అభ్యర్థిగా చేసే అర్హతలు కావని ఆయన భావించేవాడు. ఆరోగ్యం, వ్యక్తిత్వం, శారీరక శ్రమ చేయడానికి తగిన ధృడత్వం- ఇవీ అవసరమైన అర్హతలు. ఆయన చేసిన ఒక పెళ్లిలో వధూవరులు ఇద్దరూ ఖాదీ వస్త్రాలు ధరించారు. అగ్నిహోత్రం ముందు ఇద్దరూ ఖద్దరు నూలు దండలు మార్చుకున్నారు. అవి తప్ప వారు మరే ఆభరణలా ధరించలేదు. వాళ్లు వేదమంత్రాలు పఠించారు. వరుడికి కట్నం కానీ, ఇతర ఖరీదైన బహుమతులేవీ ఇవ్వలేదు.


వరకట్న దురాచారాన్ని గాంధీ ఖండించాడు. మహిళలను బానిసలుగా భావిస్తున్నందుకు కళాశాల విద్యార్థులను తీవ్రంగా విమర్శించాడు. భార్యలను గృహాలకు, హృదయాలకు మహారాణులుగా చేయకుండా అమ్మకానికీ, కొనుగోళ్లకూ అనుకూలమైన చరాస్తులుగా మార్చేశారు. భార్యలను 'అర్థాంగి' అంటారు, అంటే శరీరంలో సగభాగం అని అర్థం కదా! ''నాకే ఒక అమ్మాయి ఉంటే కట్నం అడిగేవాడికి ఇచ్చే బదులు ఆమెను జీవితాంతం అవివాహితగానే ఉంచేస్తాను'' అనేవాడాయన.

పెళ్లివిందుల్లో ఆడంబరమైన, ఖరీదైన ఏర్పాట్లు ఆయనకు ఇష్టం ఉండేవి కావు. ఈ ప్రజాస్వామ్యపు రోజుల్లో మతపరమైన కార్యక్రమాలకు పది రూపాయల కన్నా ఎక్కువ ఖర్చుపెట్టకూడదని ఆయన విశ్వాసం. మతపరమైన ప్రక్రియలు తప్ప మరేవీ వివాహంలో తప్పనిసరి కాదని ఆయన భావన. కానీ మన దేశంలో అత్యంత పేదలు కూడా గాంధీ భావనలోని ఉన్నత స్థాయిని అమలుచేసేందుకు ఇష్టపడరు. పెళ్లిళ్లకూ, శ్రద్ధాకర్మలకూ ఖర్చుచేసి అప్పుల పాలవుతున్న రైతులతో ''నన్ను మీ పురోహితుడిగా పెట్టుకోండి. మీ ఇంట్లో కార్యక్రమానికి ఎంత తక్కువ ఖర్చవుతుందో చూడండి'' అనేవాడు. శ్రాద్ధకర్మను అందరూ చూస్తున్నట్లుగా ఆయన చూచేవాడు కాదు.



బహురూపి గాంధీ
రచయిత : అనుబందోపాధ్యాయ
తెలుగు సేత: నండూరి వెంకట సుబ్బారావు
(2014లో అనువదించారు)
ప్రతులకు - మంచి పుస్తకం
12-13-439, వీధినెం.1. తార్నాక,
సికింద్రాబాద్-17.. 94907 46614

శ్రీ సాయి గీత



గోపికా ప్రేమ

ఒకరోజు ఒక గోపిక మందనుండి ఎందుకో తన యింటికి మధ్యలో అనుకోకుండా వచ్చింది. సరిగ్గా అప్పుడే చిన్ని కృష్ణుడు ఆ గోపిక యింట్లో దూరి పెరుగు కుండలో చేయి పెట్టబోతున్నాడు. గోపికను చూస్తూనే కంగారు నటిస్తూ కన్నయ్య బయటికి ఉరికాడు. గోపిక కూడా కన్నయ్యను పట్టుకొనేందుకు పరుగుపెట్టింది. తీరా గడప దాటేసరికి ఆమెకు తన పెరుగుకుండ సంగతి జ్ఞాపకమే లేదు. మండుటెండలో ఉత్త కాళ్లతో పరుగెడుతున్న కన్నయ్య లేత పాదాలు కందిపోతాయన్న బాధతో ఆమె చలించిపోయింది. కృష్ణుడిని తొందరగా పట్టుకొని కాళ్ళు కాలకుండా చంకవేసుకోవాలన్న తొందరే కాని ఆమెకు ఇంకేమీ గుర్తుకు రాలేదు. తన పెరుగుకుండ సంగతి అలావుంచి ఎండలో తన కాళ్లు కాలుతున్న సంగతిని కూడా ఎరక్కుండా ఆమె తొందరగా పరుగెత్తింది. అదీ ప్రేమ తత్వం.

అమలిన ప్రేమ

యశోద ఒకసారి కృష్ణునికోసం వెదుకుతూ వుంది. రాధను పిలిచి 'కృష్ణుడు మీ యింటికి గాని వచ్చాడా?' అనడిగింది. రాధ కాసేపు కన్నులుమూసికొని కృష్ణుని ధ్యానంచేస్తూ 'కృష్ణా!'అని పిలిచేసరికి తక్షణమే కృష్ణుడక్కడ ప్రత్యక్షమయ్యాడు. రాధ పవిత్రప్రేమ ప్రభావాన్ని చూసి యశోద చకిత అయింది. ఆమె కన్నులవెంట నీరు ధారలు కట్టింది.

''నేను కన్నయ్య తల్లిని, నా అంతగా కృష్ణుని ప్రేమించే వారెవరుంటారు'- అని నాక్కొంచెం గర్వంగా ఉండేది. కంటికి రెప్పలా కన్నయ్యను కాచుకుంటున్నాననుకునే దాన్ని. ఈరోజు నా కళ్లు తెరిపించాడు. నీ ప్రేమ ఎంతటి పవిత్రమైనదో చూపించాడు. నీ చిన్ని కృష్ణుడు అహం అంటని అమలిన ప్రేమ నీది''-అని యశోద రాధతో చెప్పింది.

అల్లరి కన్నయ్య

నీ హృదయ కుహరాలలో కృష్ణుడు దాగొనియున్నాడు. ఆయనను వెతికి పట్టుకో. దొరక్కుండా తప్పించుకొనిపోతాడు జాగ్రత్త. అయినా ఆ అల్లరి కన్నయ్య ఎటువెళ్ళిందీ వొలికిన పాలపై పడిన ఆయన పాదముద్రలు చెప్పేస్తాయిలే. ఆయన పాదాల గుర్తులను నీవు గుర్తుపట్టటం తెలుసుకో. సౌందర్యం, సచ్ఛీలం, కరుణ, ప్రేమ, కృతజ్ఞత ఎక్కడ వున్నా, అక్కడంతా ఆయన తిరుగాడుతున్నట్లు ఆయన పాదాల గుర్తులు కనిపిస్తాయి. అక్కడాయిక్కడా వెతకటం ఎందుకు? నీ గుండెనిండా ప్రేమ నింపుకో. నీ హృదయంలోనే ఆయన నీకు దొరికిపోతాడు.

తాళంచెవి

పంచ పాండవులు ఆదర్శప్రాయులు. ధర్మరాజు మాట జవదాటకుండా ఆయన సోదరులు ధర్మపథంలో ఆయనను అనుసరించారు. ధర్మమునకు అనుగుణంగా రాముడు రాజీ ఎరగని రీతిలో నడిచాడు. మానవులూ, జంతువులూ, పక్షులూ, రాక్షసులని లేకుండా అందరి పట్లా రాముడు ప్రేమనే ప్రదర్శించాడు. ఏ ప్రలోభానికీ లొంగని స్థిరచిత్తం ఆయనది. అహంకారం, లోభం కలిసి మూసివేసిన తలుపులను తెరిచే తాళంచెవి ప్రేమ ఆయన సొత్తు.

దైవబలం



అన్ని బలములుండి కూడా ఒక్క దైవబలం లేకపోవటం వలన కర్ణుడంతటివాడు చిట్టచివరికి ఏమైనాడు? అన్ని బలములకన్నా దైవబలమే మిన్నయని కర్ణుని విషయంలో కూడా ఋజువైంది. కనుక దైవబలమే నిజమైన బలము. అదే సరియైన బలము. ఆ బలము లేకుండా, ఎన్ని బలములున్నా అన్నీ దుర్బలములే. రావణాసురుడికి ఎన్ని బలములు ఉన్నాయి? కట్టకడపటికి ఏమైనాడు? దైవబలమును పెంచుకోకుండా, భౌతిక బలమును పెంచుకుంటూ వచ్చాడు. అందువలననే కట్టకడపటికి నాశనమైపోయినాడు. కౌరవులు నూర్గురైనా దైవబలం లేకపోవటంవలన నశించిపోయారు. పాండవులకు దైవబలం ఉండటంవలన విజయలక్ష్మిని చేబట్టగలిగారు. అంతేకాదు. ఐకమత్యమే మహాబలమనే విషయాన్ని విస్మరించరాదు. ఈ ఐకమత్యానికి దైవమొక్కడే మూల కారణం. ఇక్కడ ఈ ప్రశాంతి నిలయంలో ఎన్నో దేశములవారు, ఎన్నో మతాలవారు, భాషలవారు, ఎన్నో భావములవారున్నారు. వారివారి పద్ధతులలో, సంస్కృతులలో, ఆహార వ్యవహారాలలో, అలవాట్లలో ఎన్ని తేడాలున్నా వారంతా అన్యోన్యంగా మెలగటం లేదా? వారిని ఎవరుమార్చారు? వారే మారారు. ఒక్క స్వామిని గురించే వారంతా ఏకమైనారు. అందుకు స్వామిపై వారికున్నటువంటి ప్రేమే కారణం. కనుక దైవభావాన్ని మనం పెంచుకోవాలి. దైవ ప్రేమ లోపల మీ జీవితాలను ముంచి పెట్టండి. ఈ ప్రేమను మరొక దానికి ఉపయోగపెట్టకండి.

పాండిత్యం

ప్రేమను పెంపొందించుకొనటంలో తాననీ, పరులనీ చూడని ప్రేమతత్వాన్ని బోధపరచుకో. అందరం ఆ ప్రేమ మయుని అంగాలమే. ప్రేమ ద్వారానే ఆ ప్రేమ సాగరుని చేరుకోగలవు. దీనికి పాండిత్యం అక్కరలేదు. పాండిత్యం ఒక రకంగా అవరోధం కూడా. తాను పండితుడననే అహంకారం; వివిధ శాస్త్రాలలోని సంగతులపై సంశయాలు; వాదించి తన సిద్ధాంతాన్ని స్థాపించాలన్న అభిలాష -యివన్నీ పాండిత్యం వెంట వుంటాయి.

శ్రీ సాయి గీత - భగవాన్ శ్రీ సత్యసాయి సందేశ సారాంశ సుమమాల
- కూర్పు, సమర్పణ : శ్రీ వేద భారతి , హైదరాబాద్ , వెల:రూ. 100/-లు.

ఇంకా ఉంది

భక్తునికి ఆపద.. శివయ్య ఆగ్రహం



చరవాణి: 9490620512

అప్పుడా గుడిలోని ఈశ్వరుడు దయతో ఆ పాండ్యరాజ్యాన్ని పరిపాలించే రాజుమీద అరవభాషలో శృంగార రసబద్ధంగా ఒక పద్యాన్ని వ్రాసి యిచ్చి శివబ్రాహ్మణునితో 'దీనిని రాజసభలో చదువు. రాజుమెచ్చి నీకు వేయి మాడలిస్తాడు. దానితో నీకు దినవెచ్చం (దినవ్యయం) లభించి సుఖంగా ఉండగలవు. కొంత కాలానికి కఱవు తొలగిపోతుంది. జనులందరికి హర్షం కలిగే విధంగా వర్షాలు పడతాయి. పంటలు పండుతాయి. ప్రజలకు సంతోషం కలుగుతుంది'. అని చెప్పి రాజసభకు పంపాడు. ఆ బ్రాహ్మణుడు రాజసమ్ముఖానికి పోయి పరమేశ్వరునిచే వ్రాయబడిన కవితను చదివి అందలి చమత్కారాన్ని వివరించాడు. ఆ కవితలో 'గజరాజ గమనయైన పార్వతీదేవి కేశపాశం సహజసిద్ధంగా సుగంధభరితం' అనే భావం ఇమిడియుంది. దానిని విని ఆ రాజసభలో గల నత్కీరుడనే కవి ఎగతాళి చేస్తూ 'స్త్రీలకేశపాశం సహజ సుగంధ భరితమంటె అందరు నవ్వుతారు. ఇది తప్పు. ఈ రీతిగా కవిత చెప్పరాదు. కవితా నియమాలకిది విరుద్ధం. నీవీవిధంగా వ్రాయడం సరియైనదా?' అని పలికాడు. ఆ మాటల్ని విని ఆ శివబ్రాహ్మణుడు చిన్నబుచ్చుకొని 'ఉత్తములారా! దీనిని నాకు ఆ పరమేశ్వరుడే వ్రాసి యిచ్చాడు. ఇందలి తప్పు-ఒప్పులు నాకు తెలియవు' అని పలికాడు.

శివబ్రాహ్మణుని ఓదార్చి
శివుడే నత్కీరకవితో వాదానికి పోవుట

తదుపరి నేరుగా ఆ శివబ్రాహ్మణుడు ముక్కంటి వద్దకు వచ్చి ఆయన పద్యాన్ని తిరిగి ఆయనకే సమర్పించి 'దేవా! నీ మాటల్ని నమ్మి సభకు పోయి అవమానపడి తిరిగివచ్చాను. సర్వజ్ఞత్వం (అన్నీ తెలియడం) బహుముఖకార్య నిర్వహణశక్తి అనే గొప్పగుణాలు కలవాడవని నిన్ను నమ్మి నేను సభలో పౌరుషాభిమానాల్ని పోగొట్టుకొని వచ్చాను. ఎవ్వడైనా తానెరిగిన విద్యనే రాజసభలలో ప్రదర్శించాలి. అప్పుడే గౌరవం దక్కుతుంది. అలాకాక పరవిద్యాధీనుడై ఉంటే రాజసభలలో అవమానమే కలుగుతుంది. ఇక చెప్పేందుకు ఏముంది? నా అదృష్టము ఈవిధంగా ఉంది. నిన్ను - నత్కీరుని నిందించుట ఏమి న్యాయం? నీ దయ ఇక చాలు. ఈ కరువుచే నేనిట్లయ్యాను. ఎక్కడకయినా పోయి బిచ్చమెత్తుకొని కరువుపోయిన తర్వాత వస్తా ను. దేవా! నీకు భద్రమగు గాక. ఇక నేను వెళ్లడానికి అను మతించు. అని ప్రార్థించాడు.

శివబ్రాహ్మణుడి మాటలు విని చంద్రశేఖరుడు కారుణ్యామూర్తియై 'కటకట! ఆ నత్కీరుడు నిన్నా విధంగా తూలనాడాడా? నేను వ్రాసిన కవితలో తప్పు పట్టాడా? అదేమిటో తెలుసుకొంటాను. నావెంట రాజసభకు రా' అని పలికి తిన్నగా రాజసభకు వచ్చి 'ఈ రాజన్యుని మీద నేను సాహిత్య స్ఫూర్తితో మధురమైన కవిత చెప్పి పంపగా నత్కీరుడు అసూయతో అందు తప్పుపట్టాడట. ఆ తప్పు లక్షణంలోనా? అలంకారంలోనా? పదబంధంలోనా? లేక రసంలోనా? ఇప్పుడు చక్కగా చెప్పండి' అన్నాడు.

ఈశ్వరుడా రీతిగా పలుకగానే ఆ నత్కీరుడు ముందు తప్పన్న రీతిగా మరల తప్పని అన్నాడు. దానికి శివుడు హిమగిరి కన్యకామణి పార్వతి కేశపాశం సహజ సుగంధవంతమైనదని సమర్థించాడు. ఈశ్వరుని సమర్థన విని నత్కీరుడు 'పార్వతి ధమిల్లం (కేశపాశం) అట్లే సుగంధభరితం కావచ్చుగాక. లోకంలోని స్త్రీల కది అసహజం. ఇక నీ హఠాన్ని మానుకో. ఆకాశంలో పుష్పముంది లాంటి నిరాధారమైన వాదాలు లోకంలోని ప్రత్యక్షవాదంతో సరితూగగలవా? కపటమైన-బుకాయింపు అయిన మాటలిక చాలు.' అని ఎదురు పలికాడు. అప్పుడు నత్కీరుని దేవీధిక్కారగర్వాన్ని అణచేందుకు తన నిజస్వరూపాన్ని చూపదలచి ముక్కంటి తన త్రినేత్రాన్ని చూపాడు. అయినా నత్కీరుడు వెనుతిరుగక 'నీవు తలచుట్టు నేత్రాలు కలిగినవాడవయినా ఈ పద్యం తప్పుకాదనవశమా? ఇక్కడ నీ మాయావిలాసాలు చాలుచాలు' అని ధిక్కారస్వరంతో బదులు పలికాడు. అప్పుడు నీలకంధరుడు నత్కీరుని ప్రతి వచనాలకు కోపించి 'నీవు కుష్ఠవ్యాధి పీడితుడవు కమ్ము' అని శపించాడు. అంతట నత్కీరుడు పశ్చాత్తప్తుడై అపరిమితమైన భయాన్ని పొంది 'స్వామీ! నీ యెడల అపరాధం చేసాను. క్షమించి నాకు శాపవిమోచనోపాయాన్ని తెలుపవే' అని ఆ కృపాధాముని పాదపద్మాలమీద పడ్డాడు. అప్పుడా భక్తజనమందారుడు శాంతి వహించి కైలాసాన్ని దర్శిస్తే ఈ వ్యాధి తొలగి పోగలదు అని శాపవిమోచనాన్ని అనుగ్రహించి అంతర్ధానమయ్యాడు.



పిమ్మట జరిగిన దానికి చింతిస్తూ నత్కీరుడిలా దుఃఖించాడు. 'వ్యర్థంగా ఈ కవితాభిమానాన్ని నేనేల వహించాను? శంఖపీఠిపై కవులందరు మిన్నకుండినట్లుగా నేనునూ ఉండక దేవునితో ఎందుకు వాదులాటకు దిగాను? మహాభయంకరమైన ఈ కృష్ఠవ్యాధి బాధను ఎలా భరించ గలను? వెండికొండ నిక ఎప్పుడు చూడగలను? ఎన్నెన్నో మహానదులు-పర్వతాలు- బోయపల్లెలు- మృగాలు - నిర్జన మార్గాలు దాటి ఏ విధంగా మహాకైలాస దర్శనం చేయగలను? సదాశివా! ఈ ఆపద నేనూహించింది కాదు. ఏమి చేస్తాను? కరుణాసాగరా! భక్తవత్సల! శివా! గౌరీశ! సింహాలు - పులులు - మదగజాలు - ఖడ్గమృగాల సంచారం చేత భయంకరమైనవి, మహారాక్షస విహారం చేత భీతిదాయకమైనవి, అత్యధిక హిమపాతం చేత దుర్గమమైనవి (ప్రవేశింపరానివి) గ్రుచ్చుకొని బాధించే రాళ్లమయమైన మార్గాల్ని దాటడం నాకు శక్యమా?

- ఇంకావుంది...

సత్యం శివం సుందరం

సృ స్థి ల (సృష్టి స్థితి లయ) 2 వ భాగం

- సాంధ్య శ్రీ 8106897404

జీవిత పర్వతారోహణలో స్మృతుల
బలీయత శిఖరాన్నే చూస్తుంది
పాటకు ఱెక్కలు వస్తేనే గంగను ఎగరేసుకుపోతుంది పక్షి
ఎవరి కవితకు ఋతువు ప్రతిస్పందిస్తుందో- ఆ
చేతన 'అంతరగాంధారా'మై
'కడలి గడప మీద గొంతు జండా' నెగరేస్తుంది..
ఏటా ఈ ఋతువొస్తుంది; దీనంగా వంగిన కొమ్మమీద
పూలదీపం వెలిగిస్తుంది, గాలికి తూలి గంద వొడిని
ఒలకబోసుకుంటుంది.
పక్షిగొంతు తీయదనాన్ని పాట చేసుకొని
పరిసర శ్యామావిష్కృత వక్షంమీద
పరిమళపు పచ్చబొట్టును పొడుస్తుంది
ఎవరు పిలిచారు ఈ కందువ 'కొమ్మ'ని
దిసమొలకు కిసలయాన్ని వసనంగా కడుతుంది
పొద్దుకు
ఈ పొలతుక పూలకల కనడానికి రంగుల వలని విసురుతుంది
గాలి వేస్తున్న మబ్బుల చిత్రాని గగనాన్నందించి
కిరణాల కుంచెతో తరుణాన్ని పూస్తుంది
రెమ్మలు చివుళ్ళు మొగ్గలు పువ్వులు తావులు- వీటితో
ఉదయ మారుతంలో ఊగుతున్న శాఖ
నా కంటికి చెంగలి సొబగు నందిస్తుంది
ఒక కొత్త ఆకాశం ఒక కొత్త తరం మీద
తేనె పుప్పొడిని రాలుస్తున్న సూర్య
సుమాన్ని విరిసింది...

ఇంకాఉంది

ఆత్మనిత్యనిర్మలం

ఆత్మ నిర్వికారి, నిష్క్రియి. ఏపనీ చేయదు: శరీరంలో నున్న ఏ ఇంద్రియాన్ని ప్రేరేపించదు. శరీరధారుడి కోరికలు తీర్చే అనే కర్తవ్యాన్ని జ్ఞానేంద్రియములు, కర్మేంద్రియములు నిర్వహించును. బుద్ధి నిర్ణయించిన ప్రకారము వాటి వాటి కార్యనిర్వహణకొరకు ఇంద్రియములకు తగు శక్తినిచ్చి, కేవలం సాక్షిగా పరీక్షించే ఆత్మ, కర్తాకాదు, భోక్తాకాదు.

132. అహంకారాది దేహాన్తా విషయాశ్చ సుఖదాయః।
వేద్యన్తే ఘటవద్యేన నిత్యబోధ స్వరూపిణా॥

ప్రకాశవంతమైనపుడు, ఘటాదులు ఏ రూపములో ఉన్ననూ వాటి ఉనికి, రూపాది విశేషములు స్పష్టమౌతున్నవి. అదే విధంగా స్వతఃసిద్ధముగా జ్ఞాన స్వరూపమైన ఆత్మద్వారా, దేహములో ఇమిడి ఉన్న అహంకారము ఇత్యాదులతోసహా పంచకోశముల పర్యంతము జడములైనా, సమస్తము ప్రకాశవంతమై, సుఖాదుల యొక్క అనుభూతి శరీర ధారునకు నిరాటంకముగా అవగతమౌతున్నది.

దృక్-దృశ్యము భిన్న ధర్మములు కలవి. ఆత్మ, దృక్ చేతనత్వమున్నది, స్వయంజ్యోతిస్స్వరూపము మరియు నిత్యత్వము కలది. ఆత్మనిత్యనిర్మలము, పరిశుద్ధమైనది. కాని, మలిన పదార్థములైన రుధిర, మాంసాదులతో ఉపాధి వశాత్తు శరీరంలో సహజీవనము చేస్తున్నా, శరీర గుణములతో ఎన్నడూ ప్రభావితము కాదు.

133. ఏషో న్తరాత్మా పురుషః పురాణో
నిరన్త రాఖణ్డసుఖానుభూతి?।
సరైన రూపః ప్రతిబోధమాత్రో
యేనేషితా వాగసవ శ్చరన్తి॥

వికార రహితము, వృద్ధిక్షయములు పొందక నిత్యమూ ఏకరూపములో ఉండే అంతరాత్మ హృదయస్థానములో స్థిరముగా శరీరములో ఉంటున్నది. దాని సాన్నిధ్యముచేత ప్రభావితమై వాక్కు, ప్రాణకార్యము, సకల మనోవ్యాపారము నిరంతరము జరుగుతున్నవి.

133. ఏషో న్తరాత్మా పురుషః పురాణో
నిరన్త రాఖణ్డసుఖానుభూతి?।
సరైన రూపః ప్రతిబోధమాత్రో
యేనేషితా వాగసవ శ్చరన్తి॥

వికార రహితము, వృద్ధిక్షయములు పొందక నిత్యమూ ఏకరూపములో ఉండే అంతరాత్మ హృదయస్థానములో



జగద్గురు శ్రీశంకరాచార్య విరచిత
వివేక చూడామణి
ప్రతిపదార్థ తాత్పర్య వ్యాఖ్యాన సహితము
వ్యాఖ్యాత
ఆచార్య శ్యామశాస్త్రి

స్థిరముగా శరీరములో ఉంటున్నది. దాని సాన్నిధ్యముచేత ప్రభావితమై వాక్కు, ప్రాణనకార్యము, సకల మనోవ్యాపారము నిరంతరము జరుగుతున్నవి. అందువలన, సనాతనము, ఆద్యంతములు లేని పరమాత్మ అంశమైన అంతరాత్మ, అఖండానందమును నిత్యమూ అనుభవిస్తూ ఈ శరీరములోనే శయనిస్తున్నది (పురి శరీరే శేత ఇతి పురుషః అని నిర్వచనము).వయసుతోపాటు శరీరములో వచ్చే మార్పులేవీ ఆత్మను ప్రభావితము చేయవు. ఆత్మ సూక్ష్మాతిసూక్ష్మమైనది. దాని అవలోకనము సూక్ష్మబుద్ధిగలవారికే జ్ఞాననేత్ర ఉన్మీలనతో సాధ్యమని శ్రుతి స్పష్టము చేస్తున్నది (క.ఉ.1-3-12).

134.

అత్రైవ సత్త్వాత్మని ధీగుహాయా
మవ్యాకృతాకాశ ఉరుప్రకాశః।
ఆకాశ ఉచ్చై రవివత్ప్రకాశతే
స్వతేజసా విశ్వమిదం ప్రకాశయన్॥

స్థూల సూక్ష్మకారణ శరీరములు మూడింటిని అధిష్ఠించి హృదయాంతరాళములో ఆత్మ ఉన్నది. పైన ఆకాశములోనున్న సూర్యుడు నలుదిశలా వ్యాపించి, యావత్ప్రపంచమును ఎట్లు ప్రకాశవంతము చేయుచున్నాడో, అదే విధంగా స్వయంజ్యోతిః స్వరూపమైన ఆత్మ, మాయను సహితము అధిగమించి సర్వత్ర శరీరములో ప్రకాశిస్తున్నది. సూర్యచంద్రాదులు పరబ్రహ్మ కారణంగా తేజోమయమై ప్రకాశిస్తున్నవి. అందువలన, పరమాత్మను ''పరంజ్యోతి''అని ఛాందోగ్యశ్రుతి (ఛా.ఉ.8-12-3) మరియు ''జ్యోతిషాం జ్యోతిః''అని బృహదారణ్యక శ్రుతి నిర్దేశిస్తున్నవి (బృ.ఉ.4-4-16). భారూపమైన ప్రత్యగాత్మ మనోబుద్ధులను, అవ్యక్తరూపమైన మాయను అధిగమించి, త్రివిధ శరీరములను ప్రకాశవంతము చేస్తున్నది.

135. జ్ఞాతా మనో హంకృతి విక్రియాణాం
దేహేన్ద్రియ ప్రాణకృత క్రియాణామ్।
అయో గ్నివత్తాననువర్తమానో
న చేష్టతే నో వికరోతి కించన॥

దేహాతీతమైన ఆత్మ, దేహభాగములైన మనస్సు, బుద్ధి అహంకారాదుల వికారములను, బాహ్యేంద్రియములు ఇతర శరీర అంగములు, పంచ ప్రాణముల యొక్క క్రియలను వెన్వెంటనే జ్ఞాతగా తెలిసికొంటున్నది. ఇనుప వస్తువు కొలిమిలో కాలి, కార్యరూపంలో నానాప్రకారముల పరివర్తన చెందుతున్నది. భారూపమైన జీవాత్మ, సమస్త దేహభాగములను ప్రకాశవంతము చేస్తున్నది, కాని ఇంద్రియములను అనుసరించి ఏ పరిణామమును తాను పొందదు. దేహసంబంధ క్రియలకు ప్రత్యగాత్మ కర్తకాదు. ఆత్మ వికార రహితము, దేహములో ఏ వికారములను తాను సృష్టించదు. కామము, కోపము ఇత్యాది వికారములు ఆత్మ జనితములు కావని శ్రుతి ''కామఃకర్తా నాహం కర్తాకామః కారయితా నాహం కారయితా'', ''మన్యుకర్తా నాహం కర్తా మన్యుః కారయితా నాహం కారయితా''అని సూచిస్తున్నది (మ.ఉ.అను.62).

136. న జాయతే నో మ్రియతే న వర్ధతే
న క్షీయతే నో వికరోతి నిత్యః।
విలీయమానే పి వపుష్యముష్మిన్
న లీయతే కుంభ ఇవాంబరం స్వయమ్॥

ఆత్మ నిత్యమైనది. దానికి పుట్టుక మరణము అనే ధర్మములు లేవు. అది వృద్ధి చెందదు, క్షీణించదు. వికారములేవియు కలిగించదు. శూన్యకుంభము నశించగా అందు వ్యాప్తిచెందిన ఆకాశము, మహాకాశములో కలిసిపోయినట్లు, శరీర పతనముతో ఆత్మ నశించక పరమాత్మలో ఏకమగును.'అస్తి, జాయతే, విపరిణమతే, వర్ధతే, అపక్షీయతే, నశ్యతి' (పుట్టుక, ఉనికి, పెరుగుట, పరిణామము చెందుట, తరుగుట, నాశనమగుట) అనే ఆరు, శరీర ధర్మములు. ఆత్మ సద్రూపము.

- ఇంకావుంది...

ఆంధ్రభూమి
చిత్రభూమి
జీవితమొక నటనయనే
వివేకమును ప్రోదిజేసి విందుగ పరచే
నవరసముల సినిమాయై
అవిరళముగ ముదమునిచ్చుటద్భుతమేగా!
గురువారం 2, జనవరి 2020 IV



ఫస్ట్ షెడ్యూల్ ముగించాడు

చౌణక్య నిరాశపర్చినా -గ్యాప్ తీసుకోకుండా గోపీచంద్ సినిమా మొదలెట్టడం తెలిసిందే. ఈసారి హిట్టుకోసం గోపీచంద్ తనకు సూటయ్యే కమర్షియల్ యాక్షన్ ప్లాట్‌తో సినిమాకు రెడీ అయ్యాడు. దర్శకుడు సంపత్ నంది తెరకెక్కిస్తోన్న ఈ సినిమా మొదటి షెడ్యూల్ పూర్తి చేసుకుంది. శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ బ్యానర్‌పై భారీ బడ్జెట్, టెక్నికల్ వాల్యూస్‌తో ఈ ప్రాజెక్టును చిట్టూరి శ్రీనివాస్ నిర్మిస్తున్నారు. ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతోన్న చిత్రంలో గోపీచంద్‌తో తమన్నా, దిగంగన స్యూరవంశీ రొమాన్ చేయనున్నారు. భూమిక, రావ్ రమేష్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. హైదరాబాద్‌లోని అజీజ్ నగర్‌లో వేసిన భారీ సెట్లో కొద్దిరోజులుగా కీలక సన్నివేశాలు చిత్రీకరించిన చిత్రబృందం -రెండో షెడ్యూల్‌ను గ్యాప్ లేకుండా మొదలుపెట్టేందుకు ప్లాన్ సిద్ధం చేస్తున్నట్టు సమాచారం. మణిశర్మ సంగీతం, సౌందర రాజన్ సినిమాటోగ్రఫీ సమకూరుస్తున్న చిత్రం -సమ్మర్ వెకేషన్స్‌లో ఆడియన్స్ ముందుకు వచ్చే అవకాశముంది.

అంతేగా.. అంతేగా..



ఒక ఒరలో రెండు కత్తులు ఇమడ్చటం ప్రమాదం. ఇద్దరు అగ్రహీరోల సినిమాలు ఒకే రోజు విడుదలైతే మహా ప్రమాదం. ఇది చరిత్రలో అనేకసార్లు చవిచూసిన సత్యం. గతంలోనూ పోటాపోటీగా విడుదలైన పెద్ద చిత్రాల్లో.. ఏదో ఒక చిత్రం సోదిలో లేకుండా పోయిన అనుభవాలు ఇండస్ట్రీలో లేకపోలేదు. ఇపుడు మళ్లీ అదే సీన్ రిపీటవుతుందా? అన్న సందేహాలు ముసురుతున్నాయి. సంక్రాంతికి బరిలో అగ్రహీరోల సినిమాలెప్పుడూ ఆసక్తికరమే. ప్రేక్షకులు, అభిమానులు ఆ సినిమాల కోసం ఎదురుచూస్తుంటారు. దానికితోడు ఫ్యాన్స్ తమ హీరో సినిమా కోసం ఒకింత ఎక్కువ ఆసక్తి చూపిస్తుంటారు. ఇదెప్పటికీ ప్రమాదకరమే కనుక -చాలాకాలంగా పెద్ద సినిమాలు ఒకే రోజు థియేటర్లకు వచ్చే సంప్రదాయాన్ని క్రమంగా పక్కన పెడుతూ వస్తున్నారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని -ఈతరం హీరోలు అనవసరమైన ప్రతిష్టకు పోకుండా అడ్జెస్ట్‌మెంట్‌కు ముందుకొస్తున్నారు. కానీ, ఈ సంక్రాంతికి మాత్రం మరోసారి పెద్ద చిత్రాలు రెండూ ఒకేరోజు థియేటర్లకు రానున్నాయా అన్న సందేహాలు ముసురుతున్నాయి. అయితే ఆ రెండు చిత్రాల సినిమా బృందాలుకాని, హీరోలు కానీ దీనిపై మౌనం వహిస్తున్నా, కథనాలు మాత్రం నిజాలుగా ప్రచారమైపోతున్నాయి. జనవరి 11న మహేష్‌బాబు నటించిన సరిలేరు నీకెవ్వరు, జనవరి 12న అల్లు అర్జున్ హీరోగా నటించిన అల వైకుంఠపురములో విడుదలకు సిద్ధమయ్యాయి. అయితే మొదట ఈ రెండు చిత్రాలు జనవరి 12నే విడుదల ముహూర్తాలు ఫిక్స్ చేసుకోవడం తెలిసిందే. అలాంటి వాతావరణం ప్రమాదకరమని, ఎవరో ఒకరు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉంటుందని ప్రొడ్యూసర్ గిల్డ్ చేసిన సూచనతో సయోధ్య కుదిరింది. సరిలేరు నీకెవ్వరు చిత్రాన్ని ఒక్క రోజు ముందుగా విడుదల చేయడానికి ఒప్పందం కుదిరింది. అలా సరిలేరు నీకెవ్వరు చిత్రం 11న విడుదలంటూ ప్రచారం నిర్వహించారు. కుదిరిన సయోధ్య ప్రకారం అల్లు అర్జున్ అల వైకుంఠపురములో చిత్రం 12న విడుదల కావాలి. విడుదల తేదీలు దగ్గర పడుతున్న సమయంలో సరికొత్త కథనాలు కన్ఫ్యూజన్ సృష్టిస్తున్నాయి. అల వైకుంఠపురములో చిత్రాన్ని జనవరి 10నే విడుదల చేసేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తోందన్న వార్తలు వినిపిస్తున్నాయి. దీనికి ప్రతిగా సరిలేరు నీకెవ్వరు చిత్రాన్ని సైతం జనవరి 10నే తెచ్చేందుకు ఆ చిత్రబృందం సిద్ధమవుతున్నట్టు సమాచారం. అధికారికంగా ఎటువంటి ప్రకటనలు లేకున్నా -కథనాలు మాత్రం గందరగోళం సృష్టిస్తున్నాయి. ఒకవేళ ఆ పంతాలకేపోతే, ఓపెనింగ్స్ విషయంలో నష్టం వాటిల్లడం ఖాయంగా కనిపిస్తోంది. పైగా, చివరి క్షణంలో తేదీలు మార్పువల్ల ఎవరికి లాభం? అన్న ప్రశ్నలూ ప్రమాదానికి దారితీయొచ్చు. రెండు చిత్రాల విడుదలకు సంబంధించి పూర్తయిన ప్రక్రియను మళ్లీ నిర్వహించటం అంత సులువు కాదన్నది నిజం. ప్రస్తుత వాతావరణంలో హీరోల మధ్య వార్‌లు లేకుండా ప్రశాంతమైన వాతావరణమే టాలీవుడ్‌లో బలపడుతోంది. ఈ పరిస్థితికి భిన్నంగా -సినిమాల మధ్య యుద్ధానికి తెరలేపితే సంభవించే పర్యావసానాలకు ఎవరోఒకరు బాధ్యత వహించక తప్పదు. ఏదిఏమైనా ఆయా సినిమాల దర్శక నిర్మాతలు అసలు విషయాన్ని ప్రకటించేవరకూ కథనాలకు బ్రేకులు పడేలా లేవు. ఈలోగానే ఆయా చిత్ర బృందాలు మేల్కొని కన్ఫ్యూజన్‌కు క్లారిటీ ఇవ్వకపోతే -ముప్పు తప్పదన్నది కాదనలేని వాస్తవం.






లవ్ అంబ్రెల్లా..

నితిన్-రష్మిక జంటగా వెంకీ కుడుముల దర్శకత్వంలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మిస్తున్న తాజా చిత్రం భీష్మ. సూర్యదేవర నాగవంశీ నిర్మాత. సినిమానుంచి ఇప్పటికే హీరో హీరోయిన్ల రొమాన్స్‌కి సంబంధించిన పోస్టర్లు సెన్సేషన్ అయ్యాయి. కొద్దిరోజుల క్రితం బయటకు వచ్చిన సింగిల్స్ ఆంథమ్ సైతం సినిమాపై అంచనాలు పెంచింది. ఒంటరి కుర్రాడి తుంటరి వేషాలు కాన్సెప్ట్‌తో సినిమాని వెంకీ కుడుముల తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రంలో 'నా లవ్ కూడా విజయ్‌మాల్యా లాంటిదిరా... కన్పిస్తుంటుంది కానీ క్యాచ్ చెయ్యలేం' అనే డైలాగ్ వైరలవ్వడం తెలిసిందే. ఇదిలావుంటే, కొత్త ఏడాదిలోకి అడుగుపెడుతున్న సందర్భంగా భీష్మ టీం ఓ కొత్త పోస్టర్‌ని విడుదల చేసింది. ఇది కూడా భీష్మ రేంజిని పెంచేదిలానే కనిపిస్తుంది. గొడుగు పట్టకుని రష్మికను పడేయడానికి తిప్పలు పడుతున్న నితిన్ కనిపిస్తున్నాడు. రష్మిక అప్పియరెన్స్, వెనక నితిన్ ఎక్స్‌ప్రెషన్ హైలెట్ అవుతున్నాయి. గొడుగు లవ్‌తో గాళ్‌ని లైన్‌లో పెట్టాడో లేదో తెలియాలంటే -భీష్మ కోసం ఎదురు చూడాల్సిందే.

క్రాక్ లుక్ ఇలా




డాన్ శీను, బలుపు చిత్రాలతో రవితేజ టెంపర్ ఎలావుంటుందో చూపించిన గోపీచంద్ మలినేని -ఇప్పుడు క్రాక్ పోలీస్‌గా రవితేజను ఆడియన్స్ ముందుకు తేనున్నాడు. రవితేజ, గోపీచంద్ మలినేని కాంబోలో వస్తోన్న మూడో ప్రాజెక్టు -క్రాక్. కొత్త ఏడాది సందర్భంగా రవితేజను పోలీస్ గెటప్‌లో రివీల్ చేస్తూ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ ప్రాజెక్టులో రవితేజతో శృతిహాసన్ జోడీ కడుతోంది. ఠాగూర్ మధు నిర్మిస్తోన్న సినిమా ఇప్పటికే రెండో షెడ్యూల్ పూర్తి చేసుకుంది. కొద్దిరోజుల క్రితం టైటిల్ పోస్టర్‌పై రివీల్ చేసిన రవితేజ మాస్ గెటప్‌కు మంచి రెస్పాన్స్ రావడం తెలిసిందే. ఇప్పుడు బ్యాక్‌డ్రాప్‌లో ఖైదీలు భయంతో చూస్తుంటే.. చేతిలో గాజు బాటిల్ పట్టుకుని ఇంటెన్స్ లుక్స్‌తోవున్న పోలీస్ ఆఫీసర్‌గా రవితేజను చూపించారు. పోలీస్ డిపార్ట్‌మెంట్‌లోని కొన్ని ముఖ్య సంఘటనలు తీసుకుని కమర్షియల్ ఎలిమెంట్స్ మేళవింపుతో దర్శకుడు గోపీచంద్ మలినేని 'క్రాక్' కంటెంట్‌ను సిద్ధం చేశాడని తెలుస్తోంది. ఎస్‌ఎస్ థమన్ సంగీతం సమకూరుస్తుంటే, జికె విష్ణు సినిమాటోగ్రఫీ సమకూరుస్తున్నాడు. సముద్రఖని, వరలక్ష్మీ శరత్‌కుమార్ ముఖ్యపాత్రల పోషిస్తున్నారు. వచ్చే వేసవికి సినిమా వచ్చే అవకాశం లేకపోలేదు.

ఏమిటో సర్‌ప్రైజ్?



యంఎస్ రాజు. టాలీవుడ్‌లో అంచెలంచెలుగా ఎదిగిన నిర్మాత. ఎంత వేగంగా ఎదిగారో అంతే వేగంగానూ పడిపోయిన నిర్మాత. వెంకటేష్ 'శత్రువు'తో జైత్రయాత్ర మొదలెట్టి, పోలీస్ లాకప్, దేవి చిత్రాలతో బ్లాక్‌బస్టర్లు అందుకున్నారు. ఆయన స్పీడ్‌కు దేవీపుత్రుడు చిత్రం బ్రేక్ వేసింది. ఆ టైంలో సిద్ధార్థ -త్రిష కెమిస్ట్రీ ఫీస్ట్‌గా వచ్చిన నువ్వొస్తానంటే నేనొద్దంటానా సినిమా మళ్లీ యంఎస్ రాజుని హీరోని చేసింది. 2001 నుంచి 2005 వరకూ వరుస హిట్లుకొట్టిన రాజు -ప్రభాస్‌తో చేసిన 'పౌర్ణమి' సక్సెస్‌కు మళ్లీ బ్రేక్ వేసింది. దర్శకుడు ఎవరైనా అన్నీ ఆయనే దగ్గరుండి చూసుకునే రాజు -తరువాత దర్శకుడి అవతారమే ఎత్తినా ఫ్లాపులు ఎదురొచ్చి స్లో అయిపోయారు. వారసుడైన సుమంత్ అశ్విన్‌ను హీరోగా అరంగేట్రం చేయించినా -అతని సినిమాలూ వర్కౌట్ కాలేదు. ఒకప్పుడు వరుస అవార్డులు అందుకున్న యంఎస్ రాజు నుంచి కొంతకాలంగా సినిమాయే లేదు. కొత్త ఏడాదిలో యంఎస్ రాజు పెట్టిన ట్విట్టర్ పోస్ట్ ఇపుడు ఆసక్తి పెంచుతోంది. న్యూ ఇయర్ గ్రీటింగ్స్ చెబుతూనే 'అనౌన్స్‌మెంట్ ఇవ్వబోతున్నా. షాకవ్వకండి' అంటూ ట్వీట్ పెట్టారు యంఎస్ రాజు. యంఎస్ రాజు ఇక సినిమాలు తీయకపోవచ్చన్న ప్రచారాన్ని తిప్పికొడుతూ -ఆయన చేసిన ట్వీట్ ఆసక్తి రేకెత్తిస్తోంది. ఆయన చేయబోయే అనౌన్స్‌మెంట్ ఏమిటనేది వచ్చేవరకూ మిస్టరీ.



రవిబాబు క్రష్!

గతంలో అనసూయ, అమరావతి, అవును, అల్లరి లాంటి చిత్రాలను రూపొందించి దర్శకుడిగా తనకంటూ వైవిధ్యమైన ముద్రవేసుకున్న రవిబాబు తాజాగా మరో చిత్రాన్ని రూపొందించనున్నారు. ఫ్లయింగ్ ఫ్రాగ్స్ ప్రొడక్షన్స్ పతాకంపై స్వీయ నిర్మాణంలో ఆయన క్రష్ అనే చిత్రాన్ని రూపొందించడానికి సిద్ధమవుతున్నారు. చిత్రానికి సంబంధించిన ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. ఈనెల 24 నుండి ఈ సినిమా ప్రారంభం కానుందని యూనిట్ తెలియజేసింది. వీలైనంత వేగంగా సినిమాను పూర్తిచేసి వేసవికి సినిమా విడుదల చేయడానికి సన్నాహాలు జరుపుతున్నారు. యువతరానికి సంబంధించిన ఓ సమస్యను ఈ చిత్రంలో చర్చించనున్నారట. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన నటీనటుల ఎంపిక జరుగుతోంది. త్వరలో అన్ని వివరాలు ప్రకటిస్తామని యూనిట్ తెలియజేసింది. ఎప్పటికప్పుడు వైవిధ్యమైన కథనాలు ఎంచుకునే రవిబాబు ఈసారి యువతరానికి మెసేజ్ ఓరియెంటెడ్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లుగా బాలీవుడ్‌లో సమాచారం. త్వరలో అన్ని విషయాలు తెలియనున్నాయి.



ఖాళీగా ఉండలేను..

పనిలేకుండా ఒక్కరోజు నేను ఉండలేను. అసలు ఏ రోజుకారోజు ఏ పనిచేయాలని వెతుక్కుంటూనే వుంటాను. ఓ రకంగా ఖాళీగా కూర్చోవడం చాలా కష్టం. వరుస సినిమాలతో బిజీగానే ఉన్నాను అంటూ తనకు తాను చెప్పుకుంటోంది తమన్నా. విషయంలోకి వెళితే.. ఇటీవల ఆమె సరిలేరు నీకెవ్వరు చిత్రంలో స్పెషల్ సాంగ్‌లో మహేష్‌బాబుతో కలిసి నృత్యాలు చేసింది. దీంతో టాలీవుడ్‌లో ఓ పుకారు హల్‌చల్ చేస్తోంది. తమన్నా చేతిలో సినిమాలు లేవని, అందుకే స్పెషల్ పాటలో కూడా నటించిందని, గోళ్లు గిల్లుకుంటూ కూర్చునేకన్నా ఏదోవిధంగా కనపడ్డం మంచిదే కదా. అందులోనూ మహేష్‌బాబు సరసన అంటే మరింత మంచిది కదా అంటూ వినిపిస్తున్న వార్తలు. ఈ విషయం తమన్నా చెవిదాకా వెళ్లడంతో స్పందించింది. సరిలేరు నీక్వెవరులో స్పెషల్ పాటలో నటించడానికి ఓ ప్రత్యేకమైన కారణం ఉందని, ఎఫ్2లాంటి బ్లాక్‌బస్టర్ చిత్రాన్ని నాకిచ్చిన దర్శకుడు అనీల్ రావిపూడి ఈ అవకాశం ఇస్తే కాదనలేకపోయానని చెప్పుకొచ్చింది. ఓ రకంగా దర్శకుడి కోరిక మేరకే ఈ పాటలో నటించానని, దాదాపు గత సంవత్సరం 20 సినిమాలదాకా నటించిన నేను, ఈ చిత్రంలో ఈ పాటతో మంచి ముగింపు పలకాలని చేయడం కూడా ఓ సెంటిమెంట్ అని చెప్పుకొచ్చింది. నా గురించి అనేక వదంతులు ప్రచారంలో ఉన్నాయని, పనిలేక ఇంట్లో కూర్చున్నానని అనుకోవడం కరెక్టు కాదని చెప్పుకొచ్చింది. ఈ సంవత్సరంలోకూడా 360 రోజులు పనిచేస్తూనే ఉంటానని, కాల్షీట్‌లో డేట్స్ వుంటే ఏ భాషలోనైనా నటించాడానికి సిద్ధమంటూ చెప్పుకొచ్చింది. ప్రస్తుతం తన చేతిలో బోలే చుడియా, సీటీ మార్ చిత్రాలు ఉన్నాయని, పెట్రోమాక్స్, దటీజ్ మహాలక్ష్మి విడుదలకు సిద్ధంగా ఉన్నాయని చెప్పుకొచ్చింది. సో.. తమన్నా వెరీ బిజీ!



బస్తీ బాలరాజుగా

అరగేంట్రం చేసిన ఆర్‌ఎక్స్ 100 తప్ప -చెప్పుకోడానికి కార్తికేయ కెరీర్‌లో మరో గొప్ప సినిమా లేకుండా పోయింది. మొదటి సినిమాతో యూత్, మాస్ ఆడియన్స్‌కి కనెక్టైన కార్తికేయ -తరువాత ఎంత వేగంగా సినిమాలు చేస్తున్నాడో అంతే వేగంగా పోతున్నాయి. కొద్దిరోజుల క్రితం వచ్చిన 90ఎంఎల్, అంతకుముందు చేసిన హిప్పీ చిత్రాలైతే -కార్తికేయ మార్కెట్‌ని పూర్తిగా వెనక్కి లాగేశాయి కూడా. కెరీర్ క్రైసిస్ నుంచి బయటపడటానికి కార్తికేయ తదుపరి సినిమా సన్నాహాల్లో బిజీ అయ్యాడు. ఆ సినిమా -చావుకబురు చల్లగా. అధికారికంగా టైటిల్ కన్ఫర్మ్‌కాకున్నా -దీనిపై ఓ నిర్ణయానికి వచ్చేశారని తెలుస్తోంది. మంచి కథలను ఎంచుకుంటూ వెళ్తున్న బన్నీవాసు ప్రొడెక్టుగా వస్తోన్న ఈ ప్రాజెక్టును కొత్త దర్శకుడు కౌశిక్ పెగళ్లపాటి తెరకెక్కించనున్నాడట. ఈ సినిమాలో 'బస్తీ బాలరాజు'గా కార్తికేయ కనిపిస్తాడన్నది తాజా సమాచారం. కార్తికేయ సరసన లావణ్య త్రిపాఠి కనిపించనుంది. ఈమధ్యే వచ్చిన అర్జున్ సురవరం హిట్టుతో హమ్మయ్య అనుకున్న లావణ్యకు -ఈ ప్రాజెక్టులో చాన్స్ రావడం కలిసొచ్చే కాలమే అనుకోవాలి. కాకపోతే కార్తికేయ -లావణ్య కెమిస్ట్రీ ఎంతవరకూ వర్కౌటవుతుందన్నది చూడాలి. ప్రతిరోజూ పండగే చిత్రంతో మంచి హిట్టుకొట్టిన బన్నీవాస్ -త్వరలోనే ఈ ప్రాజెక్టుకు సంబంధించి అధికారిక ప్రకటన చేయొచ్చన్న టాక్ వినిపిస్తోంది.

వెరైటీ అలీషా



సంగీత దర్శకుడు ఆర్.పి.పట్నాయక్ ఎప్పటికప్పుడు వైవిధ్యమైన ప్రయత్నాలు చేయడం చూస్తూనే ఉన్నాం. ఈ ఏడాది ఆర్.పి దర్శకత్వంలో రూపొందుతున్న మరో చిత్రం అలిషా. రెగ్యులర్ జోనర్‌కు భిన్నంగా డిఫరెంట్ ఫార్మాట్‌లో చిత్రాన్ని రూపొందించనున్నారట. హారర్ థ్రిల్లర్‌గా తెరకెక్కించే చిత్రానికి సంబంధించిన ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఐఎస్‌ఎమ్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై డాక్టర్ సోనాల్ రూపొందిస్తున్న ఈ సినిమాకు దర్శకత్వంతోపాటుగా రచన, సంగీత దర్శకత్వ బాధ్యతలు కూడా ఆర్.పి.పట్నాయక్ నిర్వహిస్తున్నారు. ఐశ్వర్య సాల్వి, వేదాంత్ సలూజ, రిచా కల్రా, అక్షయ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాకు సంబంధించిన షూటింగ్ ప్రారంభించారు. సినిమా అంతా విదేశాల్లోనే చిత్రీకరణ జరుపుకోనుంది. స్టార్ హీరోలు నటించిన అనేక చిత్రాలు డాల్బీ ఎట్మాస్ సౌండ్‌తో విడుదలైనా ఆ సాంకేతికత కోసం తయారుచేసిన కథలు మాత్రం ఇంతవరకు మన దేశంలో రాలేదని, ఆ లోటు భర్తీ చేయడానికే ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నానని ఆర్.పి తెలిపారు. ఓ అద్భుతమైన థ్రిల్లర్ కథనానికి అత్యున్నత ప్రమాణాలు తోడైతే ఔట్‌పుట్ స్థాయి ఏ విధంగా వుంటుందో ఈ చిత్రంలో తెలియజేయనున్నామని ఆయన వివరించారు.